తర తరాల పిల్లల కథలు
రూ॥70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 222 | శుక్రవారం | 31-01-2025 | హైదరాబాద్ | Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


## వర్సిటీ అధ్యాపకుల రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లకు పెంపు

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల పదవీవిరమణ వయసును 60 నుంచి 65 సంవత్సరాలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. యుజిసి వేతనస్కేల్‌ను పొందుతున్న ఉపాధ్యాయులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణ ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాయాల్లో ఉపాధ్యాయుల కొరత నేపథ్యంలో పదవీవిరమణ వయసు పెంచుతున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

## 5న కేబినేట్

### 7వ తేదీన ప్రత్యేక అసెంబ్లీ?

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ''సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే2024) నివేదిక సిద్ధమైన నేపథ్యంలో ఫిబ్రవరి 5న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నివేదిక ఆధారంగానే బిసి రిజర్వేషన్ల పెంపు విషయంలో ఫిబ్రవరి 7న శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. 'సమగ్ర కుటుంబ సర్వే నివేదిక'ను అధికార యంత్రాంగం ఫిబ్రవరి2న రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించనుంది. ఆ వెంటనే మంత్రివర్గ ఉప సంఘం ఆ నివేదికపైన చర్చించి, ఫిబ్రవరి 5న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గానికి సమర్పించే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఈ నివేదికపైన మంత్రివర్గం చర్చించి, ఆమోదముద్ర వేయనుంది. ఆ తర్వాత వార్డుల వారీగా బిసి కులాల లెక్కలు, బిసిల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరంగా సేకరించిన సమగ్ర వివరాలను తరువాయి 2లో

# పెను విషాదం

## యుఎస్‌లో జెట్ విమానం – సైనిక హెలికాప్టర్ ఢీ

## 67 మంది దుర్మరణం



ప్రమాదాన్ని నివారించలేకపోయారు : ట్రంప్ మండిపాటు

తక్షణం దర్యాప్తు ప్రారంభం : రక్షణమంత్రి హెగ్సత్



**వాషింగ్టన్ :** వాషింగ్టన్ డి.సిలో ప్రయాణికుల జెట్ విమానానికి శిక్షణలో ఉన్న అమెరికా సైనిక హెలికాప్టర్ అడ్డుగా రావడంతో రెండూ ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో మొత్తం 67 మంది మరణించారు. వాషింగ్టన్ డి.సిలోని పోటోమక్ నదిపై గురువారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం) ఈ ఘటన జరిగింది. విమాన శకలాలు, హెలికాప్టర్ శకలాలన్నీ నదిలో పడిపోయాయి. జెట్ విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు విమాన సిబ్బంది ఉన్నారు. అమెరికాకు చెందిన బ్లాక్‌హ్యాక్ సైనిక శిక్షణ హెలికాప్టర్‌లో ముగ్గురు ఉన్నారు. పలువురు క్రీడా పముఖులు కూడా మృతుల్లో ఉన్నారు. స్కేటింగ్ క్రీడాకారులు, వారి కోచ్‌లు, కుటుంబాలతోసహా ఈ విమానంలో ప్రయాణం చేస్తుండగా ఘటన జరిగింది. కొద్దిరోజులక్రితం అమెరికా రక్షణమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పెటే హెగ్సత్ ఈ ప్రమాదంపై స్పందిస్తూ తక్షణం ఈ ఘటనపై సైన్యం, రక్షణశాఖలు దర్యాప్తు ప్రారంభించాయని సోషల్‌మీడియాలో పోస్టింగ్ పెట్టారు. కడపటి వార్తలు అందేసరికి అనేక విభాగాలకు చెందిన సిబ్బంది పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. 300 మంది సిబ్బంది బోట్లు వేసుకుని నదిలోకి దిగి సజీవులకోసం అన్వేషించారు. సహాయ చర్యలు చేపట్టి తొలి విడత 27 మృతదేహాలను వెలికితీశారు. తీవ్రమైన చలివాతావరణంమధ్య పరిస్థితులు సహాయ చర్యలకు ప్రతికూలంగా ఉన్నాయని వాషింగ్టన్ డి.సి అగ్నిమాపక దళ ప్రధానాధికారి జాన్ డన్నెల్లీ చెప్పారు. ఇప్పటివరకూ సజీవులు ఎవ్వరూ నదిలో ఉన్న శకలాలలో కనిపించలేదని సహాయబృందాలు వెల్లడించాయి. నదికి సమీపంలోనే రోనాల్డ్ రీగన్ అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. వాషింగ్టన్ నైరుతీ ప్రాంతంలో ఉన్న ఈ విమానాశ్రయం వర్జీనియాలో ఉన్న అతి పెద్ద డల్లెస్ ఇంటర్నేషనల్ విమానాశ్రయం కంటే సమీపంగా ఉండటంతో ఎక్కువ విమానాలు ఇక్కడే దిగేందుకు ఇష్టపడతాయి. వాషింగ్టన్ సమీపంలోని రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టులో జెట్ విమానం తరువాయి 2లో

### నేటి నుంచి పార్లమెంటు

# బడ్జెట్ సమావేశాలు

● అస్త్రాలతో 'ఇండియా' పార్టీలు సిద్ధం ● వక్ఫ్ సహా 16 బిల్లుల ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం సంసిద్ధత ● నేటి ఉదయం రాష్ట్రపతి ప్రసంగంతో సమావేశాలు షురూ ● రేపు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ● కుంభమేళా విషాదంపై చర్చ జరగాల్సిందేనని అఖిలపక్ష భేటీలో ప్రతిపక్షాల డిమాండ్



**న్యూఢిల్లీ :** రెండు విడతలుగా జరిగే పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు నేటి నుండి ప్రారంభం అవుతున్నాయి. ఏప్రిల్ 4వ తేదీతో సమావేశాలు పూర్తవుతాయి. అధికారపక్ష ప్రజా వ్యతిరేక చర్యలను నిలదీసేందుకు 'ఇండియా' కూటమి పార్టీలు సిద్ధమయ్యాయి. పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్మూ శుక్రవారంనాడు ప్రసంగించడంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతాయి. ఉదయం 11 గంటలకు ఆమె ప్రసంగం మొదలవుతుంది. ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడతారు. మొదటివిడత బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 10వ తేదీన తిరిగి ప్రారంభం అవుతాయి. ఏప్రిల్ నాలుగోతేదీతో బడ్జెట్ సమావేశాలు పూర్తి అవుతాయి. మహా కుంభమేళాలో తొక్కిసలాట, 30 మందికి పైగా మరణించిన ఘటనపై చర్చించి తీరాలని ప్రతిపక్షాలన్నీ తీర్మానించుకున్నాయి. అలాగే వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చల్లో ప్రభుత్వ ఏకపక్ష ఆలోచనలపై తీవ్రదాడికి దిగేందుకు సిద్ధమయ్యాయి. దీంతోపాటు 16 బిల్లులకు సభ ఆమోదముద్ర వేయించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ బిల్లుపై ఇప్పటికే పార్లమెంటు సభ్యుల సంయుక్తకమిటీ చర్చించి లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు తన నివేదికను సమర్పించింది. కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారీ పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ పార్లమెంటు సమావేశాల్లో ''ఇండియా'' కూటమి పార్టీలు అన్ని సమస్యలను సభలో ప్రస్తావిస్తాయని తరువాయి 2లో

### ప్రతిపక్ష ఎంపిలకు

## ప్రాధాన్యత ఇవ్వాలి : సిపిఐ

**బ**డ్జెట్ సమావేశాలు అందరినీ కలుపుకుని ముందుకు వెళ్ళేవిధంగా, అందరినీ భాగస్వాములను చేసేదిగా ఉండాలని, ఎంపీలందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, ముఖ్యంగా ప్రతిపక్ష ఎంపీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సిపిఐ పార్లమెంటరీ పక్ష నాయకులు పి.సందోష్ కుమార్ డిమాండ్ చేశారు. తమ గళాన్ని వినిపించేందుకు పార్లమెంటులో చిన్న పార్టీలకు ఎక్కువ సమయం కేటాయించాలని కోరారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సభలో సభ్యులను మందలించడానికి ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్న తరువాయి 2లో



## ఉసురు తీసిన 'ఉపాధి' హామీ

మట్టిదిబ్బలుకూలి ఇద్దరు దుర్మరణం

సిద్దిపేట జిల్లా గోవర్ధనగిరి గ్రామంలో ఘటన

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి/అక్కన్నపేట

సిద్దిపేట జిల్లా అక్కెనపల్లి మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మట్టిదిబ్బ కూలగా తల్లీ కూతుళ్లు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రగాయాలకు గురైనారు. ఈప్రమాద ఘటనలో తరువాయి 2లో



### ఖమ్మం మార్కెట్‌కు

## పోటెత్తిన మిర్చి

జెండా పాట రూ. 14వేలు : విక్రయం రూ.13వేల లోపే

ఎర్రబంగారం రైతులకు తప్పని కష్టాలు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్

ఖమ్మం మార్కెట్‌కు ఎర్ర బంగారం పోటెత్తింది. గురువారం ఖమ్మం మార్కెట్‌కు 60వేల బస్తాలకు పైగా మిర్చి విక్రయానికి రైతులు తీసుకు వచ్చారు. ఈ ఏడాది ధర తగ్గిందని రైతాంగం ఆందోళన చెందుతున్న వేళ వ్యాపారులు మరోసారి తమ నైజాన్ని బయట పెట్టుకున్నారు. రెండు రోజుల క్రితంతో పోల్చినప్పుడు రూ.1,000 క్వింటాకు ధర తగ్గించారు. జెండా పాట తరువాయి 2లో

## మంత్రివర్గంలో చర్చించిన తరువాతే

రిజర్వేషన్ల పెంపు, స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం

గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి

అధిష్టానానికి ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా – రెండుమూడు రోజుల్లో ప్రకటన

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

రిజర్వేషన్ల పెంపు విషయంలో మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాతనే, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపైన ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలోపేతంపైన దృష్టి పెట్టామని, జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లలో గెలుపొంది,మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం తరువాయి 2లో





సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గురువారం ప్రారంభమయ్యాయి. అంతకుముందు జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని గాంధీ విగ్రహం వద్ద సిపిఐ జాతీయ నాయకులు నివాళులర్పించారు.

## లౌకికవాదానికి బిజెపి తూట్లు

గాంధీ స్ఫూర్తితో ప్రజాస్వామ్య రక్షణకు కృషి: రాజా

**విశాఖ:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేస్తోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం జివిఎంసి వద్ద గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ మహాత్మాగాంధీ అన్ని తరాలవారికీ ఆదర్శమని, అన్ని మతాల వారినీ ఏకతాటిపైకి తెచ్చిన ఘనత గాంధీకి దక్కుతుందన్నారు. గాంధీని చంపిన గాడ్సేకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు దండలు వేసి నివాళులర్పించడమంటే... లౌకికవాదం, ప్రజాస్వామ్యం పట్ల వారికి ఏమాత్రం గౌరవం లేదని అర్థమవుతోందని విమర్శించారు. గాంధీ స్ఫూర్తితో ప్రజల హక్కుల రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణకు సిపిఐ పోరాటాలు చేస్తోందని అన్నారు.

సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అనీరాజా, అమర్‌జిత్ కౌర్, బాలచందర్ కాంగో, కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ ఏపి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బిల్లుపై స్పీకర్‌కు జెపిసి నివేదిక

**న్యూఢిల్లీ:** వక్ఫ్ సవరణ బిల్లుపై నివేదికను పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జెపిసి) గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేసింది. జెపిసి చైర్మన్ జగదాంబికా పాల్ పార్లమెంటు హౌస్‌లోని కార్యాలయంలో ఓం బిర్లాతో భేటీ అయి ఈ నివేదికను అందజేశారు. మొత్తం 44 సవరణల్లో 14ను జెపిసి ఆమోదం తెలిపింది. ముసాయిదా శాసనంపై ఓటింగ్‌లో 1511 లెక్కన ఓట్లు వచ్చాయి. అయితే నివేదికపై ప్రతిపక్ష సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అధికార బిజెపి సభ్యుల ప్రతిపాదనల ఆధారిత సవరణలను జెపిసి ఆమోదించింది. విపక్ష సభ్యుల ప్రతిపాదనలు అన్నింటినీ తిరస్కరించింది. దీంతో వక్ఫ్ బోర్డు వినాశానికి చర్యలకు జెపిసి పూనుకున్నట్లు ప్రతిపక్షాలు విమర్శించాయి. బిజెపి ప్రతిపాదనలతో బిల్లుకు సవరణలను ఆమోదించిందని దుయ్యబట్టారు. పాల్ కమిటీ ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడి చేయడమే కాకుండా వక్ఫ్‌బోర్డుల పనితీరులో ప్రత్యక్ష జోక్యం కోసం ఈ బిల్లును తీసుకొచ్చారని విపక్ష సభ్యులు ఆరోపించారు. గతేడాది ఆగస్టులోనే ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని బిజెపి సభ్యులు ఒత్తిడి తెచ్చారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనానికి ఇది దోహదమవుతుందని వారు అనడం తెలిసిందే.

# పాఠశాల విద్యలో ఎఐ

పూర్తిస్థాయిలో ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయం

బెంగుళూరులోని 'ఎక్‌స్టెప్ -ఫౌండేషన్'ను సందర్శించిన విద్యా శాఖ ప్రతినిధి బృందం



ప్రజాపక్షం/హైదరాబాద్

పాఠశాల విద్యలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌ను(ఎఐ) పూర్తిస్థాయిలో ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల విద్యను మరింత నాణ్యతా ప్రమాణాలతో అందించేందుకు ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ (ఎఐ), డిజిటల్ ఇనీషియేటివ్స్‌లను పాఠశాల విద్య శాఖ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోనుంది. 'ఎక్‌స్టెప్ ఫౌండేషన్' భాగస్వామ్యంతో 'ఎఐ' ఆధారిత విద్యను ప్రవేశ పెట్టేందుకు తెలంగాణ విద్యాశాఖ సమగ్ర ప్రణాళికను రూపొందిస్తోంది. డిజిటల్ ఇనిషియేటివ్స్, ప్రాథమిక స్థాయిలో అభ్యసన నైపుణ్యాల పెంపు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్నేహపూర్వక అభ్యసన పద్ధతుల్లో సహాయం అందించేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగానే బెంగుళూరు కేంద్రంగా పనిచేస్తున్న 'ఎక్‌స్టెప్ ఫౌండేషన్'ను రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ ప్రతినిధి బృందంలో రాష్ట్ర ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఇ.వినర్సింహా రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమా హారతి, గరిమ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యాశాఖ ప్రతినిధి బృందం బెంగళూర్‌లో 'ఎక్ స్టెప్ ఫౌండేషన్' ప్రతినిధులతో కలిసి విద్యారంగంలో చేపట్టాల్సిన పలు ఇన్షియేటివ్‌లపై చర్చించింది. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమెరసీ, ప్రాథమిక విద్యా తరువాయి 12లో

## చట్టానికి ఎవరూ అతీతులు కారు

స్పష్టంచేసిన 'సుప్రీంకోర్టు'

మహిళా ఐపిఎస్ అధికారి, వ్యాపారవేత్త మధ్య వివాదం కేసులో కీలకవ్యాఖ్య

**న్యూఢిల్లీ :** ఈ దేశంలో 'చట్టానికి ఎవరూ అతీతులుకారు' అని గురువారం అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక వ్యక్తి , ఐపిఎస్ అధికారిగా ఉండి విడిపోయిన అతడి భార్య కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈవిధంగా వ్యాఖ్యానించింది.సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్.గవాయి, జస్టిస్ ఆగస్టిన్ జార్జి మాసిహ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్యధర్మాసనం.. ఆ వ్యక్తి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఐపిఎస్ ఆఫీసర్‌గా ఉండి విడిపోయిన భార్య మూలంగా తన క్లయింట్ జీవితాంతం బాధపడుతున్నారని వివరించడంతో ధర్మాసనం ఈ విధంగా స్పందించింది. పార్టీలు తమ వివాదాలను న్యాయపరమైన ఆసక్తికి అనుగుణంగా తరువాయి 12లో

### జిహెచ్‌ఎంసి సర్వసభ్య సమావేశం

# రసాభాస

సభ్యుల అరుపులు, కేకల మధ్య అంచనాబడ్జెట్ ఆమోదం

బిఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వివాదం

సభలో స్వల్ప ఉద్రిక్తత



ప్రజాపక్షం/హైదరాబాద్

జిహెచ్‌ఎంసి సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సభ్యుల ఆందోళన మధ్యే బడ్జెట్‌ను ఆమోదించారు. రూ.8,440 కోట్లతో రూపొందించిన అంచనా బడ్జెట్‌కు ఎలాంటి చర్చ జరగకుండానే ఆమోదం లభించింది. 2024–25 వార్షిక రూ.8,118 కోట్లతో రివైజ్డ్ బడ్జెట్‌ను బిఆర్‌ఎస్, బిజెపి, కాంగ్రెస్ సభ్యుల అరుపులు, కేకల మధ్యనే బడ్జెట్‌ను ఆమోదిస్తున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రకటించారు. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం పాలకమండలి ప్రత్యేక బడ్జెట్, సాధారణ తరువాయి 12లో

# అమెరికా హైటెక్ కంపెనీల ఆధిపత్యానికి చెక్ పెట్టిన చైనా అడ్వాన్స్‌డ్ ఎఐ



**లండన్ :** అమెరికాలోని హైటెక్ కంపెనీల ఆధిపత్యాన్ని చైనా అడ్వాన్స్‌డ్ కృత్రిమ మేధ టెక్నాలజీ సవాలు చేసింది.చైనా కృత్రిమ మేధ సంస్థ ''డీప్ సీక్'' ఈ నెలలోనే రెండు వెర్షన్‌లను విడుదల చేయడంతో అమెరికా కంపెనీలు దిగ్భ్రాంతి చెందాయి. వినియోగదారులకు మార్కెట్‌లో అతి తక్కువ ఖర్చుతో వీటిని అందుబాటులోకి తీసుకురావడంతో అమెరికా టెక్ దిగ్గజ కంపెనీలు నివ్వెరపోయాయి. అనివార్యమైన పరిస్థితుల్లో కొత్తపోటీదారుకు ఆహ్వానం పలుకుతూ తమ వ్యవస్థలను మరింత పటిష్టం చేసుకుని భారీపోటీతో ముందుకు వస్తామని ప్రకటించాయి. అమెరికాలో ఏకస్వామ్యంతో ఆధిపత్యం చెలాయిస్తున్న కంపెనీల కృత్రిమ మేధ ఫలితాలనే చైనా అకుంర సంస్థ కూడా మార్కెట్‌లో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడంతో డీప్ సీక్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. డీప్‌సీక్ అంకురసంస్థ సాధించిన ఈ విజయాన్ని చైనాలో నూతన సంవత్సర వేడుకలు చేసుకుంటున్న ప్రజలు మరో బోనస్‌గా భావించి పెద్ద ఎత్తున సెలబ్రేషన్స్ చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో నెటిజన్లు అమెరికా అధిపత్యాన్ని దెబ్బతీస్తున్న డీప్‌సీక్‌ను ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. తమ దేశానికి చెందిన చిప్‌లను మరింత సమర్థవంతంగా చైనా ఉపయోగించుకుంటున్నదని అమెరికా భావిస్తున్నది. అందువల్ల చైనాకు మైక్రో చిప్ ఎగుమతులపై అంక్షలకు దారితీస్తుంది. అమెరికాకు చెందిన ఓపెన్ ఎఐ, మెటా, గూగుల్, ఇతర కంపెనీలు లక్ష్యాల సాధనలో వినియోగదారులకు చైనా ఉపయోగిస్తున్నదానికంటే తక్కువ మెమోరానీ అందుబాటులో ఉంచుతున్నాయని డీప్‌సీక్ రుజువు చేసింది. దీనివల్ల అమెరికాకు చెందిన చిప్ మేకర్ నివిడియా స్టాక్ మార్కెట్‌లో అనేక బిలియన్ డాలర్ల మేరకు చాలా తీవ్రంగా నష్టపోయింది. మార్కెట్‌లో మరింత సమర్థవమైన చిప్‌లతో తాము పోటీకి దిగుమని నివిడియా ప్రకటించాల్సివచ్చింది. ఇతర దేశాల సాంకేతిక పరిజ్ఞానంపై చైనా ఆధారపడే రోజులు పోయాయని ఇది రుజువు చేసింది. చైనా సాంకేతికత టెక్నాలజీ, చిప్, ఎఐ పరిశ్రమలో కొత్త నాణ్యతా ప్రమాణాలను ప్రవేశపెట్టింది. ఈనాడు అమెరికా అధిపత్యం కృత్రిమ మేధోరంగంలో తీవ్రమైన సవాలు విసురుతున్నది. ఇది మానవ జీవితాలపైన, అంతరిక్ష అన్వేషణా పరిశోధనలపైనా తీవ్రమైన ప్రభావం చూపిస్తుంది. ఇప్పుడు చైనా ఆర్థిక వ్యవస్థ చాలా శక్తిమంతమైన అభివృద్ధితో భవిష్యత్తులోకి దూసుకుపోతోంది. అమెరికాను మించిపోతున్నది. కొద్ది సంవత్సరాలలో చైనా ఈ సాంకేతిక పరిశ్రమలో తన లక్ష్యాలను సాధిస్తుంది. సోషలిస్టు ప్రణాళికతో మార్కెట్ ప్రోత్సాహకాలను అందించే సామర్థ్యాన్ని సంతరించుకుంటుంది. అందుకే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ డీప్‌సీక్‌ను పెద్ద సవాలుగా తీసుకున్నారు. డీప్ సీక్ ఆవిష్కరణలను ఒక మేల్కొల్పుగా తీసుకుని జాగ్రత్త పడాలని అమెరికా టెక్ ఎఐ కంపెనీలను హెచ్చరించారు. ఈ వారంలో జరిగిన ఈ పరిణామాలు అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బతీశాయనడంలో ఎలాంటి సందేహం లేదు.




# మరో ఎనిమిదిమంది బందీలను విడుదల చేసిన హమాస్



**గాజా :** కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా గురువారంనాడు మూడోవిడత మరో ఎనిమిది మంది బందీలను హమాస్ సంస్థ విడుదల చేసింది. వీరిలో ప్రముఖంగా ఇజ్రాయెలీ సోల్జర్ అర్బెల్ యెహుద్ ఉన్నారు. ఆమెతోపాటు గాజీ మోజెస్‌ను మరో ఐదుగురు థాయ్‌లాండ్‌కు చెందిన బందీలను కూడా విడుదల చేసింది. వీరిని ఖాన్ యూనిస్‌లో ఎక్కడ నుండి కిడ్నాప్ చేశారో అదే ప్రదేశంలో సిద్ధంగా ఉండి ఎదురుచూస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బందికి హమాస్ అప్పగించింది. ఆ తర్వాత రెడ్‌క్రాస్ సిబ్బంది వారిని ఇజ్రాయెలీ సైనికులకు అప్పగించగా వారు సురక్షితంగా స్వదేశం చేరుకుని కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న ఐదుగురు థాయ్‌లాండ్ వాసులు థెన్నా పాంగ్‌సాక్, సథియమ సువాంఖామ్, శ్రీయాన్ వాచరా, సీథో బన్నావత్, రమ్‌నావ్ సురాసక్‌లు హమాస్ చెరనుండి విడుదలైనవారిలో ఉన్నారు. కాగా జబాలియాలోని శరణార్థ శిబిరం నుండి ఇజ్రాయెలీ సైనికుడు అగం బెర్గర్‌ను విడుదల చేసిన తర్వాత ఖాన్ యూనిస్‌లో ఇద్దరు ఇజ్రాయలీ పౌర బందీలను విడుదల చేశారు. అదేవిధంగా జీవిత ఖైదీ విధించిన 32 మంది పాలస్తీనియన్లను కూడా ఇంకా ఇజ్రాయెల విడుదల చేయాల్సి ఉంది. కాగా ఇజ్రాయెల్ మొత్తం 110 మంది ఖైదీలను విడుదల చేస్తుందని భావిస్తున్నారు.

## ఖురాన్‌ను దగ్ధం చేసిన వివాదాస్పద ఇరాన్ పౌరుడు కాల్చివేత



**స్టాక్‌హోం :** ముస్లిం మత పవిత్ర గ్రంథం ఖురాన్‌ను ఉద్దేశపూర్వకంగా దగ్ధం చేసి ప్రపంచవ్యాప్తంగా పలు ముస్లిం దేశాలలో నిరసనలకు కారకుడైన వ్యక్తి స్వీడన్‌లో జరిగిన కాల్పుల్లో మరణించాడు. స్వీడన్ పోలీసులు గురువారంనాడు ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. ఇండోర్‌లోనే ఈ కాల్పులు జరిగాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఐదుగురు అనుమానితులను అరెస్టు చేశారు. ఇరాన్‌కు చెందిన క్రైస్తవ మతస్తుడు సాల్వన్ మోమికా (39) స్వీడన్‌లోని సోడెర్టల్జే నగరంలో ఆశ్రయం పొందుతున్నారు. ఆయన ప్రధానంగా నాస్తికవాది, ముస్లిం మత వ్యతిరేకి. 2023లో ఖురాన్‌ను తగలబెట్టడంతో ప్రపంచవ్యాప్తంగా ముస్లిం దేశాల్లో తీవ్ర నిరసన ప్రదర్శనలు జరిగాయి. స్వీడన్‌లో ఒక మసీదు ఎదుట ఖురాన్‌ను దగ్ధం చేయడంతోపాటు పరుష పదజాలంతో దూషించినట్లు వారిద్దరిపై నాలుగు కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనతో స్వీడన్‌కు, మధ్యాసియాలోని దేశాలకుమధ్య సంంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం స్వీడన్ కోర్టులో అతడితోపాటు మరో వ్యక్తి సాల్వన్ నజీమ్‌పై కూడా కేసు విచారణ కొనసగుతున్నది. ఇప్పుడు సాల్వన్ మోమికా కాల్పుల్లో మరణించడంతో కోర్టు ఈ కేసును ఫిబ్రవరి రెండో వారం వరకూ వాయిదా వేసింది.

## ఆకలి, అభద్రత మధ్య నవంబరులో హైతీ ఎన్నికలు



**పోర్ట్–ఔ–ప్రిన్స్ :** కరీబియన్ సముద్రంలోని దీవిదేశం హైతీలో ఈ ఏడాది నవంబరు 15వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. హైతీలో పరివర్తన కాల మధ్యంతర పాలనామండలి అధ్యక్షుడు లెస్లీ ఓల్టైర్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. క్యూబా, ప్యూర్టోరికోలమధ్య ఉన్న హిస్పానియోలా ఐలాండ్‌లో ఉన్న చిన్న దేశం హైతీ రిపబ్లిక్. దేశంలో కోటీ 14 లక్షల జనాభా ఉంటారు. 2016 నుండీ హైతీలో సార్వత్రిక ఎన్నికలు జరగలేదు. దేశరాజధాని యావత్తూ సాయుధ ముఠాల చేతుల్లోనే ఉంది. న్యాయబద్ధంగా దేశంలో ఎన్నికలు జరగాలంటే భద్రతను కట్టుదిట్టం చేయాలని అందరూ కోరుతున్నారు. ఈ ఏడాది నవంబరు 15 న పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయనీ, 2026 ఫిబ్రవరి ఏడో తేదీన కొత్త ప్రభుత్వానికి అధికార పగ్గాలు అందజేస్తామని లెస్లీ ఓల్టైర్ చెప్పారు. దేశంలో అంతర్యుద్ధం కారణంగా 10 లక్షలమంది ప్రజలు ఇళ్ళుకోల్పోయి నిరాశ్రయులయ్యారు. మరో 50 లక్షలమంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు.

## చైనాలో అంబరాన్నంటిన కొత్త వసంతోత్సవ వేడుకలు





**బీజింగ్ :** అన్నివిధాలుగానూ, వివిధ రంగాలలో సాంకేతికంగా అమెరికాను మించి ముందుకు దూసుకుపోతున్న చైనాలో 2025 శీతాకాలం ముగింపుతో ప్రారంభమైన లూనార్ ఇయర్ వసంతోత్సవ వేడుకలు అంబరాన్ని తాకుతున్నాయి. కోట్లాదిమంది ప్రజలు నౌకల్లో, విమానాల్లో తమ మాతృదేశం చైనాకు చేరుకున్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఒకవైపు సాంకేతికంగా,ఆర్థికంగా,సాంస్కృతింగా చైనా ముందుకు దూసుకుపోతున్న తరుణంలో ఈ వసంతోత్సవం ఈ ఏడాది సరికొత్త సొబగులు అద్దిందని చైనా ప్రభుత్వ పత్రికలు తమ సంపాదకీయాలతో మోతమోగించాయి. ఫిబ్రవరి 20వ తేదీ వరకూ నెలరోజులపాటు ఈ లూనార్ ఇయర్ సందడి చైనాలో కొనసాగడంతో ఆర్థిక వ్యవస్థ, చైనా మార్కెట్లు కూడా భారీ కొనుగోళ్ళతో కళకళలాడిపోతున్నాయి. దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్వయంగా ఈ వేడుకలలో పాల్గొంటూ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. చైనా ఆధునీకరణ, చైనా విజయాలు ఈ లూనార్ కొత్త సంవత్సరానికి సరికొత్త గర్వకారణంగా మారాయని జిన్‌పింగ్ అన్నారు. ఆసియా దేశాలలో, ప్రపంచవ్యాప్తంగా చైనా భాష మాట్లాడేవారంతా ఈ ఉత్సవాలు చేసుకుంటున్నారు. గతంకంటే ఈ సారి చైనా వసంతోత్సవ వేడుకలకు ప్రపంచవ్యాప్తంగా మంచి ప్రచారం లభించింది.అత్యంత పురాతనమైన ఈ చైనా సాంస్కృతికోత్సవం సందర్భంగా దేశం అంతటా ప్రజలు సెలవుల్లో ఉండి స్వంత ఊళ్ళకు వెళ్ళి ఉత్సవాల్లో పాలుపంచుకుంటారు. చైనా జాతీయ రహదార్లపై వాహనదార్లకోసం 50,000కు పైగా కొత్త ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులను చేరవేసేందుకు దేశం అంతటా బహుముఖ రవాణావ్యవస్థ 60 లక్షల కి.మీ విస్తీర్ణంలో 51 కోట్ల ట్రిప్పులు నడుస్తాయని అంచనావేశారు.

## పోటెత్తిన మిర్చి (మొదటి పేజీ తరువాయి)

14వేలు కాగా క్వింటా రూ.10వేల నుంచి రూ.13వేల లోపు మాత్రమే కొనుగోలు చేశారు. దీనితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది అననుకూల పరిస్థితులు, తెగుళ్ల నడుమ మిర్చి ధర గణనీయంగా తగ్గింది. మొదటి కోత మిర్చి మార్కెట్‌కు వచ్చినప్పుడు ఈ పరిస్థితి ఉంటే ఇక రెండవ కోత వస్తే మిర్చి ధర మరింతగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖమ్మంజిల్లాలో 70వేల ఎకరాల మిర్చి సాగు చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గతేడాదితో పోల్చినప్పుడు మిర్చి సాగు పెరగడంతో పాటు పెట్టుబడి కూడా పెరిగింది. తెగుళ్లు రావడం ఈ ఏడాది వ్యవసాయ సీజన్ ప్రారంభంలో అతివృష్టి తదితర కారణాలతో మిర్చి పెట్టుబడి పెరిగింది. గతేడాది ఇదే సమయంలో మిర్చి రూ. 18వేల వరకు ధర పలకగా ఈ ఏడాది జెండాపాట మినహా రూ. 13 వేలకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. వాణిజ్య పంటలకు సంబంధించి పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. అతివృష్టి కారణంగా ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. పత్తి దెబ్బతిన్న తర్వాత మెట్ట రైతులు మిర్చి మీద ఆశలు పెంచుకున్నారు. దిగుబడి తగ్గడం, ధర కూడా తగ్గడంతో ఈ ఏడాది మిర్చి రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పని పరిస్థితి ఏర్పడింది. ధర తగ్గింపు స్థానిక వ్యాపారులు సిండికేట్ కావడం వల్లే జరుగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## పెను విషాదం (మొదటి పేజీ తరువాయి)

కిందకు దిగేందుకు సిద్ధమవుతూ భూమికి 400 అడుగుల ఎత్తులోకి రాగానే సైనిక హెలికాప్టరు అడ్డం రావడంతో రెండూ ఢీకున్నాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ ఈ హెలికాప్టరు పైలట్‌కు హెచ్చరికలు చేసినప్పటికీ తప్పించుకునేందుకు తగిన సమయం లేకపోవడంతో ప్రయాణికుల విమానం, హెలికాప్టర్ రెండూ ఢీకొనడం, ఈ రెండు శకలాలూ పోటోమక్ నదిలో పడిపోవడం అంతా క్షణాల్లో జరిగిపోయాయి. ఈ ఘటనతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హెలికాప్టర్‌ను ఆ మార్గంలో జెట్ విమానానికి అడ్డు రాకుండా నివారించేందుకు అవకాశం ఉందని, సకాలంలో చర్య తీసుకుంటే ప్రమాదాన్ని నివారించి ఉండేవారని విమర్శించారు. ఈ ప్రమాదం గురించి పూర్తి వివరాలను అధికారులు తనకు తెలియజేశారని ట్రంప్ అన్నారు. ఈ ప్రయాణికుల జెట్ విమాన ప్రమాదం కొత్తగా అధికార బాధ్యతలు చేపట్టిన ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగానికి తలవంపులుగా మారింది. ప్రయాణికుల జెట్ విమానం ప్రమాదంలో కుప్పకూలిన ఘటనపై ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈగల్ ఫ్లైట్ 3542కు చెందిన సిఇఓ కూడా తమ జెట్ విమానం ప్రమాదంలో కుప్పకూలిపోవడంపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విమానాశ్రయంలో కొత్తగా నిర్మించిన రన్ వేపై ఈ జెట్ విమానం దిగేందుకు పైలట్లుకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ అనుమతి ఇచ్చిన తర్వాత పైలట్లు ఆ దిశగా వెళ్ళేందుకు విమానాన్ని కిందికి దింపుతుండగా సైనిక శిక్షణా విమానం అడ్డుగా వచ్చిందన్నది ప్రాథమిక సమాచారం.

**ఈ ఏడాది ఇదే ఘోర ప్రమాదం**

అమెరికాలో ఇంతకుముందు న్యూయార్క్ బఫెలో సమీపంలో 2009లో జరిగిన విమాన ప్రమాదంలో 45 మంది ప్రయాణికులు, మరో నలుగురు విమాన సిబ్బంది, పైలట్లు మరణించారు. శకలాలవల్ల మరొకరు మరణించారు. ఈ కొత్త సంవత్సరం 2025లో ప్రపంచంలో జరిగిన అత్యంత ఘోరమైన విమాన ప్రమాదం వాషింగ్టన్ డి.సిలోని పోటోమక్ నదిపై జరిగినదే. ఈ ప్రమాదంలో సజీవులనేవారే లేకుండా 67 మంది మరణించారు. ఈ ఏడాదిలో మొట్టమొదట జనవరి ఏడో తేదీన పశ్చిమ ఆస్ట్రేలియా రోట్‌నెట్ ఐలాండ్స్‌లో సముద్ర విమానం ప్రమాదానికి గురై ముగ్గురు మరణించారు. రెండు రోజుల క్రితం జనవరి 28న బుషన్ నుండి హాంకాంగ్‌కు వచ్చిన ఎయిర్ బస్ విమానం మంటల్లో అగ్నికి ఆహుతి కాకముందుగానే 176 మంది ప్రయాణికులను కిందకుదింపి అతిఘోర ప్రమాదాన్ని విజయవంతంగా నివారించారు. ఇక 2024 సంవత్సరాంతంలో డిసెంబరు 29న దక్షిణ కొరియా ముయాన్ విమానాశ్రయంలో ఒక విమానం దిగే ప్రయత్నం చేస్తూ అగ్నికి ఆహుతైపోయింది.

## 5న కేబినేట్ (మొదటి పేజీ తరువాయి)

'బిసి డెడికేషన్ కమిషన్' పరిగణలోకి తీసుకోనుంది. అయితే 'బిసి డెడికేషన్ కమిషన్' ఇప్పటికే పలు బిసి సంఘాలు, ఉప సంఘాలతో పలు మార్లు సమావేశమైన విషయం తెలిసిందే. బిసి డెడికేషన కమిషన్ ఇప్పటికే ఒక ప్రాథమిక నివేదికను రూపొందించినట్టు సమాచారం. తాజాగా సర్వే నివేదిక రాగానే ఆ లెక్కల ఆధారంగా బిసి రిజర్వేషన్లపై డెడికేషన్‌కమిషన్ ఒక నిర్ణయానికి రానుంది. రిజర్వేషన్లను ప్రతిపాదించే క్రమంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా డెడికేషన్ కమిషన్ ఇప్పటికే పలు న్యాయపరమైన సలహాలు తీసుకున్నట్టు సమాచారం.ఇతర రాష్ట్రాలలో అమలు జరుగుతున్న రిజర్వేషన్ల తీరును కూడా పరిశీలించింది. స్థానిక సంస్థలలో బిసిల రిజర్వేషన్ పెంచుతామని ఇది వరకే పలు సందర్భాలలో మంత్రులు, అధికార పార్టీ ప్రకటించింది. ఇందులో భాగంగానే రిజర్వేషన్ల పెంపు అంశంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ''సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి ,రాజకీయ,కుల సర్వే2024) నిర్వహించిన విషయం తెలిసిందే. మరోవైప బిసి డెడికేషన్ కమిషన్ కూడా రిజర్వేషన్ల పెంపుపై కసరత్తును దాదాపు పూర్తి చేసింది. బిసి రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్‌కు ఎన్ని రోజుల సమయం పడుతుందనేదే ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చజరుగుతోంది.మరోవైపు స్థానికసంస్థలను త్వరిగతిన నిర్వహించాలని ప్రభుత్వం బావిస్తోంది.

**ప్రత్యేక శాసనసభ సమావేశం .?**

సర్వే నివేదిక ఆధారంగానే బిసి రిజర్వేషన్లను పెంచాలని ప్రభుత్వం భావిస్తే, ఫిబ్రవరి 7న శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించే అవకాశాలు ఉంటాయి. కానీ మరో వైపు నల్లగొండ, కరీంనగర్ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నది. ఇటువంటి పరిస్థితుల్లో బిసిల రిజర్వేషన్ పెంపు నిర్ణయం సాధ్యమా ?అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై అధికార యంత్రాంగం న్యాయ సలహా తీసుకుంటున్నట్టు సమాచారం. ఒక వైపు ఉపాధ్యాయ, మరోవైపు పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గం ఎన్నికలు షెడ్యూల్ విడుదలైంది. ఇదిలా ఉండగాస్థానిక సంస్థలకు కూడా త్వరగానే ఎన్నికలు నిర్వహించాలని కూడా ప్రభుత్వం బావిస్తుంది. ఒక వైపు ఎన్నికల కోడ్, మరోవైపు రిజర్వేషన్ల పెంపు అంశంలో న్యాయపరమైన చిక్కులను ఎలా అధిగమిస్తారనేది ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది.

## కేబినేట్‌లో చర్చించిన తరువాతే (మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఎంఎల్‌సి అభ్యర్థుల జాబితాను అధిష్టానానికి పంపించామని, రెండు,మూడు రోజుల్లో అభ్యర్థులను ప్రకటిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గురువారం మహేష్ గౌడ్ ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ వారంలో సూర్యాపేట జిల్లాలో నిర్వహించబోతున్న బహిరంగ సభకు ఎఐసిసి అగ్రనాయకుడు రాహుల్ గాంధీ హాజరుకానున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఎలు, మంత్రులు తమ అధికారిక నివాసంలో సిఎం ఫోటోతో పాటు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఫోటోలను పెట్టుకోవాలని మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు.బిజెపి కార్పొరేటర్లు బిక్షాటన చేస్తుండటం విడ్డూరమని,రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఎన్ని నిధులను,ఎన్ని ప్రాజెక్టులను తీసుకొచ్చారని నిలదీశారు. ప్రతిపక్షాలు కులగణనను ఎన్ని విధాలుగా అడ్డుకోవాలని చూసినప్పటికీ కులగణనను ప్రభుత్వం పూర్తి చేసిందని వివరించారు. ఫిబ్రవరి 5న కుల గణన నివేదికను క్యాబినెట్ సబ్ కమిటీ,రాష్ట్ర మంత్రివర్గానికి అందజేస్తుందన్నారు. బిఆర్ఎస్ హయంలోనే రియల్ ఎస్టేట్ పడి పోయిందని,దీనిని తమ ప్రభుత్వం గాడిన పెడుతోందని తెలిపారు. బిఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, తాము మాత్రం కొంత ఆలస్యమైనప్పటికీ హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. సమయమభావాన్ని దృష్టిలో పెట్టుకొని సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని సిసిసి, లేదాతన నివాసంలో సమీక్షలు నిర్వహిస్తున్నారని, ఇందులో తప్పు ఏముందని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్ పాలన కోరుకునేది దొరలు మాత్రనేనని అన్నారు. కెసిఆర్ తమ పదేళ్ల పాలనను గాడిలో పెట్టలేకపోయారని, అధికారం దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. వైఎస్‌ఆర్‌కు ఉన్నంత అభిమానులు ఎవ్వరికి లేరన్నారు. పదేళ్ల కాలంలో గత సిఎం కెసిఆర్ చేసిన రుణమాఫీ సొమ్ము ఎంత..?, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన రుణమాఫీ చేసిన నిధుల వ్యత్యాసాన్ని పరిశీలించాలని సూచించారు. కెటిఆర్, హరీష్ రావు,కవిత రాజకీయ ముఖచిత్రంలో ఉండేందుకు, అస్తిత్వం కోసమే పలు వ్యాఖ్యలు చేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

## బడ్జెట్ సమావేశాలు (మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. మహాకుంభ మేళాను రాజకీయం చేస్తున్నారన్న విమర్శలను తివారీ తిప్పికొడుతూ, ఈ మేళాలో విఐపిల కదలికలు, వారి రాకపోకలవల్ల సామాన్య ప్రజలకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఇండియా బ్లాక్ కుంభ మేళా దుర్ఘటనతో పాటు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కోసం రైతుల ఆందోళన తో సహా పలు అంశాలను సభలో ప్రస్తావిస్తుందని ప్రమోద్ తివారీ చెప్పారు. కోట్లాదిమంది భక్తుల సౌకర్యాలను పణంగాపెట్టి బిజెపి ప్రభుత్వం విపిఐలకు ఎర్ర తివాచీలు పరుస్తోందని సమాజ్‌వాదీపార్టీ ఎంపి రామ్ గోపాల్ యాదవ్ విమర్శించారు.

**పార్లమెంటు సమావేశాల్లో మూడు ముఖ్యమైన బిల్లులు**

శుక్రవారం నుండి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టే మొత్తం 16 బిల్లులలో మూడు ముఖ్యమైన బిల్లులు ప్రధాన చర్చనీయాంశం కానున్నాయి. వక్ఫ్ సవరణ బిల్లు, వలసలు, విదేశీయులకు సంబంధించిన బిల్లులను బడ్జెట్ సమావేశాల ఎజెండాలో చేర్చారు. గడచిన గురువారంనాడు (జనవరి 23) వక్ఫ్ సవరణ బిల్లును పరిశీలించిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలను గుండుగుత్తగా తిరస్కరించి బిజెపి, దాని మిత్రపార్టీలకు చెందిన కమిటీ సభ్యులు ప్రతిపాదించిన సవరణలను ఆమోదించింది. ద ముస్లమాన్ వక్ఫ్ రద్దు బిల్లును కూడా వక్ఫ్ సవరణ బిల్లుతోపాటే సభలో ప్రవేశపెడతారు. అదేవిధంగా ఆకాశంలో ప్రయాణించే విమానాలు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు సహా ఇతర రవాణాకు సంబంధించిన వాహనాల ప్రయోజనాల రక్షణ బిల్లు, త్రిభువన్ సహకారీ యూనివర్సిటీ బిల్లు, వలసలు, విదేశీయుల బిల్లులను కూడా సభలో ప్రవేశపెట్టి వాటిపై చర్చిస్తారు. ఆర్థికబిల్లు–2025తోపాటు దానికి సంబంధించిన గ్రాంటులు, కోశాగారం నుండి ప్రభుత్వం ఖర్చులు చేయడానికి పార్లమెంటు అనుమతి కోరే ఎప్రాప్రియేషన్ బిల్లులను కూడా ఆమోదంకోసం ఈ సమావేశాల్లో సభ ముందు ఉంచుతున్నారు. ఇంతకుముందు సమావేశాల సందర్భంగా ఉభయ సభల్లో పెండింగ్‌లో ఉన్న మరో 10 బిల్లులు కూడా ఈసారి సభకు ముందుకు వస్తున్నాయి.

**'మహా' విషాదంపై చర్చ జరగాల్సిందే**

మహాకుంభ మేళాలో జరిగిన తొక్కిసలాట విషాదంపై పార్లమెంటులో చర్చ జరగాలని అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు కోరాయి. శుక్రవారం నుండి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రభుత్వమే గురువారంనాడు ఈ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. మహాకుంభ మేళాకు వచ్చే సామాన్య ప్రజలకు తగిన రక్షణ చర్యలు తీసుకోకుండా విఐపిల రక్షణపైనే ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం దృష్టిపెట్టిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఐతే కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు మాత్రం బడ్జెట్ సమావేశాలలకు సంబంధించిన ఎజెండాను పార్లమెంటు వ్యవహారాల సభా సలహా సంఘం (బిఎసి) నిర్ణయిస్తుందని ఉద్ఘాటించారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణకు సహకరించాలని, సమావేశాలు నిర్మాణాత్మకంగా జరిగేట్టు చూడాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం కోరిందని కిరెణ్ రిజిజు చెప్పారు. పార్లమెంటు సభ్యులను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగంపై సంప్రదాయబద్ధమైన చర్చ ఈ సమావేశంలో జరిగిందని, శుక్రవారం మొదలయ్యే బడ్జెట్ సమావేశాలలో ప్రధానమైన అంశం కేంద్ర బడ్జెటేనని ఆయన చెప్పారు. ఏ ఏ అంశాలపై చర్చలు జరగాలనే విషయంపై పార్టీల నాయకులు కొన్ని సమస్యలను ప్రస్తావించి చర్చలకు డిమాండ్లు చేశారని చెప్పారు. పార్లమెంటులో ఏ ఏ అంశాలను చర్చకు చేపట్టాలనే విషయానిన సభా వ్యవహారాల సలహా కమిటీ నిర్ణయిస్తుందన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రారంభ సమావేశంలో ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర బడ్జెట్‌ను సభలో ప్రవేశపెడతారు. మొదటి విడత బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 10వ తేదీన తిరిగి ప్రారంభం అవుతాయి. బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ నాలుగోతేదీతో పూర్తి అవుతాయి. ఈ సమావేశాల శాసన ఎజెండాలో మొత్తం 16 బిల్లులు ఉన్నాయి. వీటిల్లో వక్ఫ్ సవరణ బిల్లు అత్యంత ప్రధానమైనది. దీంతోపాటు వలసలు, విదేశీయులకు సంబంధించిన బిల్లు కూడా ఉంది. మహాకుంభ మేళాలో తొక్కిసలాటపై ప్రతిపక్షాలు చేసిన డిమాండ్ గురించి పాత్రికేయులు ప్రశ్నించగా, ఈ విషయంపై పార్లమెంటులో చర్చించే విషయాన్ని సభా కార్యకలాపాల కమిటీ సలహా కమిటీ నిర్ణయిస్తుందని మళ్ళీ మళ్ళీ చెప్పి కిరెణ్ రిజిజు తప్పించుకున్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఈ తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు చేస్తోందని సమావేశంలో అఖిలపక్షాలకు రాజ్‌నాథ్ సింగ్ చెప్పారని వర్గాలు తెలియజేశాయి. అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, సమాజ్‌వాదీపార్టీలు మహాకుంభ మేళా తొక్కిసలాట అంశాన్ని ప్రస్తావించాయి.

## ఉసురు తీసిన 'ఉపాధి హామీ' (మొదటి పేజీ తరువాయి)

కందారపు సరోజన (52) కూతురు అన్నాజి మమత (25) మృతిచెందారు. గురువారం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఉపాధి హామీ పనిచేస్తున్న క్రమంలో ప్రమాద వశాత్తు మట్టి దిబ్బ కూలిపోవటంతో ఇద్దరు కూలీలు తల్లికూతుళ్లు కుందారపు సరోజ, అన్నాజి మమత అక్కడే మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్రగాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయచర్యలు చేపట్టారు. జెసిబి సహాయంతో శిథిలాలను తొలగించి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏసిపి సతీష్ తెలిపారు.

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటా: మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండ సురేఖ**

గోవర్ధనగిరి గ్రామంలో మట్టిరోడ్ల మరమ్మతులకు ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలు ప్రమాదవశాత్తు మృతిచెందటంపై మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండ సురేఖలు తీవ్ర దిగ్భాంతి వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించిన కారణాలపై జిల్లా కలెక్టర్ మనుచౌదరితో మాట్లాడారు. ఉపాధి హామీలో ఇద్దరు కూలీలు మృతికి కారణమైన ఘటనపై జిల్లా అధికారులను విచారణకు ఆదేశించారు. గాయపడిన వారికి నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండ సురేఖలు తెలిపారు.

*** ఉపాధి హామీ కూలీల మృతిపై సంతాపం వ్యక్తం చేసిన మాజీ మంత్రి హరీష్‌రావు**

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఇద్దరు మహిళ కూలీలు ప్రమాదవశాత్తు మృతిచెందటం బాధకరమని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు తప్పనిసరిగా జీవితబీమా వర్తించేలా చూడాలని, ఆదిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు.

## ప్రాధాన్యత ఇవ్వాలి : సిపిఐ (మొదటి పేజీ తరువాయి)

ప్రామాణీకరణ ప్రకటనలు చేసే సంప్రదాయాన్ని తక్షణం నిలిపివేయాలని కోరారు. ఈ విధమైన సంప్రదాయం ప్రజాస్వామ్య ప్రక్రియను దిగజారుస్తుందని పేర్కొన్నారు. రైతులకు న్యాయబద్ధమైన కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని,1972 నాటి వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని సవరించాలని సిపిఐ కోరుతున్నట్లు సందోష్ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ విధించిన సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకమైన సరికొత్త మార్గదర్శక సూత్రాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. మహాకుంభ మేళాలో జరిగిన విషాద సంఘటనపై ప్రభుత్వం న్యాయబద్ధమైన సమాధానం చెప్పాలనీ, ఎలాంటి దాపరికం లేకుండా సభకు జవాబివ్వాలని డిమాండ్ చేశారు. వీటిపై పార్లమెంట్ చర్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వినాశకరమైన వరదలతో నష్టపోయినందుకు రూ.24,000 కోట్లు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని కేరళ అభివృద్ధికి విడుదల చేయాలన్నారు.







## మహాత్మగాంధీకి గవర్నర్, సిఎం నివాళులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మగాంధీ వర్థంతి సందర్భంగా లంగర్ హౌస్ బాపూఘాట్ వద్ద పూలమాలలు వేసి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో మహాత్మగాంధీ పోరాటాన్ని, దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి కొండా సురేఖ నివాళి

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని లంగర్ హౌజ్‌లోని బాపూఘాట్ లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ప్రార్థన, అభ్యర్థన, నిరసన అనే మహాయుధాలతో బ్రిటీష్ వారిని తరిమి కొట్టి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టిన మహా నాయకుడు గాంధీజీ అని మంత్రి సురేఖ అన్నారు. గాంధీజీ సూచించిన శాంతి, అహింసల ఆచరణే మనం గాంధీజీకి ఇచ్చే అసలైన నివాళి అని మంత్రి సురేఖ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పనిచేస్తున్నదని మంత్రి సురేఖ తెలిపారు.

### డిఎస్‌సి 2024 ఎస్‌జిటి స్పోర్ట్స్ కోటా పోస్టులలో..

# అవకతవకలపై విచారణ

### ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిఎస్‌సి 2024 ఎస్‌జిటి స్పోర్ట్స్ కోటా పోస్టులలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. 'డిఎస్‌సి 2024 ఎస్‌జిటి స్పోర్ట్స్ కోటా పోస్టులలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని, స్పోర్ట్స్ కోటాలో అర్హత పొందిన అభ్యర్థులకు న్యాయం చేయాలని' డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఎల్‌బి స్టేడియం ప్రాంగణంలోని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగ నియామకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను పూర్తిచేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అయితే ఈ రిక్రూట్‌మెంట్‌లో కొన్ని అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన ఫామ్ 2 కండిషన్‌ను అడ్డుపెట్టుకుని కొందరు అక్రమార్కులు పంతుళ్ల పోస్టులను అమ్ముకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులకు డిఎస్‌సి స్పోర్ట్స్ కోటా రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలు రాకపోవడంతో కొందరు అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించగా న్యాయస్థానాలు విచారణ చేపట్టిందని, దీనిపైన ప్రభుత్వం వెంటనే నిగ్గు తేల్చాలని ఆదేశాలిచ్చినప్పటికీ కాలయాపన చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. స్పోర్ట్స్ అథారిటీ సిబ్బందితో పాటు వ్యాయామ విద్య ఉపాధ్యాయులను అలాగే స్కూల్ ఎడ్యుకేషన్ సిబ్బందితో కమిటీలను ఏర్పాటు చేసి జిఒ74 ప్రకారం స్పోర్ట్స్ సర్టిఫికెట్ మెరిట్ ఆధారంగా జిల్లాల వారీగా ఎంపికైనవారి లిస్టును తయారు చేశారన్నారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మధు, పి.శివకుమార్.. కార్యవర్గ సభ్యులు కళ్యాణ్, అనిల్‌కుమార్, హేమంత్ కుమార్, అరుణ్, అభ్యర్థులు రాజేష్, హరికృష్ణ, వెంకటేష్, స్వామి, అనిరుధ్ పాల్గొన్నారు.

# కార్మికుల ఉపాధిని కాపాడాలి

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు, సుతారి రాములు




**ప్రజాపక్షం/కోరుట్ల :** దేశంలోని 14 రాష్ట్రాలలో బీడి కార్మికులు ఉపాధి పొందతూ ప్రభుత్వాలకు అనేక రకాల పన్నులు చెల్లిస్తున్న బీడీ పరిశ్రమపై జిఎస్టీని రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు సుతారి రాములు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలు జగిత్యాల జిల్లాలోని కోరుట్ల డివిజన్, పద్మశాలి సంఘ భవన్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బీడి కార్మికుల వేతనాలు తక్కువ చెల్లిస్తున్న రాష్ట్రాలకు ఈ బీడీ పరిశ్రమలు తరలిపోకుండా దేశంలో ఒకే రకమైన వేతనాలు ఇవ్వాలన్నారు. బీడీ పరిశ్రమపై పైసా బ్జెట్ కేటాయించని కేంద్ర ప్రభుత్వం ఈ బీడి పరిశ్రమపై జిఎస్టీని పెంచే విధానం వెంటనే విరమించుకోవాలని కోరారు. ఇపిఎఫ్ సంస్థలో బీడీ కార్మికులకు కనీస పెన్షన్ కేవలం 1000 రూపాయల లోపే ఉందని, దానిని 5000 రూపాయలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి పెంచాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, జాతీయ కార్మిక సంఘం నేతలు కలిసి సూచించాయన్నారు.
లేనియెడల ఈ బడ్జెట్ సమావేశాలలో చలోఢిల్లీ పార్లమెంట్ నిర్వహిస్తామని, అందుకు కార్మికులను సమాయత్తం చేస్తామని ఈ మహాసభలలో తీర్మానం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అర్హులైన బీడీ కార్మికులకు ఇండ్లు కటించి ఇవ్వాలన్నారు. చేయూత పథకం కింద కార్మికులకు 2000రూపాయలు నుండి 4000 రూపాయలకు పెంచుతానన్న హామీని నెరవేర్చాలని, లేకుంటే స్థానిక సంస్థ ఎన్నికలలో కార్మికులు తగిన రీతిలో ఓటు ద్వారా బుద్ధి చెబుతారని అన్నారు. ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్, నిజమాబాద్, హన్మకొండ, సిద్దిపేట, ఆదిలాబాద్, ఉమ్మడి ఐదు జిల్లాల నుండి కార్మిక నేతలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఐదు జిల్లాల నుండి కార్మిక నేతలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులుఎస్ విలాస్, టి.సమ్మయ్య, బీడి కార్మిక సంఘం రాష్ట్ర నేతలు ఎండి ముక్రం, బి.గోవర్ధన్, కడారి రాములు, ఎండి మౌలానా, చెన్న విశ్వనాథం, మునుగురి హనుమంతు, తోట బిక్షపతి, కొక్కుల శాంత, ఎండి ఉస్మాన్, రాధ, కెవి.అనసూయ, కె.గోదావరి, ఆదే రంగారెడ్డి, అయ్యవారి లక్ష్మణ్, ఎ.భూమేష్, కిరణ్, ఎ.వేణు, అందే వంశీ కృష్ణ, సాంబార్ మహేష్, సదానందంగౌడ్, బి జ్యోతి, వెన్న మహేష్, ఎండి ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు



## చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి : ఎంపి క్రిష్ణయ్య

### వచ్చేనెల 6,7 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అలాగే ఒబిసి జాతీయ సెమినార్లు జరపాలని ఫిబ్రవరి 6, 7 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున పోల్గొంటారని తెలిపారు. ఈ చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆర్.కృష్ణయ్య ఢిల్లీలో గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సుగుణవతి, గుజ్జ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సెమినార్‌లో వివిధ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బిసిలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని. రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా 76సం.లుగా అన్యాయం చేస్తూన్నారని, జెండాలు మోసుకుంటు, జిందాబాద్‌ల నినాదాలు ఇస్తూ బిసిలను వాడుకుంటున్నారని వారన్నారు. బిజెపి పార్టీ బీసి వర్గానికి చెందిన నరేంద్ర మోదీని ప్రధానమంత్రిగా చేశారని, ఇటివల నలుగురు గవర్నర్లు బి.సి వర్గానికి చెందిన వారిని నియమించారని ఆయన తెలిపారు. జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగ బద్ధమైన హోదా ఇచ్చారని, కేంద్రంలో బి.సి రిజర్వేషన్లను వర్గీకరించడానికి కమిషన్ ను నియమించాలని డిమాండ్ చేశారు.

## 'జోగులాంబ' బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి : మంత్రి కొండా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జోగులాంబ బాల బ్రహ్మేశ్వరి స్వామి దేవస్థానం వరుస ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయ ఈవోను ఆదేశించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు, ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1 వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు రావాలంటూ ఆలయ ఈవో పురేంద్ర కుమార్, అర్చకులు సెక్రటేరియట్ లో కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఆలయ అర్చకులు మంత్రి కి వేదాశీర్వచనం చేసి, అమ్మవారి తీర్థప్రసాదాలను, ఆహ్వానపత్రికను అందించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధ్వజారోహణం, మహా పుర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం, జోగులాంబ బాల బ్రహ్మేశ్వర్ స్వామి కళ్యాణోత్సవం, మహాశివరాత్రిని పురస్కరించుకుని కళ్యాణోత్సవం, రథోత్సవం, అశ్వవాహన సేవ, అవభృదోత్సవాలను నిర్వహించనున్నట్లు ఈవో పురేంద్ర కుమార్ మంత్రికి వివరించారు.ఎఐసిసి కార్యదర్శి, ఆలంపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## పిజి మెడికల్ సీట్లలో స్థానిక కోటా రద్దుపై హరీష్ రావు ఆందోళన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పిజి మెడికల్ సీట్ల రిజర్వేషన్ల విషయంలో 50శాతం లోకల్ రిజర్వేషన్ వర్తించదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణతో పాటు, దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు.మెడికల్ కాలేజీల్లో అగ్రగామిగా ఉన్న తెలంగాణలో, ఈ తీర్పు వల్ల స్థానిక విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.రాష్ట్ర ఏర్పాటు తర్వాత వైద్య విద్య అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్, దేశంలో ఎక్కడా లేని విధంగా జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసారని గుర్తు చేశారు. 2014 వరకు 5గా ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్యను 34కు చేర్చారని, మారు మూల జిల్లాల్లో సైతం మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసారన్నారు.దీంతో ప్రతి లక్ష జనాభాకు 19 ఎంబిబిఎస్ సీట్లతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని పిజి సీట్లలో రెండో స్థానంకు చేరిందన్నారు. తెలంగాణలో ఉంటూ మెడికల్ పిజి చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఇది శరాఘాతంగా మారిందని, తెలంగాణతో పాటు, దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఏపీ విద్యార్థులు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కోబోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు..

# ప్రభుత్వం మరో ముందడుగు

### డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం బూట్ విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు ఆహ్వానించగా, ఇందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి విద్యుత్ శాఖ అధికార బృందం హిమాచల్ ప్రదేశ్‌ను సందర్శించింది. ఆ ప్రతిపాదనను అధ్యయనం చేసి 100 మెగావాట్లకు పైబడి సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తి వ్యక్తం చేసింది. దీనికి సంబంధించిన హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం పరస్పర అంగీకార ఒప్పందంపై (ఎంఒయు) సంతకం చేసి, త్వరితగతిన పంపిస్తే తగు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో భాగంగానే హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ విందర్ సింగ్ సఖుతో తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు హాజరయ్యారు. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ అధికారుల సమక్షంలో, తెలంగాణ ప్రభుత్వం సెలి (400 మెగావాట్లు), మియార్ (120 మెగావాట్లు) హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టులపై ఆసక్తి కనబరుస్తూ ఈ సందర్భంగా అధికారికంగా ఒక లేఖను సమర్పించింది. దీనికి సంబంధించిన పరస్పర అంగీకార ఒప్పందం (ఎంఒయు) ముసాయిదాను పంపించాలని హిమాచల్ ప్రదేశ్ సిఎంను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కోరారు. కాగా ఈ ఒప్పందాన్ని తెలంగాణ ప్రభుత్వం పరిశీలించి, అనంతరం త్వరితగతిన ఎంఒయుపై సంతకం చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే హైడ్రోఎలక్ట్రిక్ విద్యుత్ తెలంగాణ రాష్ట్రానికి సరఫరా కానుంది. ఫలితంగా ప్రస్తుత రాష్ట్ర అవసరాలు, భవిష్యత్ విద్యుత్ డిమాండ్లను తీర్చేందుకు విద్యుత్ సరఫరా సామర్థ్యం మరింత దోహదపడుతుందని విద్యుత్ శాఖ తెలిపింది. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం హిమాచల్‌ప్రదేశ్ విద్యుత్ శాఖ కార్యదర్శితో సమావేశమై చర్చించారు. అలాగే, సెలి హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టు (400 మెగావాట్లు), మియార్ హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టు (120 మెగావాట్లు) ప్రాంతాలను కూడా తెలంగాణ విద్యుత్ శాఖ ప్రతినిధి బృందం పరిశీలించింది. 100 మెగావాట్లకు పైబడి సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తి వ్యక్తం చేసి, దీనికి సంబంధించిన సిఫారసు చేశారు.




## మద్దతు ధర లేక రైతుల ఇబ్బందులు

### బిఆర్‌ఎస్ రైతు అధ్యయన కమిటీ ఛైర్మన్ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వివిధ రకాల పంటలు పండించిన రైతులకు మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ రైతు అధ్యయన కమిటీ ఛైర్మన్ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. రైతు భరోసా రాక, రుణమాఫీ జరగక రైతులు నిస్పృహకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులపై తాము రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించామని వివరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, జోగురామన్నతో కలిసి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను పరామర్శించి, వారికి కొంత ఆర్థిక సాయం చేశామని వివరించారు. తాము రైతులను పరామర్శిస్తుంటే, కాంగ్రెస్ పార్టీకి అక్కసు ఎందుకో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తుంటే, పోలీసులు పర్మిషన్ లేదని తమను అడ్డుకునేందుకు ప్రయత్నించారని, ప్రజాపాలనలో పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి పరిపాలన చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ విలువలు పట్టించుకోకుండా, రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతున్న వ్యక్తి రాహుల్ గాంధీ అని అన్నారు. రాజకీయాలు మాట్లాడకూడని స్పీకర్ రాజకీయాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. మహాత్మాగాంధీ ఆశయాలకు వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. మహాత్మా గాంధీ అబద్ధాలు చెప్పొద్దని అనేవారని, కానీ కాంగ్రెస్ నాయకులు మాత్రం రోజూ అబద్ధాలు చెబుతున్నారన్నారు.

## వర్గీకరణ ఉద్యమాన్ని 'నాగా కుకీ'గా మార్చే కుట్ర

### మాదిగ జెఎసి వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ ఉద్యమాన్ని గడ్డం వివేక్, మందకృష్ణ మాదిగ తప్పుదోవ పట్టించేందకు ప్రయత్నిస్తున్నారని, ఈ ఉద్యమాన్ని మరో నాగ కుకి కొట్లాటగా మారనుందని ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జెఎసి వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బిఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో 'మాదిగ విద్యార్థి యువగర్జన గోడ పత్రిక'ను ఆయన గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ చేయడం మందకృష్ణ మాదిగకు ఇష్టంలేదని, అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. గడ్డం వివేక్, మందకృష్ణ మాదిగ స్వార్థ ఉద్యమాలతోనే తెలంగాణ రాష్ట్రంలో నాగ కుకి గొడవ తరహా మరో వర్గ భేదాలు వచ్చి రాష్ట్రం అగ్నిగుండంగా మారే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా మాదిగలను అణచివేసిన బిజెపి ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ అవార్డును కృష్ణ మాదిగ వెంటనే తిరస్కరించాలని డిమాండ్ చేశారు. లక్ష దప్పులు కార్యక్రమం పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించాలని, ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా జరగరానిది ఏమైనా జరిగితే ఇందుకు మందకృష్ణ మాదిగనే నైతిక బాధ్యత వహించాలన్నారు. ఎన్ని ఆటంకాలను కలిగించినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌సి వర్గీకరణ జరిగి తీరుతుందన్నారు. ఫిబ్రవరి 2న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో మాదిగ విద్యార్థి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి యువగర్జన బహిరంగ సభకు వేలాదిగా మాదిగలు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ మల్లేశం, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకుడు తిరుపతి, తెలంగాణ దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, డాక్టర్ నంద్రు నరసింహ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మారపాక సాయిలు, తెలంగాణ స్టూడెంట్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రింగు రాంబాబు, మాదిగ జెఎసి ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు జోగు గణేష్ హాజరయ్యారు.

# సంస్థ పరిరక్షణ, కార్మికుల సంరక్షణ కోసమే పోరాటం

### ఆర్‌టిసి జెఎసి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ ఆర్‌టిసి జెఎసి సమ్మె నోటీస్ ఇవ్వడం సంఘాల మనుగడ కోసమని, కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని రవాణా శాఖ మంత్రి పత్రికా ప్రకటన ఇవ్వడం సమంజనం కాదని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి. యాదగిరిలు అన్నారు. మంత్రి ప్రకటనను వారు తీవ్రంగా ఖండించారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా ట్రేడ్ యూనియన్ల వల్లే నష్టాలు వస్తున్నాయని, యూనియన్లపై ఉక్కుపాదం మోపారని తద్వారా కార్మికులు ఆ పార్టీకి బుద్ధి చెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాన్నే చేస్తోందని వారు విమర్శించారు. ఆ పార్టీ వదిలేసిన నియంత పాలనే ప్రస్తుతం నడుస్తుందని, ప్రజాపాలన ఆర్‌టిసిలో నడవడం లేదని విమర్శించారు. ఒకపక్క ఆర్‌టిసిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పి విచ్చలవిడిగా ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులు తెచ్చి డిపోలు మొత్తం ప్రైవేట్ వ్యక్తుల కబంధ హస్తాల్లో పెడుతున్నందునే ఒక్కసారిగా కార్మికులలో ఆవేదన, అలజడి మొదలై సమ్మె నిర్ణయానికి వచ్చామని వారు స్పష్టం చేశారు. మంత్రి ప్రతిసారీ ఆర్‌టిసిలో 3038 నియామకాలు చేపడతామని 14 నెలలుగా అదే ప్రకటన ఇస్తున్నారని, కానీ ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఎందుకు జారీ చేయలేదో చెప్పాలని, గత కొన్నేళ్ళ నుండి 17,460 మంది రిటైర్ అయితే మీరు నియమించే 3038 నియామకాలు ఏ మూలకు సరిపోవని, వెంటనే 14000ల నియామకాలు చేపట్టి ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకోవాలని జెఎసి డిమాండ్ చేసింది. అలాగే త్వరలో 1000 బస్సులు ప్రభుత్వం కొంటోందని, 600 బస్సులు మహిళా సంఘాల ద్వారా కొనిస్తామని మంత్రిగారు చెప్పారు, బాగానే ఉంది. కాని ఈ బస్సులు అద్దెబస్సులా, లేక ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులా లేక ప్రభుత్వ ఆర్‌టిసి సంస్థ బస్సులా? చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసి కార్మికుల గురించి, సంస్థ గురించి వారి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను పరిష్కరించి ఉన్నట్లయితే యూనియన్లు సమ్మె నోటీసులు ఇచ్చేవి కావన్నారు. సమ్మెకు మద్దతుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగని జెఎసి నాయకత్వం కలిసి సమ్మెకు దారి తీసిన పరిస్థితులను వివరించి వినతిపత్రం ఇచ్చారు.
అందుకు ఆయన స్పందించి ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన పోరాటానికి, ప్రజారవాణా ఆర్‌టిసిని రక్షించుకోవడానికి సంపూర్ణంగా మద్దతు తెలియజేశారు. జెఎసి చేసే ఉద్యమంలో క్రియాశీలక పాత్ర ఎంఆర్‌పిఎస్ పోషిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే సిఐటియు ప్రధాన కార్యదర్శి పాలదుగు భాస్కర్‌ను కలిసి సమ్మెకు సంబంధించిన వినతిపత్రమును అందించి వారి మద్దతును కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి ప్రతినిధులైన ఎన్.కమలాకర్ గౌడ్, ఎం.ఎ.మజీద్, సత్యపాల్, రాంచంద్రయ్య, శేషయ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
శుక్రవారం, జనవరి 31

## కొత్త సీసాలో పాత సారా
# అగ్రి మార్కెటింగ్ ముసాయిదా

వ్యవసాయం కార్పొరేటీకరణను సాధించే నిమిత్తం ''వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన చట్రం'' ముసాయిదా పేరుతో నరేంద్రమోదీ ప్రభుత్వం కొద్దికాలం క్రితం విడుదల చేసిన పత్రం కొత్త సీసాలో పాత సారా లాంటిది. ఇదే లక్ష్యసాధనకు తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను దేశ రైతాంగం అపూర్వమైన పోరాటం ద్వారా ప్రతిఘటించినందున ప్రధాని నరేంద్రమోదీ వాటిని ఉపసంహరించుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పిన విషయం గుర్తు చేసుకోదగింది. అంతకుముందు భూసేకరణ సందర్భంలో రైతులకు న్యాయమైన పరిహారం, పునరావాసం నిమిత్తం యుపిఎ ప్రభుత్వం 2013లో తెచ్చిన చట్టానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేశారీ ప్రధాని. ఆర్డినెన్స్‌ల ద్వారా ఒకటికి రెండుసార్లు తెచ్చిన సవరణలను రైతాంగం, ప్రతిపక్ష పార్టీ లు ప్రతిఘటించటంతో వాటిని ఉపసంహరించుకున్నారు. రైతాంగంతో ఘర్షణలోనే ఆయన ఒకటికి రెండుసార్లు తలదించుకున్నారు. అయితే పట్టువిడవలేదు. వ్యవసాయరంగంలోకి కార్పొరేట్ రంగాన్ని ప్రవేశ పెట్టటం, మార్కెటింగ్ నుంచి అంతిమ ఉత్పత్తి రూపం వరకు కార్పొరేటీకరించి తమ ఆత్మీయ ఆశ్రిత పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చి పెట్టటం మోదీ విధానం. సాగు– ప్రాథమిక ఉత్పత్తి దశను కాంట్రాక్టీకరించే లేదా భూమిని కార్పొరేషన్ లకు లీజుకిచ్చే ప్రయత్నాలు యుపిఎ ప్రభుత్వ కాలంలో కూడా జరిగాయి. కాంట్రాక్టు వ్యవసాయ విధానానికి రైతుల్లో తీవ్రమైన వ్యతిరేకత రావటంతో సహకార వ్యవసాయం కొంతకాలం చర్చకు వచ్చింది. ఆ తర్వాత గొర్రెలు తినేవాడుపోయి బర్రెలు తినేవాడు వచ్చినట్లు మతవాద, మితవాద బిజెపి (ఎన్‌డిఎ–2) అధికారంలోకి వచ్చింది. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేటీకరణ నిమిత్తం మూడు వ్యవసాయ చట్టాలను కోవిడ్ కాలంలో పార్లమెంటులో ఎటువంటి చర్చ లేకుండా ఆమోదింపజేసుకుంది. అయితే క్షేత్రస్థాయిలో రైతాంగం దేశమంతటా ఎదురు తిరిగింది. ఆ మహోద్యమాన్ని విరమింపజేసే సందర్భంలో రైతులకు యిచ్చిన హామీలు – కనీస మద్దతు ధరలకు లీగల్ గ్యారంటీ, స్వామినాథన్ ఫార్ములా ప్రకారం 23 పంటలకు కనీస మద్దతు ధరల నిర్ణయం వగైరాలను ప్రభుత్వం రెండేళ్లకు పైబడి అమలు చేయకపోవటంతో హర్యానా సరిహద్దులో రైతుల ఆందోళన మళ్లీ మొదలైంది. ఎస్‌కెఎం రైతు నాయకుడు డల్లేవాల్ 50రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్నందున రైతుల ఆందోళన, సుప్రీంకోర్టు ఒత్తిడి మీదట ప్రభుత్వం ఫిబ్రవరి 13న చర్చలకు అంగీకరించింది.

> రిలయెన్స్, ఆదానీ సహా బడా వ్యాపారులు హర్యానాలోని సిర్సాలో, పంజాబ్‌లోని లూథియానాలో పెద్దపెద్ద గోదాములు, రైలు మార్గాలు నిర్మించుకుని వేచిచూస్తున్నారు. వారిని సేవించటమే మోదీ ప్రభుత్వ ధ్యేయం.

ఈ లోపు వ్యవసాయ మంత్రిత్వశాఖ విడుదల చేసిన వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా పుండుమీద కారం చల్లినట్లయింది. దీనికి నిరసనగా ఇప్పటికే రైతుల ఆందోళన మొదలైంది. మళ్లీ దేశవ్యాప్త ఐక్య ఆందోళనకు రైతు సంఘాలు నిర్ణయించాయి.

ముసాయిదాలోని తిరోగమన సంస్కరణలు ఇలా ఉన్నాయి : ప్రైవేటు టోకు మార్కెట్ల ఏర్పాటు, పంట పొలంవద్దే కొనుగోలుకు కార్పొరేట్ ప్రాసెసర్లు, ఎగుమతిదారులకు అనుమతి, సాంప్రదాయక మార్కెట్ యార్డ్‌ల స్థానంలో కార్పొరేట్ అజమాయిషీలో గోదాములు, భారీ నేలమాళిగల ఏర్పాటు, రాష్ట్రవ్యాప్త ఏకీకృత మార్కెట్ ఫీజు, లైసెన్స్ పద్ధతి అమలు. సాంప్రదాయక మార్కెట్ యార్డ్‌లు మూతపడతాయి. వ్యవసాయోత్పత్తులకు రైతులకిచ్చే ధరను కార్పొరేట్లు నిర్ణయిస్తాయి. అంతిమ వస్తువులు, తినుబండారాలు కార్పొరేట్లకు లాభాలు కురిపిస్తాయి. రిలయెన్స్, ఆదానీ సహా బడా వ్యాపారులు హర్యానాలోని సిర్సాలో, పంజాబ్‌లోని లూథియానాలో పెద్దపెద్ద గోదాములు, రైలు మార్గాలు నిర్మించుకుని వేచిచూస్తున్నారు. వారిని సేవించటమే మోదీ ప్రభుత్వ ధ్యేయం.

# 'ప్రతిపక్షంలో ఏమిటి? అధికారమే కావాలి'ప్లీజ్ !



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

దురదృష్టం కన్నా అదృష్టమే ఎక్కువ ప్రమాదకరం. ఈ సంగతి చాలామంది గ్రహించరు. దురదృష్టం విలువైన పాఠాలు నేర్పుతుంది. సహనం అంటే ఏమిటో తెలుసుకునే సమయం లభిస్తుంది. అన్నింటి కన్నా ముఖ్యమైన విషయం పరాజయానికి ఎలా సిద్ధపడాలో తెలుస్తుంది. తన ప్రతిభకు, జిమ్మిక్కులకు, ట్రిక్కులకు అడ్డు ఉండదని, తనకు అధికారం, వైభోగం శాశ్వతంగా ఉంటాయని భ్రమపడడం వలన బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ 'పరాభవ బెంగ' నుంచి తేరుకోలేకపోతున్నట్టు విశ్లేషణలున్నవి. పరిస్థితుల్లో మార్పు రాకతప్పదని ఊహించలేకపోవడం ఆయన అతి ఆత్మవిశ్వాసానికి సంబంధించిన సమస్య. అందువల్ల ప్రతిపక్షంలోకి ప్రజలు నెట్టివేయవచ్చునని కనీసం కలలో కూడా కెసిఆర్ భావించలేదు. కనుక ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడానికి ఆయన సిద్ధంగా లేరని, ఆయన 'అజ్ఞాత వాసం'వల్ల అర్థమవుతున్నది. అదృష్టచక్రం మీద ఎంత వేగంగా పైకి వెళతారో, అంతే వేగంగా కిందకు చేరుకునే సమయమూ వస్తుందని కెసిఆర్ అనుకోలేదు. దాంతో తాజా పరిస్థితులను ఎలా హ్యాండిల్ చేయాలో తెలియక '45 ఇయర్స్ ఇండస్ట్రీ' అయిన కెసిఆర్ సతమతమవుతున్నారు. దిక్కుతోచక తల్లడిల్లుతున్నారు. ''అత్యంత బలమైన ఖడ్గం కూడా ఉప్పునీటిలో మునిగితే ఎందు కూ పనికి రాకుండా తుప్పు పట్టిపోతుంది'' అని క్రీస్తు పూర్వం 4వ శతాబ్దానికి చెందిన సైనికరంగ నిపుణుడు, వ్యూహకర్త సుంజు చెప్పాడు. మనం ఈ సందర్భంలో కెసిఆర్‌ను 'గొప్ప ఖడ్గం'తో పోల్చవచ్చు. 'ఉప్పు నీరు' అంటే తెలంగాణ ఐడెంటిటీని వదులుకొని, జాతీయ రాజకీయాలపై 'మోజు'తో భారత రాష్ట్రసమితి అని పేరు మార్చుగా విశ్లేషించవచ్చు. బిఆర్‌ఎస్ పేరు తెలంగాణ ప్రజలకు కొరుకుడు పడనిది. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పగలిగిన తెలివితేటలు తనకు మినహా మరెవ్వరికీ లేవని కెసిఆర్ ఎందుకు అనుకున్నారో తెలియదు. ఆయన ఆలోచనలను తుంచివేయడానికి పార్టీలోని వారెవరూ సాహసం చేయకపోవడం వల్ల భారీ నష్టం వాటిల్లింది.

''కొందరు వ్యక్తులు అటెన్షన్ సీకింగ్ డిజార్డర్' వ్యాధితో బాధ పడుతున్నారు. వాళ్ళు త్వరగా చికిత్స చేయించుకోవడం మంచిది''! అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలు బిఆర్‌ఎస్ నాయకులు, ముఖ్యంగా కెటిఆర్, హరీశ్ రావు గురించి చేశారని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. 'హిస్ట్రియోనిక్ పర్సనాలిటీ డిజార్డర్' అనే మానసిక ఆరోగ్య స్థితితో బాధపడేవాళ్లున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి పీడిత వ్యక్తులు ఎక్కువ గుర్తింపు, ఆదరణను ఆశిస్తారు. నిరంతరం ప్రచారంలో ఉండాలని కోరుకుంటారు. దానిని పొందడానికి అవసరమైతే రెచ్చగొట్టే మార్గాలను అనుసరిస్తారు. సమాజం తమపట్ల ఎక్కువ శ్రద్ధ చూపాలని, తమ తెలివితేటలను అందరూ ప్రశంసించాలని అనుకుంటారు. అలాంటి పరిస్థితి లేకపోతే వాళ్ళు అసౌకర్యంగా, ఇబ్బందికరంగా భావిస్తారు.

కొన్ని సందర్భాలలో 'అటెన్షన్ సీకింగ్ డిజార్డర్' వ్యక్తులు చాలా ఉత్సాహంగా ఉండవచ్చు. అతిశయోక్తి మాటలు మాట్లాడవచ్చు. వాళ్ళు తీవ్ర భావోద్వేగాలను కలిగి ఉంటారు. అలాంటి వ్యక్తులకు ఆత్మగౌరవం తక్కువ. కానీ తమకు ఆత్మగౌరవం పుష్కలంగా ఉన్నట్టు నటిస్తారు. 'సైకోడైనమిక్ సైకోథెరపీ' వంటి దీర్ఘకాలిక మానసిక చికిత్స అటువంటి డిజార్డర్ వ్యక్తులకు చేస్తారని డాక్టర్లు అంటున్నారు. ఆందోళన, నిరాశ, వ్యక్తిత్వ లోపాలు, భవిష్యత్తు పట్ల అపనమ్మకం వంటి కారణాలతో ఇలాంటి మానసిక ఆరోగ్య పరిస్థితులు సంభవించవచ్చు.

సిఎం రేవంత్ రెడ్డి బిఆర్‌ఎస్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించినప్పటికీ, వాటిపై చర్చ జరుగుతోంది. రేవంత్ కోరుకున్నదీ అదే. బిఆర్‌ఎస్ నాయకులు అధికారం కోల్పోయిన మరుక్షణం నుంచి మళ్లీ అధికారం చేబట్టాలన్న కాంక్షతోనే పోరాడుతున్నారు. సాధారణంగా అధికారంలో ఉన్న వారికి ఆకర్షణ ఎక్కువ ఉంటుంది. పాపులారిటీ కూడా సహజమే. ప్రభుత్వం ఏమి చేస్తోంది? ముఖ్యమంత్రి ఏమి చేస్తున్నారు? ఆయన ఏమి మాట్లాడుతున్నారు? సిఎం ఎలాంటి పథకాలకు రూపకల్పన చేస్తున్నారు? ఎలాంటి కార్యక్రమాలు రచిస్తున్నారు? తమకు జరిగే లాభం ఏమిటి? లేదా తమకు కలిగే నష్టం ఏమిటి? సిఎం సహా ఆయన సహచర మంత్రుల పనితీరు ఎలా ఉంది? ఎవరేమి చేస్తున్నారు? వంటి అనేక అంశాలను ప్రజలు గమనిస్తుంటారు. ఇప్పుడు సోషల్ మీడియా స్వైర విహారంతో ఏ విషయమైనా అందులో పాలు ఏమిటో, నీళ్లు ఏమిటో వాళ్ళు సులభంగా అర్థం చేసుకోగలుగుతున్నారు. కెసిఆర్ హయాంలో ఆయన కేంద్రంగానే రాజకీయాలు నడిచాయి. దానికి రివర్స్ గా ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రిత రాజకీయం నడుస్తోంది. ఇందులో తప్పుబట్టడానికి ఏమీ లేదు. కెసిఆర్ ప్రభుత్వ కాలంలో ఆయన లేదా ఆయన కొడుకు కెటిఆర్ మినహా మరొకరి గురించిన ప్రస్తావన, ప్రచారం శూన్యం. అంతగా వాళ్లిద్దరూ సకల వ్యవస్థలను చెరబట్టి ఆ వ్యవస్థలను తమ 'బానిసలు' గా మార్చుకున్నారన్న అపవాదు ఉన్నది.



బిఆర్‌ఎస్ తిరిగి కోలుకోలేనంతగా మారిపోతుందా లేక నెమ్మదిగా పుంజుకుంటుందా అన్నది తేలడానికి మరికొంత సమయం పడుతుంది. కాంగ్రెస్ కూడా అలాంటి పరిస్థితి కోరుకోకపోవచ్చు. కాంగ్రెస్ పార్టీని తన ప్రత్యర్థిగా బిజెపి అనుకుంటున్నది. తన ప్రత్యర్థి బిఆర్‌ఎస్ అయితేనే తమకు ప్రయోజనమని కాంగ్రెస్ భావన. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అలాగే ఆలోచిస్తూ ఉండవచ్చు. బిఆర్‌ఎస్ మరలా ప్రాంతీయ పార్టీగా రూపు దాల్చితేనే రెండు జాతీయపార్టీలతో తలపడవచ్చు. బిఆర్‌ఎస్‌నిజాయితీగా అంతర్మథనం చేసుకుంటుందో లేదో చూడాలి. 'పదేళ్ల కాలంలో జరిగిన పాపాల' కారణంగా ఆ పార్టీ ప్రతిష్ఠ దిగజారిపోయింది. మరోవైపు అహంకారాన్ని తొలగించుకునే ధోరణి కెటిఆర్‌లో కనబడడం లేదు. బిఆర్‌ఎస్ 'కుదురు' నుంచి కొత్త ప్రాంతీయపార్టీ అవతరించవచ్చునని, బయట చెల్లాచెదురుగా ఇతర పార్టీలలో ఆశ్రయం పొందిన ఉద్యమకారులను కలుపుకుని బలమైన కొత్త పార్టీ అవతరణకు గల అవకాశాలను తోసిపుచ్చలేమని కొందరు సీనియర్ జర్నలిస్టులు అంటున్నారు. టిఆర్‌ఎస్ బిఆర్‌ఎస్‌గా మార్పు చెందాక 'ప్రాంతీయపార్టీ' శూన్యత ఏర్పడిందన్నది వారి విశ్లేషణ. తెలంగాణ రాష్ట్ర రాజకీయ సమీకరణాల్లో ప్రాంతీయ పార్టీ లేకపోతే 'లెక్కలు' పూర్తిగా మారిపోనున్నవి. భవిష్యత్తులో తమదే అధికారం అని జనవరి 28న నల్లగొండలో కెటిఆర్ జోస్యం చెప్పారు. అయితే ఆ ప్రకటనలో, ధీమాలో 'తల పొగరు' ఎక్కువగా కనిపించినట్టు రాజకీయ పరిశీలకుడొకరు వ్యాఖ్యానించారు.

తెలంగాణలో బిఆర్‌ఎస్ అంతరించిపోతుందని బిజెపి అంటుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తికాలం మనజాలదని, మధ్యలోనే పడిపోతుందని అటు బిఆర్‌ఎస్ అనుకుంటున్నది. కాగా ఇప్పటికయితే రేవంత్ రెడ్డికి పార్టీ హైకమాండ్ దగ్గర 'రేటింగ్' బాగుంది. పదమూడు నెలల్లో 'ఇంటిపోరు' కనిపించలేదు. సిఎం రేవంత్ రెడ్డి, తన సహచర మంత్రుల శాఖల్లో వేలు పెట్టకపోవడం ఆయన సక్సెస్ ఫార్ములా. మంత్రులు తమ శాఖలపై 'పట్టు' సాధించే పనిలో ఉన్నారు. రెగ్యులర్‌గా తమ శాఖల పనితీరును సమీక్షిస్తున్నారు. ఇలాంటి ప్రజాస్వామిక వాతావరణం కెసిఆర్ హయాంలో ఎన్నడూ చూడలేదు. కెసిఆర్ సర్వాంతర్యామి కనుక ఆయనే అన్ని వ్యవహారాలూ చక్కబెట్టేవారు. మంత్రుల ను ఉత్సవవిగ్రహాలుగా మార్చేశారు. కేబినెట్ సమావేశాల్లో అప్పట్లో కడియం శ్రీహరి, తుమ్మల నాగేశ్వర రావు వంటి సీనియర్లు ఏదైనా మాట్లాడాలనుకున్నా 'నీకేం తెలుసు' అని కెసిఆర్ హేళన చేసేవారని ఆరోపణలున్నవి.

కాగా బిఆర్‌ఎస్ దయనీయ పరిస్థితిలో ఉందంటే ఆ పార్టీ నాయకులు ఒప్పుకోరు. పార్టీ అధినేత కెసిఆర్ ఫార్మ్ హౌజ్ వెలుపలికి వచ్చి ప్రజల్లోకి వెళ్లకపోతే మరో నాలుగేండ్లలో పార్టీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. కాంగ్రెస్, బిజెపిల నుంచి తనను తాను కాపాడుకోవడానికి 'ప్రాంతీయ మంత్రాన్ని' బిఆర్‌ఎస్ జపించక తప్పదు. తమను ఓడించి ప్రజలే తప్పు చేశారనే వ్యాఖ్యలను బిఆర్‌ఎస్ తక్షణం నిలిపివేయాలన్న డిమాండ్ ఆ పార్టీ క్యాడర్ నుంచే వస్తోంది. కెసిఆర్ హయాంలో అటు పాలన, ఇటు విధానాలలోనూ చేసిన తప్పులు జనాన్ని ఇంకా భయభ్రాంతులను చేస్తూనే ఉన్నాయి.

కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, లిక్కర్ స్కామ్, భూముల స్వాహా దాకా కెసిఆర్ మీద కేంద్రప్రభుత్వం 'అవకాశం' కోసం ఎదురు చూస్తోంది. బిఆర్‌ఎస్ తన గోతులను తానే చాలా ముందే తవ్వి పెట్టుకున్నందున ఆ నేరాలను కాంగ్రెస్ పార్టీ తవ్విపోస్తూనే ఉంటుందన్నది వాస్తవం.

తెలంగాణ వాదం, సాంస్కృతిక అస్తిత్వం వంటి మాటలను బిఆర్‌ఎస్ విడిచిపెట్టి పేరులో కూడా తెలంగాణ లేకుండా చేసుకోవడం ఆత్మహత్యా సదృశ ఘటన. ముమ్ముందు కూడా, బిఆర్‌ఎస్ తన మనుగడ కోసం తెలంగాణ వాదాన్ని ఆశ్రయించక తప్పదన్న అభిప్రాయం ఒకటున్నది. తెలంగాణ అస్తిత్వం తమ బ్రాండ్ అని ఇటీవల ఎమ్మెల్సీ కవిత ఒక సమావేశంలో అన్నారు. అయితే దానికి అనుగుణంగా కార్యాచరణ ఉండాల్సిన అవసరం ఉన్నట్టు పార్టీ శ్రేణుల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది.



నేదునూరి రాజమౌళి
9441200603

# బిసిల రణన్నినాదం..
# 'మేమెంతో మాకంత వాటా'

సమాజంలో కులాల మధ్య ఏర్పడ్డ అసమానతలను రూపుమాపాలంటే సామాజిక, ఆర్థిక, సాంఘి క, సాంస్కృతిక రంగాలలో వర్ణవ్యవస్థ పర్యవసానంగా, నిర్మాణం చేయబడిన నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను బద్దలుకొట్టాలి. దళిత బహుజనులు వివక్షతకు గురిచేయబడి అన్ని రంగాలలో వెనుకబడినందువల్ల బ్రిటీష్ ప్రభుత్వం 1872 నుండి 1931 వరకు కులాలవారీ జనగణన చేయడం జరిగినది. అప్పటినుండి ప్రతీ 10 సంవత్సరాలకు జనగణనతో పాటు కులగణన కూడ చేసి వెనుకబడిన వర్గాలకి చేయూతనివ్వాల్సిన పాలకులు అన్ని కులాల లెక్కలు తీసారు కానీ బిసి ల లెక్క చేయనందువల్ల అభివృద్ధిలో భాగస్వాములు కాలేకపోవడం జరిగింది. 1951 నుండి జనాభా లెక్కలు తీస్తూ ఎస్‌సి, ఎస్‌టి లకు వారి జనాభా ఆధారం గా రిజర్వేషన్లు కల్పిస్తున్నారు కానీ, మిగతా వారిని ఇతరులుగా నమోదుచేస్తు వెనుకబడిన తరగతులకు తీరని అన్యాయం చేయ డం జరిగింది. ఒబిసిల లెక్కలు లేనందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయడానికి అనేక సమస్యలు ఎదురౌతున్నాయి. దేశ జనాభాలో 56 శాతం ఒబిసి లు ఉన్నప్పటికీ సామాజిక రిజర్వేషన్లు 50శాతం మించకూడదనే సుప్రీం కోర్టు నిబంధన ప్రకారం కేంద్ర విద్య, ఉద్యోగా ల్లో ఒబిసి రిజర్వేషన్లు 27శాతానికి పరిమితం చేయబడినాయి. బిసి జనాభా లెక్కలు ఉన్నట్లయితే కోర్టుకు వెళ్లి మేమెంతో మా కంత వాటా ఇవ్వాలని ప్రయత్నించేందుకు అవకాశం ఉండేది. 2010లో, పార్లమెంటులో ప్రతిపక్షంగా భాజపా ఉన్నప్పుడు జనాభా గణనతో పాటు కులాల లెక్కలు తీయాలని గగ్గోలు పెట్టి ఇప్పుడు అధికారంలో ఉండి బిసి జనగణన చేయకపోవడాన్ని భాజప పై యొక్క ఎగువ కులాల పట్టును విదితం చేస్తున్నది. 10 శాతం కూడా లేని సవర్ణులకు 10శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ కల్పించడాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

కేంద్ర ప్రభుత్వం 1953లో కాకా కాలేల్కర్ అధ్యక్షతన నియమించిన మొదటి బిసి జాతీయ కమీషన్ నుండి నేటివరకు అనేక కమీషన్లు వేసి వదిలేసారు తప్ప సుప్రీంకోర్టు, హైకోర్టులు బిసి రిజర్వేషన్ల పెంపుకోసం బిసి ల కులగణన చేయాలని చేసిన సూచనను ప్రభుత్వం పట్టించుకోలేదు. అధికారికంగా ఒబిసి కులాల గణాంకాలు లేనందున విద్య, ఉద్యోగ, రాజకీయ, చట్ట సభలలో, స్థానిక సంస్థలలో బిసిలు తీవ్రంగా నష్టపోవడం జరుగుతున్నా 1993 నుండి ఒబిసి రిజర్వేషన్లు 27శాతం అమలు చేస్తున్నప్పటికీ నేటికీ అన్ని కేటగిరీల్లో 21శాతానికి మించలేదు. దేశంలో ఒబిసి రిజర్వేషన్ల విషయంలో ఒక్కో రాష్ట్రానిది ఒక్కో పాలసీగా ఉన్నది. ఒక రాష్ట్రం 72శాతం రిజర్వేషన్లు కల్పించినా న్యాయసమ్మతమే. మరో రాష్ట్రంలో 50శాతం దాటితే సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకమంటూ హైకోర్టులు కొట్టేస్తున్నాయి. బిసి రిజర్వేషన్ల అంశం రాష్ట్రాల జాబితాలో ఉన్నందున ఆయా రాష్ట్రాల రిజర్వేషన్ల శాతాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయిస్తాయి. కానీ, ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల అంశం కేంద్ర జాబితాలో ఉండడంతో వాటిలో మార్పులు, చేర్పులూ రాష్ట్రపతి చేస్తారు. 31సంవత్సరాలుగా రాష్ట్రంలో వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలు అమలులోకి తేలేక పోతున్నాయి. ఉపకులాల మధ్య పోటీ, వెనుకబడిన తరగతుల కులాల మధ్య పోటీ పెట్టి కేంద్ర, రాష్ట్ర పాలకులు తమాషా చూస్తున్నారు. తెలంగాణా ప్రభుత్వం స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఓట్ల పంట పండించుకొని అధికారంలోకి వచ్చి కోర్టుల అడ్డంకి ఉందని దాటవేయడంపై ప్రజాస్వామిక వాదులు బహుజనులతో కలిసి ఉద్యమించాలని బిసి హక్కుల సాధన సమితి (బిహెచ్‌ఎస్‌ఎస్) కోరుతున్నది.

1990లో వి.పి సింగ్ ప్రభుత్వం మండల్ కమీషన్ నివేదికని ఆమోదించడంతో ఒబిసి వర్గాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. మండల్ కమీషన్ సమర్పించిన నివేదికలో జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్ పరిమాణం ఉండాలని తేల్చిచెప్పింది. తాజా లెక్కలు లేవు కాబట్టి 1931 నాటి జనాభా లెక్కలే ప్రాతిపదికగా తీసుకొని బిసి రిజర్వేషన్లను 27శాతంగా నిర్ణయించింది. బిసి రిజర్వేషన్లు సక్రమంగా అమలు కావాలంటే రాబోయే జనాభా లెక్కల్లో విధిగా బిసి వర్గాల జనాభా లెక్కలు సైతం సేకరించాలని మండల్ కమీషన్ సిఫార్సు చేసింది. దానికనుగుణంగా 1996లో నాటి దేవేగౌడ ప్రభుత్వం 2001లో జరగనున్న జనాభా లెక్కల్లో బిసి జనాభా లెక్కలు తేల్చాలని పార్లమెంటులో ఏకగ్రీవ తీర్మానం ద్వారా ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన వాజ్‌పేయి బిజెపి(ఎన్‌డిఎ) ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాలకనుగుణంగా తమ ప్రభుత్వం బిసి జనగణన చేపట్టబోదు అని ప్రకటించింది. ఆ కారణంగా స్వతంత్ర భారతదేశంలో చేపట్టాల్సిన బిసి జనగణన అటకెక్కింది. అధికార బిజెపి పార్టీకి మాతృసంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ మొదటి నుండీ భారత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను వ్యతిరేకిస్తు మనుస్మృతిని శిరోధార్యంగా చెప్పుతూ వస్తుంది. భారత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వ్యవస్థను రక్షించుకొనుట ద్వారానే వెనుకబడిన తరగతుల హక్కులు సాధించబడతాయని ఉద్యమిద్దాం.

**బిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి**

చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్స్ ద్వారానే బిసి లకు రాజ్యాధికారం లభిస్తుంది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలైనప్పటికి జనాభాలో 56శాతం వున్న బిసి లకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వక పోవడం వల్ల బిసి లకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం అందని ద్రాక్షే అయింది. రాజకీయ పార్టీలు ఎన్నికలప్పుడే బిసి జపం చేస్తూ సార్వత్రిక ఎన్నికల్లో చట్ట సభల్లో పోటీ చేయడానికి టిక్కెట్లు కేటాయింపులో బిసిల పట్ల వివక్ష పాటించడం వల్ల ఎంబిసిలు కులవృత్తి దారులు చట్ట సభల్లో ప్రవేశించలేదు. దీన్ని నిరసిస్తూ ప్రజాస్వామిక ఉద్యమాల్లో 'బహుజన హితాయ – బహుజన సుఖాయ' అంటూ బహుజనులంతా ఐక్యమై ఉద్యమించి హక్కుల్ని సాధిద్దాం.

దేశ జనాభాలో 10శాతం కంటే తక్కువ ఉన్న ఎగువ కులాలవారు చట్టసభల్లో ప్రవేశించి రాజ్యాధికారం చెలాయిస్తున్నారు. జనాభాలో 56శాతం ఉన్న బిసిలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారు. కనీస వసతులు లేక దారిద్ర్య రేఖ కింద జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో పీడితులంతా ఐక్యమై శ్రామిక వర్గంతో కలిసి ఎగువకులాల రాజ్యాన్ని కూల్చి బహుజన రాజ్యాన్ని స్థాపించాల్సిన అవసరం ఉంది.

బిసిలకు న్యాయంగా, హక్కుగా దక్కాల్సిన పదవులు, ఉద్యోగాలు విద్య సంక్షేమం, అభివృద్ధి అవకాశాలు, సంపదలోనూ ఆటంకాలు వేల ఏండ్లుగా కల్పించారు. ఇది ప్రస్తుత ప్రజాస్వామ్యంలో కొనసాగడాన్ని నిరసిస్తూ శ్రామిక బహుజన పోరాటాలలో మమేకం కావాలని బిసి హక్కుల సాధనసమితి (బిహెచ్‌ఎస్‌ఎస్) పిలుపునిస్తుంది.

రాజ్యాంగంలో పొందుపరిచిన మేరకైనా పాలకులు సవ్యంగా అమలు జరపడం లేదు. అవన్నీ సక్రమంగా అమలు జరగాలంటే బిసిలు నిర్ణయాత్మక స్థానంలోకి రావాలి. అంటే రాజ్యాధికారంలోకి రావాలి అందుకోసం బిసి లందరు ఐక్యంగా పోరాడాల్సిన సందర్భమిది.

**(బిసి హక్కుల సాధనసమితి రాష్ట్ర సదస్సు జనవరి 31, 2025న వరంగల్లులో జరుగుతున్న సందర్భంలో)**



రాజేందర్ దామెర(దారా)
సీనియర్ జర్నలిస్ట్, వరంగల్

# మావోయిస్టులు పంథా మార్చుకుంటేనే ప్రయోజనం

ప్రస్తుత సమాజంలో సాయుధ పోరుకు తావు లేదు. ప్రాణాలు ఫణంగా పెట్టినంత మాత్రాన ఏ సమస్యా పరిష్కారం కాదు. చర్చలే పరిష్కారమనే సత్యాన్ని మావోయిస్టులు, పోలీసు బలగాలు, పాలకులు ఎవరూ కూడా పట్టించుకోవడం లేదనేది స్పష్టంగానే కనిపిస్తోంది. ముఖ్యంగా ఆరుపదుల సాయుధ ఉద్యమం దిక్కుతోచని స్థితిలో ఉందనడంలో సందేహం లేదు. వారి ప్రస్థానంలో సాధించిందేమీ లేదన్నది చరిత్ర చెబుతున్న చేదు నిజం. పొరుగున ఉన్న నేపాల్లో మావోయిస్టు నేతగా పేరుగాంచిన ప్రచండ వంటి నేతలు పోరుబాటను వీడి, జనజీవన స్రవంతిలోకి వచ్చి పార్లమెంటరీ పంథాను అనుసరించిన చారిత్రాత్మక సత్యం ఉండనే ఉంది. ఇలాంటి అనేక ఉదాహరణలు విశ్లేషణలు కళ్ల ముందే కనిపిస్తున్నప్పటికీ ఈ సత్యాన్ని భారత 'మావో'లు మాత్రం పరిగణనలోకి తీసుకున్నట్లుగా కనిపించడం లేదు. ఇంకా తమదైన పంథాలోనే ప్రయాణిస్తూ మారణహోమానికి బలిఅవుతున్నారు. రాజ్యం ఆదేశాలతో యుద్ధం చేస్తున్న పోలీసు బలగాలు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందుకు ఛత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలే నిదర్శ నం. పోలీసు బలగాలనో, మావోయిస్టులనో తప్పుపడట్టడమో, సమర్థించడమో ఇక్కడ ఉద్దేశ్యం కాదు కానీ సాయుధ పోరు ఫలితంగా మావోయిస్టుల గమ్యం, గమనం మాత్రం మారణహోమంలో ఆహుతి అవుతుందనేది మాత్రం కాదనలేని వాస్తవం. అంతేకాదు ఉద్యమం పేరుతో ఆయా ప్రాంతాల్లోని అమాయక ఆదివాసీ, గిరిజన జనం బలవుతున్నారు. ఏమాత్రం చైతన్యం ప్రదర్శించినా అర్బన్ నక్సలైట్ ముద్ర, 'ఉపా' లాంటి చట్టాలను ప్రయోగిస్తున్న పరిస్థితులు బహిరంగ రహస్యమే.

ఈ నేపథ్యంలో 'మావో'లు తమ పంథా మార్చుకోకపోతే సమాజానికి ఏమాత్రం ఉపయోగం లేదు. సుమారు ఆరు దశాబ్దాల నక్సల్బరీ, మావోయిస్టు ఉద్యమం రాజకీయ సిద్ధాంతం ఉన్న పార్టీనే కావచ్చు. అయినప్పటికీ కాలానుగుణంగా తమ సిద్ధాంతం మార్చుకోకపోతే ఓడిపోవడమో, లేక కనుమరుగు అవడమో లాంటి రక్తసిక్త యుద్ధ చరిత్ర మాత్రమే మిగిలిపోతుంది.

అయితే పాలకులు తమ టార్గెట్ ఏమిటో ఇప్పటికే చాలా స్పష్టంగానే ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది మార్చి వరకు మావోయిస్టు పార్టీని లేకుండా చేస్తామని చెప్తూనే ఉన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ సంకల్పం, భద్రతా బలగాల ఉమ్మడి ప్రయత్నాలతో దేశంలో మావోయిస్టు పార్టీ కొన ఊపిరితో ఉందని సాక్షాత్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన 'ఎక్స్' ఖాతాలో వ్యాఖ్యానించిన విషయం కూడా బహిరంగమే. ఇంతటి క్లారిటీతో పాలకులు ఉన్నప్పుడు ఆ రాజ్య శక్తిని ఎదుర్కొనే పరిస్థితి ఉందా లేదా అనే వాస్తవ పరిస్థితిని 'మావో'లు పరిగణనలోకి తీసుకోవాలి.

ఇంకా చెప్పాలంటే కనీసం ప్రతిఘటించే పరిస్థితుల్లో కూడా మావోయిస్టు పార్టీ లేదని పరిస్థితులు, విశ్లేషణలు తేటతెల్లం చేస్తున్నాయి. అన్ని రకాలుగా బలమైన శక్తిగా ముందుకు సాగుతున్న రాజ్యంతో మావోయిస్టు పార్టీ తలపడే పరిస్థితి మారిన ఈ కాలం పరిస్థితుల్లో ఏమాత్రం లేదు. టెక్నాలజీ క్షేత్ర స్థాయిలో ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం జనానికి ఊరటనిస్తూనే ఉన్నాయి. యువత సైతం తమ భవిష్యత్తును, మనుగడను చూసుకుంటున్న పరిస్థితి ఉంది. మావోయిస్టులే కాదు పార్లమెంటరీ పంథాలో ప్రజాస్వామికయుతంగా ఎన్నికల్లో పాల్గొంటున్న ఎర్ర జెండా పార్టీల వైపు కూడా యువత అంతగా ఆసక్తికరంగా లేరనేది ఏ మాత్రం పరిశీలించిన కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితు ల్లో మావోయిస్టులు సాయుధ పోరుతో చేసేది ఏముంటుంది..? మావోయిస్టులు హింస వైపు నిలబడ్డారని ఆ హింసను అరికట్టే పేరుతో పాలకులు పోలీసు బలగాలతో ప్రతిహింస చేయకూడదు. హింసను అరికట్టే అవసరం బాధ్యత పాలకులపై ఉన్నప్పటికీ అది రాజ్యాంగ బద్ధంగానే, రాజ్యాంగ న్యాయ సూత్రాలకు లోబడి ఉండాలి. మావోయిస్టులు తమ పంథా మార్చుకుని సాయుధ ఉద్యమానికి బదులు ప్రజాస్వామ్య బద్ధంగా పార్లమెంటరీ పద్ధతిని అనుసరించేలా తమ సిద్ధాంతాన్ని మార్చుకోని ముందుకు సాగితే సమాజానికి కొంత మేలు జరుగుతుందనేది గుర్తించాలి.

# సామాజిక అసమానతలపై గళమెత్తిన గద్దర్

ప్రజా వాగ్గేయ కారుడు, ప్రజా కవి, కళాకారుడు ప్రజా యుద్ధ నౌక గద్దర్ తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చిన ఆ గొంతు శాశ్వతంగా మూగబోయి పద్దెనిమిది నెలలయింది. గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్ రావు, మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన లచ్చుమ్మ, శేషయ్య దంపతులకు జనవరి 31,1949లో జన్మించారు. దాదాపు అరవై వసంతాలు పైగా ప్రజలతో మమేకమై ఎన్నో ప్రజా ఉద్యమాలకు తన మాట, పాట ద్వారా ఊపిరి నింపిన విప్లవకారుడు. నక్సల్బరీ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, దళిత బహుజన ఉద్యమం, సాంస్కృతిక ఉద్యమం ఇలా అన్ని ఉద్యమాలలో తన పాటలతో ప్రజా జీవితాలను ప్రభావితం చేశారు. ప్రభుత్వాలను కదిలించారు. పీపుల్స్ వార్, మావోయిస్టు ఉద్యమం, తెలంగాణ ఉద్యమాల్లో తన గొంతు వినిపించారు గద్దర్. తన గళంతో కోట్లాది మంది ప్రజలను ఉత్తేజపరిచారు. దేశంలో దళితుల హత్యల పై గద్దర్ అవిశ్రాంతంగా పోరాటం చేశారు. నకిలీ ఎన్‌కౌంటర్లను తీవ్రంగా వ్యతిరేకించారు. అమరవీరుల కుటుంబాలకు చేయూత నిచ్చేవారు. పీపుల్స్ వార్ పార్టీ క్యాడర్ రిక్రూట్మెంట్ తన పాటల ద్వారా ప్రభావితం అయ్యింది. చాలామంది సానుభూతిపరులు, పౌర ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, దళిత బహుజన సంఘాలలో సాంస్కృతి క విప్లవం తెచ్చిన వ్యక్తి. ఆయన పాటలతో ఉత్తేజమై ఎందరో నక్సల్ ఉద్యమంలో చేరారు. ఈ క్రమంలోనే 1997 ఏప్రిల్ 6 న గద్దర్‌పై హత్యాయత్నం జరిగింది. నాడు మరణం అంచుల దాకా వెళ్లి, ప్రాణాలతో బయటపడ్డారు. తాను జీవించి ఉన్న చివరి రోజులలో సామాజిక సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణ, అణగారిన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ద్వారానే అని గ్రహించి కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సభలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ పట్ల వల్లమాలిన అభిమానం. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీతో పాల్గొన్నారు, పౌర ప్రజా సంఘాల తో మమేకమై భారత్ బచావో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. మణిపూర్ లో మహిళలను నగ్నంగా ఊరేగించినా, ఢిల్లీలో దేశానికి పతకాలు సాధించిన రేజిలర్లుపై లైంగిక వేధింపులు జరిగినా, బిల్కిస్ బాను రేప్ కేసులో నిందితులను క్షమాభిక్ష ప్రసాదించినా మాకు సంబంధించిన విషయాలు కావని మౌనం పాటిస్తున్న పార్టీలు చివరికి గద్దర్‌ను భౌతికంగా నిర్మూలించేందుకు దాడులు జరిపిన పార్టీ లు సైతం గద్దర్ ని కొనియాడుతున్నారు. అలాగే ఒక విప్లవకారుడి చివరి అంతిమ యాత్రలో ప్రభుత్వ లాంఛనాలతో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అరుదైన వ్యక్తి గద్దర్. ప్రాంతాల మధ్య అంతరాలను వెనుకబాటుతనాన్ని గట్టిగా వ్యతిరేకించారు. సమాజ పురోభివృద్ధికి ప్రతిబంధకాలు అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాలు, మతోన్మాదం, అశ్లీలత అని భావించి ప్రజలలో తన ఆట పాట ద్వారా ప్రజలను ఆలోచింపచేసి భావ విప్లవం తెచ్చిన మహానుభావుడు. 2023 జనవరిలో రాయలసీమ ప్రజా సంఘాల వేదికలో ప్రసంగించారు. నీళ్లు నిధులు ప్రాంతీయ అసమానతలు తుదముట్టించడానికి లౌకిక ప్రజాతంత్ర ఉద్యమానికి బాసటగా నిలిచారు. రాయలసీమ పట్ల ప్రత్యేక అభిమానం. ముప్పై సంవత్సరాల క్రిందట మహాబోధి విద్యాలయం ఏర్పాటు చేసి ఎందరో విద్యార్థులకు విద్యా ప్రదానం చేశారు. పాఠశాలలో తల్లిదండ్రులు కోల్పోయిన వారికి, సింగిల్ పేరెంట్ పిల్లలకు ఉచిత విద్య అందించారు. గుమ్మడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టారు. తెలుగు నేలపైన ప్రజాకళలు ఉన్నంత వరకు గద్దర్ పాట సజీవంగా ఉంటుంది.



డా జి. వెన్నెల గద్దర్, చైర్ పర్సన్,
తెలంగాణ సాంస్కృతిక సారథి



## కుంభమేళా తొక్కిసలాటపై సుప్రీంలో పిటిషన్

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలి రావడంతో తొక్కిసలాట జరిగింది. సంగం ఘాట్ వద్ద చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ తాజాగా సుప్రీంకోర్టులో గురువారం పిటిషన్ దాఖలైంది. విశాల్ తివారీ అనే న్యాయవాది ఈ వ్యాజ్యాన్ని వేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రాలకు స్పష్టమైన, విధానపరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. భక్తుల భద్రత ప్రమాదంలో పడకుండా నివారించేలా వీఐపీల కదలికలను ఆపాలని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ వ్యాజ్యం నేపథ్యంలో తొక్కిసలాటపై యూపీ ప్రభుత్వం స్టేటస్ రిపోర్ట్ సమర్పించాల్సి ఉంటుంది. జనవరి 13న ప్రారంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు జరగనుంది.

## ఢిల్లీలో గెలుపు మాదే: రాజ్‌నాథ్



**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దీమా వ్యక్తంచేశారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోలో చెప్పిన విషయాలను అమలు చేసే ఏకైక పార్టీ బిజెపి మాత్రమేనన్నారు. దిల్లీలో ఈసారి బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. తమ గెలుపును ఏ పార్టీ అడ్డుకోలేదన్నారు. పదేళ్ల ఆప్ పాలనలో దిల్లీలో అభివృద్ధి శూన్యమని ఆరోపిం చారు.

## భార్యను చంపి.. తానూ కాల్చుకున్న జవాన్

**భోపాల్:** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) జవాన్ తన భార్యను గన్‌తో కాల్చి చంపాడు. ఆ తర్వాత తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. బంగ్రాసియా ప్రాంతంలోని సిఆర్‌పిఎఫ్ బేస్‌లో 35 ఏళ్ల రవికాంత్ వర్మ జవాన్‌గా పని చేస్తున్నాడు. మిస్రోద్ ప్రాంతంలోని అద్దె ఫ్లాట్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. కాగా, బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సిఆర్‌పిఎఫ్ జవాన్ రవికాంత్ ఫోన్ చేశాడు. తన భార్య రేణు వర్మను కాల్చి చంపినట్లు చెప్పాడు. ఆ తర్వాత తనను తాను కాల్చుకున్నాడు. మరోవైపు పోలీసులు వెంటనే ఆ ఇంటికి చేరుకున్నారు. జవాన్, అతడి భార్య రక్తపు మడుగులో పడి ఉండటం చూశారు. వారి పిల్లలైన రెండున్నర ఏళ్ల కుమార్తె, ఆరేళ్ల కుమారుడు ఒక గదిలో ఏడుస్తుండటాన్ని గమనించారు. కాగా, మృతదేహాల దగ్గర పడి ఉన్న సర్వీస్ రివాల్వర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం భోపాల్ ఎయిమ్స్‌కు తరలించారు. ఈ కేసుపై దర్యాప్తు కోసం సిఆర్‌పిఎఫ్ సహాయాన్ని కోరతామని పోలీస్ అధికారి వెల్లడించారు.

## శ్రీలంక జైలు నుండి విడుదలైన మత్స్యకారులు

**చెన్నై:** శ్రీలంక జైలు నుండి విడుదలైన ఆరుగురు మత్స్యకారులు తమిళనాడు చేరుకున్నారు. మత్స్యకారులు తమిళనాడులోని రామేశ్వరానికి చేరుకున్నారని చెన్నై విమానాశ్రయ అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యంతో వారు విడుదలయ్యారని పేర్కొన్నారు. ఆరుగురు మత్స్యకారులతో కొలంబొ నుండి బయలుదేరిన విమానం బుధవారం రాత్రి చెన్నై విమానాశ్రయానికి చేరిందని ఆ ప్రకటనలో తెలిపారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం స్వాగతం పలికిందని అన్నారు. రోడ్డు మార్గంలో వారు సొంత జిల్లాకు చేరుకునే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈనెల 12న చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులను సరిహద్దు దాటడంతో శ్రీలంక కోస్ట్‌గార్డులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వారి నౌకను కూడా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచడంతో రిమాండ్‌కు తరలించారు. అరెస్టయిన మత్స్యకారులను విడుదల చేయడంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరుతూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు లేఖ రాశారు.

# ఉద్యోగాలు మృగ్యం... పెరుగుతున్న అసమానతలు

### మోదీ సర్కార్ అసమర్థ ఆర్థిక విధానాల ఫలితం: కాంగ్రెస్ ధ్వజం



**న్యూఢిల్లీ:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న అసమర్థ ఆర్థికవిధానాల కారణంగా దేశంలో నిరుద్యోగ కల్పన మృగ్యం కావడంతో పాటు ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. కేంద్ర బడ్జెట్‌కు ముందు, కాంగ్రెస్‌పార్టీ గురువారం ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తున్న తీరును దుయ్యబట్టింది. దేశంలో ఆర్థిక వృద్ధి మందగమనంలో ఉందని పేర్కొంది. గత సంవత్సరంతో పోలిస్తే ఆర్థిక వద్ధి 2 శాతం వరకు తగ్గవచ్చని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం అన్నారు. గురువారం అక్బర్‌రోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ మాజీ ఎంపీ రాజీవ్ గౌడ, అతని బందం రూపొందించిన 'రియల్ స్టేట్ ఆఫ్ ది ఎకానమీ 2025' నివేదికను విడుదల చేసిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉంది... దీన్ని ఏమాత్రం తిరస్కరించలేం. గత సంవత్సరం వద్ధితో పోలిస్తే రెండు శాతం వరకు పడిపోవచ్చు' అని అన్నారు. ''ఉద్యోగాలు లేవు. నిరుద్యోగం 40 శాతానికి దగ్గరగా ఉంది. ప్రధానమంత్రి ఎప్పటికప్పుడు ప్రజలకు లేఖలు అందజేస్తున్నప్పటికీ ఉద్యోగాలు లేవు. అది ఖాళీ పోస్టులను భర్తీ చేయడం మాత్రమే. కొత్త ఉద్యోగాల సష్టి ఎంతమాత్రం లేదు'' అని ఆయన అన్నారు. గత నాలుగుఐదు సంవత్సరాలుగా వేతనాలు స్తబ్దుగా ఉన్నాయని చిదంబరం అన్నారు. 'ఆహారం, విద్య, ఆరోగ్య సంరక్షణ ద్రవ్యోల్బణం రెండంకెలలో ఉంది. ద్రవ్యోల్బణం 23 సంవత్సరాలుగా పెరుగుతోంది' అని చిదంబరం పేర్కొన్నారు. ప్రజల మధ్య భారీ ఆదాయ అసమానత ఉందని పేర్కొంటూ, అగ్ర భాగాన ఉన్న 2030 శాతం మంది మెరుగ్గా ఉండవచ్చని, కానీ మిగిలిన 70 శాతం మంది, దిగువన ఉన్న సగం మంది రోజుకు రూ. 100150 తో జీవిస్తున్నారనేదానితో తాను ఏకీభవిస్తానని చిదంబరం అన్నారు. భారీ అసమానతలు ఉన్నాయి.ధనిక మరియు పేదల మధ్య అంతరం పెరుగుతోంది. దీనిని పరిష్కరించడానికి ప్రభుత్వం ఏమీ చేయలేదని ఆయన అన్నారు. పార్టీ విడుదల చేసిన నివేదికలో పేర్కొన్న అనేక వాస్తవాలను కేంద్ర ప్రభుత్వం దాచిపెట్టిందని చిదంబరం అన్నారు. ఆర్థిక వ్యవస్థ యొక్క అవాస్తవ స్థితిని ప్రభుత్వం ప్రతిరోజూ, ప్రతి గంటకు ముందుకు తెస్తున్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థ యొక్క వాస్తవ స్థితిపై నివేదికను సమర్పించాలని ప్రొఫెసర్ రాజీవ్ గౌడ బందం నిర్ణయించిందని ఆయన అన్నారు.

## జాతిపితకు ఘన నివాళి



**న్యూఢిల్లీ :** జాతిపిత, స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మాగాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం దిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సహా అనేక మంది కేంద్రమంత్రులు, ఆర్మీ, నేవీ, వైమానిక దళ అధిపతులు మహాత్మునికి నివాళులర్పించారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నాయకులు బాపూజీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ... ''పూజ్య బాపు పుణ్య తిథి సందర్భంగా ఆయనకు నివాళులు. ఆయన ఆదర్శాలు అభివద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడానికి మనల్ని ప్రేరేపిస్తాయి. మన దేశం కోసం అమరులైన వారందరికీ నేను నివాళులు అర్పిస్తున్నాను. వారి సేవ త్యాగాలను గుర్తుచేసుకుంటున్నాను.'' అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని, దేశ స్వాతంత్ర్యానికి ఆయన చేసిన కషిని గౌరవించుకుంటూ... భారత దేశం ప్రతి సంవత్సరం జనవరి 30న అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటుంది.

## కుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం

### కాలి బూడిదైన 15 గుడారాలు
### ఎటువంటి నష్టం జరగలేదని అధికారుల ప్రకటన

**లక్నో:** మహాకుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌లో మరోసారి అపశతి చోటు చేసుకుంది. ఇప్పటికే ఒకసారి అగ్ని ప్రమాదం జరగ్గా... మౌని అమావాస్య సందర్భంగా బుధవారం తెల్లవారుజామున తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. అయితే తాజాగా మరోసారి అక్కడ ప్రమాదం జరిగింది. గురువారం మహా కుంభమేళాలలో మళ్లీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రయాగ్‌రాజ్ సెక్టార్22లోని ఛట్‌నాగ్ ఘాట్ వద్ద ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు స్థానికులు వెల్లడించారు. ఈ అగ్ని ప్రమాద ఘటనలో అక్కడ ఏర్పాటు చేసిన దాదాపు 15 గుడారాలు కాలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. వెంటనే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గతంలోనూ కుంభమేళాలో అగ్ని ప్రమాదం జరిగింది. 11 రోజుల క్రితం మహా కుంభమేళాలో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఒక్కసారిగా భారీగా మంటలు వ్యాపించాయి. ఆ ఘటనలో 18 టెంట్లు దగ్ధం అయ్యాయి. మహా కుంభమేళాలో వరుస అగ్ని ప్రమాదాలు జరగడం భక్తులను ఆందోళనకు గురిచేస్తున్నా... ప్రయాగ్‌రాజ్‌కు భక్తుల తాకిడి మాత్రం తగ్గడం లేదు.



మహాకుంభమేళాలో మౌని అమావాస్యనాడు(జనవరి 29) జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో యూపీ సర్కార్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తొక్కిసలాట నేపథ్యంలో సీఎం యోగి ఆదిత్యనాథ్... ప్రయాగ్‌రాజ్, కౌశాంబి, వారణాసి, అయోధ్య, మీర్జాపుర్, బస్తీ, జౌన్‌పుర్, చిత్రకూట్, బండా, అంబేద్కర్ నగర్, ప్రతాప్‌గఢ్, సంత్ కబీర్ నగర్, భదోహి, రాయబరేలి, గోరఖ్‌పూర్‌కు చెందిన సీనియర్ పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వివిధ శాఖల మధ్య సమన్వయం కుదిర్చేందుకు ఐదుగురు ప్రత్యేక అధికారులను నియమించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వివిధ మార్గదర్శకాలు జారీ చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

## మహాకుంభమేళాలో 'కఠినభద్రత'

### యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలు



**లక్నో :** మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో **30** మంది భక్తులు మరణించగా, 60మందికి గాయాలైన పెనువిషాద ఘటనతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మేల్కొంది. మహాకుంభమేళావద్ద కఠిన భద్రతా చర్యలు చేపట్టింది. రానున్న ఫిబ్రవరి 3వ తేదీన జరుగనున్న వసంత్ పంచమి అమృత్‌స్నానాల సందర్భంగా కుంభమేళా వద్ద 'నో వెహికిల్ జోన్'గా ఆదేశాలు జారీచేస్తూ 'వివిఐపి పాస్' నిబంధనను నిషేధించింది. అంతేకాకుండా ప్రయాగ్‌రాజ్‌లో డిప్యూటీ సీనియర్ అధికారులను నియమించి మరింత సమర్థవంతంగా మేళాను నిర్వహించేలా చర్యలు తీసుకుంది. మహాకుంభ్ డిఐజి వైభవ్ కృష్ణ సంగం ముక్కు (సంగమం)వద్దకు చేరుకోవడానికి ప్రయత్నించినప్పుడు యాత్రికులు ఒక్కసారిగా బారికేడ్లను పైకి నెట్టడంతో తొక్కిసలాటకు కారణమైంది. ఈ ఘటన నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అధ్యక్షతన జరిగిన అత్యున్నత స్థాయి లేట్‌నైట్ మీటింగ్‌లో వివిధ జిల్లాలకు చెందిన సీనియర్ అధికారులు, ఆయన ఈ విషాద సంఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు ఒక త్రిసభ్య కమిటీని నియమించి, జ్యుడీషియల్ విచారణకు ఆదేశించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని అంచనాల నేపథ్యంలో పూర్వపు డివిజనల్ కమిషనర్ ఆశిష్ గోయల్, అలహాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ మాజీ వైస్‌ఛైర్మన్ భాను గోస్వామి సహా 5గురు ప్రత్యేకకార్యదర్శులను కుంభమేళాలో మోహరించాలని ఆదేశించారు. ప్రత్యేకించి ఫిబ్రవరి 3న జరుగనున్న రాబోయే మూడవ బసంత్‌పంచమి సందర్భంగా 'అమృత్‌స్నాన్' వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమర్థవంతంగా చర్యలు తీసుకునేలా జాగ్రత్త వహించారు. ఇంతకుముందు నిర్వహించిన ప్రసిద్ధ కుంభమేళా నిర్వహణలో సమర్థులుగా పేరొందిన ఆశీష్‌గోయల్, భానుగోస్వామిని అక్కడ నియమించారు. వీరందరూ ఫిబ్రవరి 12వరకూ అక్కడే ఉండి మహాకుంభమేళా ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. 'రానున్న రోజులలో ప్రజల భద్రత, సమర్థవంతంగా నిర్వహణ ఉండేలా ప్రయాగరాజ్ అధికారయంత్రాంగంతో నిరవధిక సమన్వయం చేసుకునేందుకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమీప జిల్లాలైన చిత్రకూట్, మీర్జాపూర్, వారణాసి, అయోధ్య నుంచి అధికారులను ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా నిర్వహణ కోసం నియమించారు. ప్రయాగ్ రాజ్ జిల్లా కలెక్టర్, అడిషనల్ డైరెక్టర్ జనరల్‌తో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి యోగిఆద్యినాథ్ కీలక మార్గదర్శకాలు జారీచేశారు.'మహాకుంభమేళాకు హాజరైన భక్తులు పవిత్ర స్నానాలు చేసిన అనంతరం వెళ్లిపోయేందుకు ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్ వద్దకుభారీ సంఖ్యలో చేరుకున్నారు. వారి ప్రయాణానికి ఏర్పాట్లు కల్పించడం మన బాధ్యత. ఇందుకోసం రైల్వే సహకారంతో వారిని సమన్వయం చేసుకోవాలి.నిరంతరం రైళ్ల రాకపోకలు కొనసాగేలా దృష్టిసారించాలి. అదనంగా ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ తరపున బస్సులు ఏర్పాటుచేసి ప్రయాణీకులు గమ్యస్థానాలకు వెళ్లిపోవడం ద్వారా రద్దీని తగ్గించాలి అని ముఖ్యమంత్రి వారికి చెప్పారు. భక్తులకు ఆహారం, తాగునీరు ఏర్పాటుచేసి వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూసుకోవాలని సిఎం ఆదేశించారు. మహాకుంభమేళా ప్రాంతంలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడకుండా వాహనాల రాకపోకలు, భక్తుల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని సంబంధిత ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫిబ్రవరి 3న జరుగనున్న వసంత పంచమి అమృత్‌స్నానాల ఏర్పాట్ల సమీక్ష సమావేశం గురువారం నిర్వహించాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, డిజిపిలను ఆదేశించారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేలా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటున్నది.

# కేజ్రీవాల్ సమాధానంపై ఇసిఐ అసంతృప్తి

**న్యూఢిల్లీ :** హర్యానా ప్రభుత్వం యమునా నదిలో 'విషం కలుపుతోంది' అని చేసిన అభియోగాలకు సంబంధించి ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇచ్చిన సమాధానంపై భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) అసంతృప్తి వ్యక్తం చేసింది. హర్యానా ప్రభుత్వం ఉద్దేశపూర్వకకంగానే యమునా నదిని విషపూరితం చేసిందని ఎన్నికల ప్రచారం సందర్భంగా కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు విస్తృతంగా ప్రచారమయ్యాయని, వాటిపై ఆప్ కన్వీనర్ ఇచ్చిన సమాధానం పూర్తిగా మౌనంగా ఉందని ఎన్నికల కమిషన్ కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో పేర్కొంది. అనేక నిర్దిష్టమైన అంశాలపై వివరణ కోరుతూ ఈనెల 31వ తేదీన 11 గంటల లోపు సమాధానం ఇవ్వాలని ఆ లేఖలో సూచించింది. లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. అయితే తాము ఇచ్చిన నోటీసుల మేరకు కేజ్రీవాల్ సమాధానం ఇచ్చినప్పటికీ యమునా నదిలో విష ప్రయోగం జరిగిందని ఆయన చేసిన వ్యాఖ్యల్లో కీలకమైన అంశాలపై సమాధానం ఇవ్వడంలో విఫలం చెందారని ఎన్నికల సంఘం ఎత్తిచూపింది. ప్రచారం సందర్భంగా కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ యమునా నదిలో అమోనియా స్థాయిలు పెరగడాన్ని రెండు దేశాల మధ్య యుద్ధంలా చూడొద్దని సూచించింది. అమోనియా స్థాయిలను ఢిల్లీ జల్ బోర్డు ఇంజనీర్లు సకాలంలో గుర్తించారని, ఢిల్లీ సరిహద్దులో విషపూరిత నీటిని ఆపివేసినట్లు తెలిసింది. అయితే హర్యానా ప్రభుత్వం యమునా నదిలో విషయం కలిపినట్లు ఎలాంటి వాస్తవాలను, చట్టబద్ధమైన ఆధారాలను చూపలేదని ఇసిఐ తెలిపింది. ఈ నేపథ్యంలో మరింత వివరణాత్మకమైన సమాధానం ఇచ్చేందుకు కేజ్రీవాల్‌కు మరో అవకాశం కల్పించింది. హర్యానా ప్రభుత్వం యమునా నదిలో కలిపిన విషం రకం, విషం యొక్క పరిమాణం, స్వభావం, దానిని గుర్తించే పద్ధతి స్థానం, విషపూరిత నీరు ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిరోధించడంలో ఢిల్లీ జల్ బోర్డు ఇంజనీర్ల పాత్రకు సంబంధించిన ఆధారాలను స్పష్టం చేయాలని కమిషన్ కేజ్రీవాల్‌ను కోరింది. హర్యానా విడుదల చేసిన నీటి కారణంగా నదిలో అమోనియా స్థాయిలు ఉద్దేశపూర్వకంగా పెరిగాయని ఆరోపిస్తూ ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రుల నుండి ఉమ్మడి లేఖలు అందాయని కమిషన్ పేర్కొంది. హర్యానా ప్రభుత్వం నుండి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ సమస్యను విడిగా పరిష్కరిస్తున్నట్లు ఇసిఐ పేర్కొంది. యమునాలో పెరిగిన అమ్మోనియా సమస్యను నది విషపూరితమైందన్న అభియోగాలతో జతచేయవద్దని ఆప్ కన్వీనర్‌కు విజ్ఞప్తి చేసింది. యమునా నదిలో వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచడంతో పాటు అశాంతిని కలిగించేలా తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని కోరింది.




## సిఇసి రాజకీయాలు చేస్తోంది

### ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది : కేజ్రీవాల్



**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ముఖ్య కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యమునా నదిలో హర్యానా ప్రభుత్వం విషయం కలిపిందని తాను చేసిన వ్యాఖ్యలపై నోటీసులు ఇస్తూ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. గురువారం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. రాజీవ్‌కుమార్ ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీశారని మండిపడ్డారు. పదవీవిరమణ తరువాత తన స్థానం ఏమిటనే దానిపై దృష్టిసారించారన్నారు. హర్యానా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపై ఆయనకు ఎన్నికల సంఘం నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే నోటీసులకు ఆప్ సుప్రీం సమాధానం ఇచ్చారు. ఆ సమాధానంపై ఎన్నికల కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో కేజ్రీవాల్ స్పందించారు. ఎవరూ చేయని విధంగా ఎన్నికల కమిషన్‌ను రాజీవ్‌గాంధీ భ్రష్టుపట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయవచ్చన్నారు. మూడు బాటిళ్ల కలుషితమైన నీటిని ఎన్నికల కమిషన్‌కు పంపిస్తా, వాటిని ముగ్గురు ఎన్నికల కమిషనర్లు విలేకర్ల సమావేశంలో తాగండని కేజ్రీవాల్ తాగండి, అప్పుడు నేను తప్పును ఒప్పుకుంటా' అని కేజ్రీవాల్ సవాల్ విసిరారు. తాను బతికి ఉన్నంత కాలం ఢిల్లీ వాసులను విషపూరితమైన నీటిని తాగనివ్వబోనన్నారు. రెండు రోజుల్లో తనను అరెస్టు చేస్తారని, అయినా భయపడబోనన్నారు. ఇసి నోటీసులపై కేజ్రీవాల్ స్పందిస్తూ గత కొన్ని రోజులుగా హర్యానా నుంచి ఢిల్లీకి అమోనియా మోతాదు అధికంగా ఉన్న జలాలను సరఫరా అవుతున్నాయని ఆప్ ఆరోపించింది.

## ఇది 90వ దశకం కాంగ్రెస్ కాదు



**న్యూఢిల్లీ :** దళితులు, వెనుకబడిన వర్గాల ప్రయోజనాల పరిరక్షణ అంశాన్ని 1990వ దశకంలో కాంగ్రెస్ విస్మరించిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. మునుపటి విలువలున్న కాంగ్రెస్ మళ్లీ వచ్చేసిందని, త్వరలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు తోక ముడిచి పరార్ కావాల్సిందేనని హెచ్చరించారు. 'వంచిత్ సమాజ్: దశ ఔర్ దిశ' పేరుతో గురువారం ఢిల్లీలో దళిత ఇన్‌ఫ్లూయెన్సర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'రాజకీయాల్లో అంతంత మాత్రంగా చోటు పొందితే దళితులు, బిసిల సమస్యలు పరిష్కారం కావు. వాళ్లు ప్రభుత్వ వ్యవస్థల్లో, సంపదలో భాగాన్ని పొందే స్థాయికి ఎదగాలి. ఇందిరాగాంధీ హయాంలో దళితులు, మైనారిటీలు, బిసిల ప్రయోజనాలను కాపాడగలమనే స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉండేది. 1990వ దశకం వచ్చేసరికి పార్టీలో చాలా లోటుపాట్లు జరిగాయి. ఆ విషయంలో కాంగ్రెస్ అంతగా స్పందించలేదు. మనం కేవలం రాజకీయ ప్రాతినిధ్యం గురించి మాట్లాడి సరిపెట్టకూడదు. రాజకీయప్రాతినిధ్యం కోసమే కాన్షీ రామ్ పోరాడారు. కానీ బిజెపి వాళ్లు రాజకీయ ప్రాతినిధ్యాన్ని ప్రాధాన్యం లేని అంశంగా మార్చారు. దళితులు, బిసి వర్గం ప్రజాప్రతినిధులను మాట్లాడలేని విగ్రహాల్లా మార్చామని లోక్‌సభలో కొందరు బిజెపి ఎంపిలు చెప్పారు. విద్యారంగం, న్యాయ రంగం, కార్పొరేట్ ప్రపంచం ఇలా ప్రతీ చోటా అధికార వాటాను చేజిక్కించుకోవాలి' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సూచించారు. 'ప్రాతినిధ్యం వహించడానికి, అధికారంలో వాటాను పొందడానికి చాలా తేడా ఉంది. బిసిలు దేశంలో 50 శాతం మంది ఉన్నారు. అయితే అధికారంలో బిసిల వాటా 5 శాతమే. దళితులు దేశంలో 15 శాతం మంది ఉన్నారు. అధికారంలో వాళ్ల వాటా 1 శాతమే. అధికారంలో వాటా, సంపదలో వాటాలో ఎక్కడున్నాం అనేది ఆలోచించుకోవాలి. దళితులు, బిసిలు అధికారంలో వాటాను దక్కించుకునే దాకా ఆయా వర్గాల సమస్యలకు పరిష్కారాలు దొరకవు' అని రాహుల్ గాంధీ తెలిపారు.

## అత్యాచారం కేసులో ఎంపి అరెస్టు




**లక్నో :** కాంగ్రెస్ ఎంపి రాకేశ్ రాథోడ్‌ను ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. సీతాపూర్ ఎంపిగా ఉన్న ఆయనపై అత్యాచార ఆరోపణలపై కేసు నమోదు కావడంతో అదుపులోకి తీసుకున్నారు. సీతాపూర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతుండగానే ఆయనను అ రెస్టు చేసినట్టు సమాచారం. భారీ పోలీస్ భద్రత నడుమ ఆయనను కోర్టుకు తీ సుకెళ్లారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్లుగా తనపై అత్యా చారానికి పాల్పడినట్టు ఆరోపిస్తూ ఓ మహిళ జనవరి 17 న పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో మాట్లాడిన కాల్ రికార్డింగ్స్‌ను సైతం పోలీసులకు సమ ర్పించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయమే ఎంపి రాథోడ్ అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా, న్యాయస్థానం తిరస్కరించింది. రెండు వారాల్లోగా సెషన్స్ కోర్టులో లొంగిపోవాలని సూచించినట్టు సమాచారం. అంతకు ముందు ఇదే కేసులో ఎంపి, ఎంఎల్‌ఎ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసినా తిరస్కరణకు గురైంది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన నివాసం వద్దకు భారీ బందోబస్తుతో వెళ్లిన పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు.

## కేజ్రీవాల్ చిల్లర రాజకీయాలు: అమిత్ షా



**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకే ఆప్ అధినేత కేజ్రీవాల్ యమునా నదిలో బీజేపీ విషం కలిపిందని ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్‌షా గురువారం ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఆప్ పాలనలో యమునా నది కలుషితమైపోయిందని, ఢిల్లీ ప్రజలతో మురికి నీటిని తాగిస్తోందని అమిత్‌షా విమర్శించారు. ఢిల్లీ ఎన్నికల్లో ఓడిపోతామని కేజ్రీవాల్ గ్రహించారని, అందుకే చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఢిల్లీలో ఆప్ పాలనను తరిమికొట్టేందుకు ఫిబ్రవరి 5 అనేది ఒక అవకాశమని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఢిల్లీని నంబర్ వన్ రాజధానిగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. యమునా నది నీటిలో బీజేపీ విషం కలిపిందని కేజ్రీవాల్ ప్రచారం చేస్తున్నారని, ఏ ల్యాబ్‌లో పరీక్ష చేయించి ఈ ఆరోపణలు చేస్తున్నారో కేజ్రీవాల్ చెప్పాలని డిమాండ్ చేశారు.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP28TC 9235 | RAVI KISHORE PARUMANDLA | TATA LPT 3118 CUMMINS FBT | 2012 |
| 2 | TS30T 6546 | RAJANI KANTH URADI | EICHER 11.10 FBT | 2019 |
| 3 | TS03UA 2392 | BUJJI BHUKYA | TATA ACE | 2014 |
| 4 | TS03FF 5363 | KSR INFRASTRUCTURE PROJECTS | MAHINDRA ROAD MASTER G 9075 BS4 | 2022 |

AUCTION DATE:01-02-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor,
KUC X Road, , Hanamkonda - 506009. Cell : 9849955900

**CHANGE OF NAME**

I, **Mr. Kollu Sathish, S/o. Kollu Veerabhadram,** R/o. H.No.1-12/4/10/2, Venkateswara Nagar, Ramireddypalem road, Kodad Town, Kodad (Mandal), Suryapet (District), Telangana (State) shall henceforth be known **Kollu Rudra Veer Simhan, S/o. Kollu Veerabhadram** for the purpose of correction of wrong entries occurred in school records due to parental mistake / due to marriage.

**CHANGE OF NAME**

I, **MEHER UNNISA BEGUM** (old name), R/o. H. No. 24-2-71, Shanthi Nagar, Darga Kazipet, Kazipet Mandal, Hanumkonda Dist, Telangana State, India. here by declare that I have changed my name **ZAREENA BEGUM** (new name) for all purpose.

**IN THE COURT OF THE FAMILY COURT AT KHAMMAM**
**M.A.T OP.NO. 445/ 2024**

Between:
1. Saragundla narsamma And Others ..Claim Petitioners
And
1.Danchikam Ramesh And Another ..Respondents

To
Respondent no 2
J. Ailaiah, s/o. Komaraiah, Age: major, occu: Owner of auto R/o. H.No.2-102, Bhatu alli, Warangal City and district.

**NOTICE**

Take Notice that the above named claim petitioners have filed the above O.P. against the respondents claiming compensation. the above case is stands posted to 21-02-2025 for your appearance. Therefore, you are here by directed to appear before the Hon'ble court on 21-02 -2025 at about 10.30 A.M in person or through an advocate without fail. Failing which the matter will be decided ex-parte against you.

//By order of the court //
ORUGANTI SESHA GIRI RAO
Advocates,
Khammam
Cell: 98495 05610




## గాంధీ గుడిలో గుత్తా పూజలు

**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో 65వ నెంబర్ జాతీయ రహదారిపై నెలకొని ఉన్న గాంధీ గుడిలో మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహాత్ముడికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ ఎంచుకున్న మార్గం ప్రతి ఒక్కరు ఆచరిస్తే సమాజంలో అహింస అనేది ఉండదన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతున్న ఆయన సంకల్పానికి కట్టుబడి ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. గాంధీజీ సూచించిన సత్యం, అహింస మార్గంలో నడవాలని గుత్తా అభిప్రాయపడ్డారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, వనమా వెంకటేశ్వర్లు, పోలగోని స్వామి, యాదగిరి, పల్లపు బుద్ధుడు, సైదులు, శ్రీను, గాంధీ గుడి ట్రస్ట్ చైర్మన్ భైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయంతో చదివి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. పాఠశాలలో ఉన్న మౌళిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కూరగాయలను, వంట చేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులను ఎలా చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పదవ తరగతి పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఉత్తమ ఫలితాలు వచ్చేలా సాధన చేయించే దిశగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. కిచెన్ షెడ్ లేకపోవడంతో ఏఈకి ఫోన్ చేసి కిచెన్ షెడ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షీభా, జ్యోతి శంకరయ్య, సుజాత పాల్గొన్నారు.

## అక్రమంగా ఫౌతి చేసిన మోతె తహసీల్దార్ సస్పెన్షన్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** కుటుంబ సభ్యులందరి అనుమతి లేకుండా అక్రమంగా ఫౌతి చేసిన మోతె తహసీల్దార్ సంఘమిత్రను సస్పెండ్ చేయడంతో పాటు కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజును విధుల నుండి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ పట్టా మార్పిడిపై ఆర్‌డిఓ సూర్యాపేట వారిచే విచారణ చేయించినట్లు తెలిపారు. చివ్వెంల మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన మట్టపల్లి వెంకటాచలం కరోనా సమయంలో మరణించారని అతనికి మోతె మండలంలో 7.10 ఎకరాల భూమి ఉందని, అతనికి ఇద్దరు భార్యలు ఉండగా మొదటి భార్య మరణించగా పూలమ్మను రెండవ వివాహం చేసుకున్నట్లు తెలిసిందన్నారు. మొదటి భార్యకు ఇద్దరు కుమార్తెలు, రెండవ భార్యకు ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు. రెండవ భార్య కుమారుడి పేరు కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ ఉన్నప్పటికి, ఆ భూమి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మార్టిగేజ్ చేసినప్పటికి అక్రమంగా మొదటి భార్య కుమార్తెలు సైదమ్మ, రమణల పేరిట ఫౌతి ద్వారా అక్రమంగా పట్టా మార్పిడి చేసిన విషయంలో విధుల పట్ల బాధ్యతరహితంగా వ్యవహరించినట్లు తహసీల్దార్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

## జాతిపిత సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జాతిపిత మహాత్మగాంధీ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి, అహింసా మార్గంలో స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మగాంధీ అని అన్నారు. గాంధీ జీవిత చరిత్రను, పనితీరును, సందేశాలను భావితరాలకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, దైద సంజీవరెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, ధీరావత్ స్కైలాబ్‌నాయక్, మైబెల్లి, తలకొప్పుల సైదులు, పొదిల శ్రీనివాస్, ఆరిఫ్, గంధం రామకృష్ణ, రవినాయక్, దేశిడి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య అమరవీరులకు ఘన నివాళులు

**ప్రజాపక్షం/యాదాద్రి :** దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే సంకల్పాన్ని చాటుతూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## దక్షిణ కాశీలో బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** అల్లంపూర్ ప్రసిద్ధి చెందిన దేవాలయాలకు జోగులాంబ బాల బ్రహ్మేశ్వర కోటి లింగాలకు ప్రసిద్ధిగా దక్షిణ కాశి ఆలయంలో గురువారం బ్రహ్మోత్సవాలు కార్యక్రమాన్ని దేవాలయం కార్యాలయం అధికారి సురేందర్ శర్మ ఘనంగా వేడుకలు ప్రారంభించారు. నదితీరాలోని తుంగభద్ర నీళ్లను తీసుకొచ్చి అమ్మవారికి బాల బ్రహ్మేశ్వరుడికి ప్రత్యేక పూజలు కార్యక్రమాన్ని తో ప్రారంభించారు. ఈ ఉత్సవాల్లో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు దేవాలయంలో ఏర్పాట్లు చేసినట్టు అధికారులు వెల్లడించారు. రాష్ట్రం అభివృద్ధి దశలో కొనసాగాలని బాల బ్రహ్మేశ్వరునికి అమ్మవారికి ఈనెల 3 వరకు ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు రోజు వారి కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.

## నకిలీ విత్తనాలు అంటగట్టి...
# రైతులను నిండా ముంచారు

గడ్డిపల్లి సీడ్స్ కంపెనీదారుల ఘరానా మోసం
నాటు వేసిన 15రోజులకే ఈనిన వరిపైరు
అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
సీడ్స్ కంపెనీల ఎదుట ఆందోళనకు దిగిన రైతులు



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో మొత్తం 10 సీడ్స్ కంపెనీలు ఉన్నాయి. ఈ దుకాణాల యజమానులు స్వంతంగా వరి సీడును తయారు చేసి గత కొన్ని ఏళ్ళుగా రైతులకు అమ్మకాలు జరుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ పరిశోధన కేంద్రం బ్రీజర్ సీడ్స్‌ను కొనుగోలు చేసి స్థానిక రైతాంగం పంట పొలాల్లో సాగు చేయాలి. దీని ద్వారా వచ్చిన పంటను స్థానిక వ్యవసాయ అధికారులు ధృవీకరించిన తరువాత రైతులకు విత్తనాలుగా విక్రయించాల్సి ఉంది. కానీ సదరు వ్యాపారులు రైతుల వద్ద నేరుగా ధాన్యాన్ని క్వింటా రూ. 2వేల నుండి రూ. 2500ల వరకు కొనుగోలు చేసిన అనంతరం వాటిని ఆరబెట్టి తాలు, పెల్లా, చెత్త చెదారం లేకుండా శుద్ధి చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు అంటూ అంటగడుతున్నారు. వీరు అమ్మే సీడ్స్‌కు వ్యవసాయ అధికారులు వారు మాముళ్లను తీసుకొని గుడ్డిగా ధృవీకరించి అమ్మకానికి అనుమతులు జారీ చేస్తున్న పరిస్థితి. 10, 20కేజీ బస్తాలపై తమ సీడ్స్ కంపెనీల పేరును ముద్రించి విక్రయిస్తున్నారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి తాలు, పెల్ల, చెత్త చెదారం తొలగించి శుద్ధి చేసినందుకుగాను మొత్తం రూ. 3వేలు ఖర్చు అవుతుండగా 10కేజీల సీడ్‌కు రూ.650లకు రైతులకు అంటగడుతున్నారు. ఇలా ఒక్క క్వింటాకు రూ. 3500ల వరకు లాభాలు పొందుతూ కోట్లకు పడగలెత్తుతున్నారు. వీరు చేసే మోసాలపై ప్రతి పంట సీజన్‌లో రైతులు బలి అవుతునే ఉన్నారు. పాలకులు, అధికారుల అండదండలతో ఇవన్నీ కప్పి పెట్టి తమ అక్రమ వ్యాపారాలను మూడు పువ్వులు... ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు.

> **రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ విత్తనాలు అంటగట్టి నిండా ముంచారు. 90 రోజులకు ఈనాల్సిన వరి పైరు నాటు వేసిన 15రోజులకే ఈనడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలోని సీడ్స్ కంపెనీల యజమానుల ఘరానా మోసానికి గురైన రైతులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో గురువారం సీడ్స్ కంపెనీల ఎదుట బాధిత రైతులు ధర్నాకు దిగారు.**

తాజాగా ఈ రబీ సీజన్‌లో గ్రామంలోని చరణ్ సీడ్స్, ఎంఎస్ వెంకటసాయి సీడ్స్ వారి నుండి రైతులు వరి విత్తనాలు భారీగా కొనుగోలు చేశారు. నారు పోసి నాటు వేసిన 15రోజులకే వరి పైరు ఈనడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం సదరు సీడ్స్ కంపెనీల యజమానుల దృష్టికి తీసుకెళ్లగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు ఇంకా నాలుగు రోజులు చూద్దామంటూ గత వారం రోజులుగా కాలం వెల్లదీస్తూ దాటవేస్తున్నారని పంట సాగు చేసిన రైతులు వాపోయారు. ఇదే విషయమై జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డికి, జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్‌కు సదరు రైతులు వీరు మోసాలపై ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల నుండి స్పందన లేకపోవడంతో గురువారం చరణ్ సీడ్స్, ఎంఎస్ వెంకటసాయి సీడ్స్ కంపెనీల ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. త్రిపురారం మండలం కన్నెకల్లుకు చెందిన రైతులతో పాటు అడివిదేవులపల్లి మండలంలోని దుద్యాతండ, పాలకవీడు మండలంలోని మీనపాటితండ, పెన్‌పహాడ్ మండలంలోని పొట్లపహాడ్, నేలమర్రి, అన్నారం, పెన్‌పహాడ్, మునగాల మండలంలోని వెంకటరామపురం, నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని మామిడాలకు చెందిన రైతులు ధర్నాకు దిగారు. 15రోజులకే ఈనీన వరి పంటను చేత పట్టుకొని తమకు జరిగిన నష్టాన్ని మీడియాకు వివరిస్తూ కన్నీరు పెట్టుకున్నారు. తాము ఎకరాకు రూ. 20వేల పెట్టుబడి పెట్టి పంట సాగు చేశామని కానీ రూపాయి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోయారు. గడ్డిపల్లి సీడ్స్ వ్యాపారుల ఘరానా మోసంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇక తమకు మరణమే శరణమంటూ బోరున విలపించారు. రైతులు ఆందోళనకు దిగనున్న విషయాన్ని ముందే పసిగట్టిన వ్యాపారులు కంపెనీలకు తాళాలు వేసుకొని ముందే ఉడాయించారు. వారు చేసిన తప్పును కప్పి పుచ్చుకునేందుకు కృషి విజ్ఞాన కేంద్రంలో పని చేస్తున్న ఓ శాస్త్రవేత్తను పట్టుకొని అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకు తప్పుడు ప్రకటన చేయించారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో ఇలా వరిపైరు 15రోజులకే ఈనుతున్నాయని ప్రకటన జారీ చేయించడం కొసమెరుపు. ఇదే విషయం సదరు వ్యవసాయ శాస్త్రవేత్తను విలేకరులు ఈ సమస్య జిల్లా మొత్తం ఉండాలి కదా ఈ రైతులకు ఎందుకు వచ్చిందని అడిగితే పొంతన లేని సమాధానాలు చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.






## అమలులో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్

ఫిబ్రవరి 11 న నామినేషన్ల పరిశీలన..13న నామినేషన్ల ఉపసంహరణ
27 న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి:** కేంద్ర ఎన్నికల సంఘం వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున, వరంగల్, ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎంఎల్‌సి నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియామవళి వెంటనే అమలులోకి వచ్చిందని నల్లగొండ జిల్లా కలెక్టర్, వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి అన్నారు.గురువారం ఆమె తన ఛాంబర్ లో వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు ఫిబ్రవరి 3 న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఫిబ్రవరి 10 నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ అని,ఫిబ్రవరి 11 న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 13 న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు.ఫిబ్రవరి 27 న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ఉంటుందని,మార్చి 3 న ఓట్ల లెక్కింపు జరుగుతుందని, మార్చ్ 8న ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ 30, 2024న ప్రచురించిన తుది ఓటరు జాబితా ప్రకారం ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల నియోజకవర్గం పరిధిలో 200 పోలింగ్ కేంద్రాలు, 24905 మంది ఓటర్లు ఉన్నారని



తెలిపారు.ప్రత్యేకించి నల్లగొండ జిల్లాలో 4483 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా, తూ.చా తప్పకుండా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాజకీయ పార్టీలు సైతం ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని కోరారు.ఎవరైనా ఎన్నికల ప్రవర్తన నియమాలని ఉల్లంఘిస్తే ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.జిల్లా ఎస్‌పి శరత్చంద్ర పవార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు పాటించాల్సిన నియమ, నిబంధనలు, తీసుకోవాల్సిన అనుమతులు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.

## గీత కార్మికులకు బడ్జెట్‌లో సముచిత స్థానం

గీతపనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో గీత కార్మికులకు సముచిత స్థానం కల్పించాలని గీత పనివారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో గీత పనివార సంఘం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ ఎంపి కామ్రేడ్ ధర్మభిక్షం 1957లో సంఘాన్ని స్థాపించి నేటికి 68 సంవత్సరాలు అయిందన్నారు. నాటి నుండి నేటి వరకు గీత కార్మికులకు పింఛన్లు, వనం పెంపకానికి జిఒ 560 ప్రకారం సొసైటీల నిర్మాణానికితో పాటు పలు సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గీత కార్మికులకు 1000కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. రమణించిన, గాయాలైన ప్రతి గీత కార్మికుడికి ఎక్స్ గ్రేషియాను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సంఘం జిల్లా కార్యదర్శులు రేగట్టి లింగయ్య, కొండ కోటయ్య, తొట్ల ప్రభాకర్, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, అనంతుల చిన్న జానయ్య పాల్గొన్నారు.

## దురాజ్‌పల్లి జాతరకు రూ.20 కోట్లు కేటాయించాలని వినతి

**ప్రజాపక్షం/ హాలియా:** దురాజ్ పల్లి జాతరకు రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయాలని నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్ రెడ్డి ని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌని రాజా రమేష్ యాదవ్ కోరారు. బుధవారం సాయంత్రం హాలియా కు వచ్చిన ఎంపి రఘువీర్ రెడ్డిని యువజన కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌని రాజా రమేష్ దురాజ్‌పల్లి జాతరకు 20 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని కోరారు. తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు దురాజ్పల్లిలో జరిగే జాతరకు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాల్సిందని అందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని యువజన కాంగ్రెస్ నాయకులు ఎంపీకి వినతి చేశారు. దీనికి స్పందించిన ఎంపీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ విషయాన్ని మంత్రులకు, ముఖ్యమంత్రికి వివరించి నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు.



## పెద్దగట్టు జాతరకు నిధులు కేటాయించాలని సిఎంకు వినతి

యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని
అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/ హాలియా:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్వహించే పెద్దగట్టు(గొల్లగట్టు) జాతరకు భారీగా నిధులు కేటాయించాలని సిఎం రేవంత్ రెడ్డిని నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఈ మేరకు విన్నవించారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 16 నుంచి పెద్దగట్టు జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లకు కావాల్సిన నిధుల ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జాతరకు దేశవ్యాప్తంగా భారీగా భక్తజనం తరలిరానున్న నేపథ్యంలో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయనున్నారు. గత ప్రభుత్వాల హయాంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ ఈసారి శాశ్వత ప్రాతిపదికన పనులు చేయాలని సూచించారు. అవసరమైన చోట సీసీ రోడ్లు వేయాలని తెలిపారు. ఎంపీ రఘువీర్ రెడ్డి కి యాదవ సంఘం నాయకులు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజారామ్ రమేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పెద్దగట్టు జాతరకు సౌకర్యాలు కల్పించేలా నిధులు విడుదల చేయాలని ఎంపీ గారిని కోరుతూ వినతి పత్రం సమర్పించడంతో వెంటనే సీఎం రేవంత్ రెడ్డిని



కలిసి పెద్దగట్టు జాతర కు నిధులు విడుదల చేయాలని కోరారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అధికారులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు.

## పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** జిల్లాలో ఎన్నికల నియమావళిని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ ఆదేశించారు. గురువారం ఆయన చాంబర్లో ఉమ్మడి వరంగల్‌ఖమ్మంనల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి వెబెక్స్ ద్వారా ఆర్‌డిఓలు, తహసీల్దార్, ఎంపిడిఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌ఖమ్మంనల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానికి కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను 29న విడుదల చేసిందని, జిల్లా ఎన్నికల నియమావళి అమలులో వచ్చినట్లు తెలిపారు. ఫిబ్రవరి 3న నామినేషన్ నోటిఫికెషన్ విడుదల అవుతుందని, 10వ తేదీ వరకు నామినేషన్ వేసేందుకు చివరి గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు. 11న నామినేషన్ల స్క్రూట్నీ, 13న నామినేషన్‌ల ఉపసంహరణ చివరి గడువు అన్నారు. 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహిచి మార్చి 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 2679 మంది ఉపాధ్యాయులు ఓట్లు ఉన్నాయని, జిల్లాలో మండలానికి ఒక పోలింగ్ కేంద్రం చొప్పున 23 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ పిడి వివి అప్పారావు, డిపిఓ నారాయణరెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, ఎన్నికల డిటి వేణు, ఆర్‌డిఓలు, తహసీల్దార్‌లు, ఎంపిడిఓలు, అధికారులు పాల్గొన్నారు.




**గిరిజన బాలికల వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు**

వసతి గృహాల నిర్వహణలో సంబంధిత ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని గిరినగర్ గిరిజన బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ అయ్యి విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడంతో వార్డెన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించా రు. విద్యార్థులు విరామ సమయంలో బయటి సమోసాలు తిని అస్వస్థతకు గురయ్యారని, వారిని ఆసుపత్రికి తీసుకెళ్లడంతో వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహించారని తెలిపారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని ఉన్నతాధికారులకు చెప్పకుండా ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెల్లి సరైన వైద్యం అందించకపోవడంతో ఆరోగ్యం క్షిణించిందన్నారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ వసతి గృహ వార్డెన్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జిల్లాలో చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## జాతీయ విద్యా సదస్సుకు బాలరాజుకు ఆహ్వానం

**ప్రజాపక్షం/డిండి:** డిండి మండల పరిధిలోని తౌక్లాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బాలరాజుకు జాతీయ విద్యా సదస్సుకు ఆహ్వానం అందింది. ఫిబ్రవరి 09న ఢిల్లీలో జరిగే నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎడ్యూకేషన్ అండ్ ఈ లెర్నింగ్ సదస్సులో ఆయన పాల్గొని ప్రస్తుత విద్యా విధానాలు, విద్యా విధానంలోని నూతన పోకడలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ లెర్నింగ్ ఆవశ్యకతపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయునిగా, పెడగాజికల్ అనలిస్ట్‌గా సేవలందిస్తూ పోటీ పరీక్షలకు సంబంధించిన కొన్ని కాంపిటేటివ్ పుస్తకాలను సైతం రచించిన బాలరాజుకు జాతీయ స్థాయి సదస్సుకు హజరుకావడం పట్ల మండల విద్యాధికారి గోప్య నాయక్, సిహెచ్ఎం కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేష్, గణేష్, రమేష్‌లు అభినందించారు.

# పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

* ఖమ్మం టూరిజంకు బ్రాండింగ్ కల్పించాలి
* పర్యాటక ప్రదేశాల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.నేలకొండపల్లి బౌద్ధస్తూపం, పాలేరు లేక్, ఖమ్మం ఖిల్లా, పులిగుండాల ప్రాజెక్టు, వెలుగు మట్ల అర్బన్ పార్కు వంటి పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికల గురించి, ఏకో టూరిజంపై సుదీర్ఘంగా చర్చించారు. పర్యాటక ప్రాంతాల వద్ద చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుత స్థితిగతులను వివరిస్తూ జిల్లా అటవీ అధికారి పవర్ పాయింట్ ప్రజంటేషన్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకంగా జిల్లా అభివృద్ధికి ప్రత్యేకంగా ఖమ్మంజిల్లాలో ఏకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కు వద్ద 40 అడుగుల రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, పార్కింగ్ ఏరియా ఉండాలని, పార్కు లోపల ఎటువంటి ప్లాస్టిక్‌ను అనుమతించకుండా పార్కును ప్లాస్టిక్ ఫ్రీ చేయాలన్నారు. లోపల క్యాంటీన్‌లో కూడా ప్లాస్టిక్ ఉండవద్దని సూచించారు. వెలుగుమట్ల అర్బన్ పార్కులో చిన్నపిల్లల ప్లే ఏరియా, బోటింగ్ ఏరియా అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. పార్కు లోపల రోడ్ల నిర్మాణం చేయాలన్నారు. పులిగుండాలలో క్యాంప్ సైట్ క్రియేట్ చేసుకునేవిధంగా పనులు పూర్తి చేసి ఏకో టూరిజం ట్రిప్ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్కు, పులిగుండాల పర్యాటక ప్రాంతాల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని వీటికి వచ్చే మార్గాలను వివరిస్తూ కూడా బోర్డులు ఏర్పాటు చేయాలని, విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఖమ్మంజిల్లా పర్యాటక ప్రాంతాలు , ఏకో టూరిజంకు బ్రాండింగ్ వచ్చేలా నూతన లోగో , ట్యాగ్‌లైన్ తయారు చేయాలన్నారు. జమలాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అటవీ పార్కు , కాటేజీ అభివృద్ధి పనులు ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పాలేరు లేక్ వద్ద పిక్నిక్ స్పాట్ అభివృద్ధి చేయాలని ప్రజలు అధికంగా వచ్చేలా జాతీయ రహదారి వద్ద ప్రచార హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పాలేరు లేక్ వద్ద బోటింగ్, క్యాంటీన్, పిక్నిక్ స్పాట్, పిల్లలు ఆడుకునేందుకు ప్లే ఏరియా, బర్డ్ వాచింగ్ సౌకర్యం సిద్ధం చేయాలన్నారు. ఖమ్మం ఖిల్లా వద్ద రోప్‌వే నిర్మాణ పనులకు ప్రజలతో చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. రోప్‌వేకు 500 కిలోమీటర్ల దూరంలో పార్కింగ్ ఏరియాను గుర్తించాలన్నారు. ఖమ్మం ఖిల్లా వద్ద పురావస్తు శాఖ సమన్వయంతో ముందుగా అవసరమైన మరమ్మతు పనులు చేపట్టి పర్యాటకులను ఆకర్షించాలన్నారు. స్కూల్ విద్యార్థులు, జర్నలిస్టులు, జిల్లా అధికారులతో ఖిల్లాకు హిస్టరీ వాక్ ప్లాన్ చేసుకోవాలని, జాఫర్ బావి వద్ద మార్చి నెలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ప్లాన్ చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డిఆర్‌డివో సన్యాసయ్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, టూరిజం జిల్లా అధికారి సుమన్ చక్రవర్తి, ఇరిగేషన్, దేవాదాయ, అటవీ, రెవెన్యూ శాఖాధికారులు పాల్గొన్నారు.

## సిహెచ్‌ఒకు ఎఐటియుసి సన్మానం

**ప్రజాపక్షం/బోనకల్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించి పదవీవిరమణ పొందిన పెద్దినేని శ్రీనివాసరావు దంపతులను ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..2015లో మండలంలో డెంగీ ప్రబలిన సమయంలో శ్రీనివాసరావు చేసిన సేవలు అభినందనీయమన్నారు. 2018లో కేంద్ర ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాయకల్ప అవార్డును ప్రపథమంగా బోనకల్ పిహెచ్‌సి దక్కడంలో అప్పటి వైద్యాధికారి శ్రీకాంత్‌తోపాటు, శ్రీనివాసరావు కృషి ఏనలేనిదని అన్నారు. 2020లో వచ్చిన కరోనా మహమ్మారిలో ఎఎన్‌ఎంలు, వైద్యులు, పారిశుద్ధ్య కార్మికులు, మండల అధికారులను సమన్వయం చేసుకొని పనిచేశారని కొనియాడారు. పదవి విరమణ పదవికే తప్ప, ప్రజలకు చేసే సేవాకార్యక్రమాలకు కాకూడదని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండవఎఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు తమ్మారపు జయమ్మ, నాయకులు బంధం శివరాణి, పొదిళ్ల వాణి, బలబద్రపు వెంకటరమణ, తోటపల్లి విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ కొల్లు శ్రీనివాస్‌రెడ్డి ఆశయ సాధనలో పయనిస్తాం..

* సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య.....

**ప్రజాపక్షం/మణుగూరు:**అశ్వాపురం మండలం మొండి కుంట గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా నాయకులు కామ్రేడ్ కొల్లు శ్రీనివాస్ రెడ్డి 10 వ వర్ధంతి సందర్భంగా గురువారం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య పాల్గొని, శ్రీనివాస్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వేంకటేశ్వర రావు, కామ్రేడ్ స్వర్గీయ కొల్లు శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు మరియు సిపిఐ, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ శ్రేణులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఎంఎల్‌సి ఎన్నికల ప్రవర్తనా నియమావళిను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసిన జిల్లాలోని పలువురు అధికారులతో టెలీకాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఎన్నికల నోటిఫికెషన్ ఫ్రబవరి 3న జారీ చేస్తారని చెప్పారు. 27వ తేది పోలింగ్ ఉంటుందని, మార్చి 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమనిబంధనలు, చట్టాలు తెలిసుండాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని, ప్రజలు సంచరించే ప్రదేశాల్లో కూడా వాటిని ఉంచరాదన్నారు. అదే విధంగా రాజకీయ నాయకుల విగ్రహాలు సైతం కనబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## బంగారు పుస్తె, నూతన వస్త్రాలు బహూకరణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చిమ్మపుడి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వరరావు ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన జిల్లా బిక్షం ఇటీవల మృతిచెందాడు. వారి కుమార్తె నవిత వివాహా సందర్బంగా ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు గుత్తా వెంకటేశ్వరరావు చంద్రమ్మ దంపతులు తమ వంతుగా బంగారు పుస్తె, మెట్టెలు, నూతన వస్త్రాలను వధువు తల్లి నాగమణికి గురువారం అందజేశారు. నూతన వధువును ఆశీర్వదించారు. నిరుపేదలకు అండగా నిలుస్తున్న గుత్తా వెంకటేశ్వరరావును గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కాళంగి వీరబాబు, పోతురాజు రమేష్, ఎస్‌కె జాని, పోతురాజు ఉపేందర్‌పాల్గొన్నారు.

## కెఎంసిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మాస్ శానిటేషన్‌లో భాగంగా ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఉన్నటువంటి రాపర్తి నగర్, కరుణగిరి, మయూరిసెంటర్ బ్రిడ్జిలను గురువారం శుభ్రం చేశారు. ప్రతి డివిజన్ నుంచి ఇద్దరు పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి బ్రిడ్జిలపై ఉన్న చెత్తాచెదారాన్ని, మట్టిని తొలగించి శుభ్రం చేశారు.

## ఆర్‌టిసిలోనే తక్కువ ప్రమాదాలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రమాదాల్లో అతి తక్కువ శాతం ఆర్టిసిలో మాత్రమే ఉన్నాయని జిల్లా రవాణా శాఖాధికారి వెంకటరమణ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రీజినల్ ముగింపు కార్యక్రమం గురువారం ఖమ్మం నూతన బస్టాండ్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా శాఖాధికారి వెంకటరమణ, ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా రీజియన్ స్థాయిలో ముగ్గురు ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించారు. ప్రథమ స్థానంలో ఖమ్మం డిపోకు చెందిన బి. రాములు (ప్రమాద రహిత సర్వీస్ 28 సంవత్సరాల నాలుగు నెలలు), ద్వితీయ స్థానం ఖమ్మం డిపోకు చెందిన డి. అంథోని (ప్రమాద రహిత సర్వీస్ 28 సంవత్సరాల నాలుగు నెలలు), తృతీయ స్థానం మణుగూరు డిపోకు చెందిన వి. వెంకటేశ్వర్లు (ప్రమాద రహిత సర్వీస్ 27 సంవత్సరాల ఐదు నెలలు) వీరిని సన్మానించారు. అదేవిధంగా ప్రతి డిపో నుంచి ముగ్గురు చొప్పున 21 మంది ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించారు. ఈసందర్బంగా డిటిఒ మాట్లాడుతూ ప్రమాదాల్లో అతి తక్కువ శాతం ఆర్టిసిలో మాత్రమే ఉన్నాయన్నారు. ఎసిపి శ్రీనివాసులు మాట్లాడుతూ సురక్షిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రయాణికులకు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజినల్ మేనేజర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ జిఎన్ పవిత్ర, డిపో మేనేజర్లు, అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, ఆర్టిసి సిబ్బంది పాల్గొన్నారు.

## మహాత్ముని స్ఫూర్తితో ముందుకు సాగాలి: ఐటిడిఎపిఒ

**ప్రజాపక్షం/భద్రాచలం :** మహాత్మాగాంధీ ఆశయం, స్ఫూర్తి ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. గాంధీ వర్ధంతి, అమరుల సమస్మారనాన్ని పురస్కరుంచుకని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ త్యాగానికి ప్రతిరూపమైన మహాత్ముని వర్ధంతి సందర్భంగా అమరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ స్వతంత్ర సాధనలో మహాత్మాగాంధీ ప్రత్యేక పాత్ర పోషించారని చెప్పారు. వారి స్ఫూర్తితో అంతా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణా : పట్టుబడ్డ జర్నలిస్టులు

**ప్రజాపక్షం/భద్రాచలం:**గంజాయి అక్రమ రవాణా చేస్తూ ఇద్దరు జర్నలిస్టులతో పాటు ముగ్గురు అడ్డంగా దొరికిపోయారు. వివరాల ప్రకారం భద్రాచలం పట్టణలోని గోదావరి వంతెన సమీపంలో నార్కోటిక్ పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా అటుగా వచ్చిన ప్రెస్ స్టిక్కర్ ఉన్న కారును ఆపి సోదాలు చేయగా 81 కిలోల గంజాయి కారులో కనిపించింది. దీని విలువు సుమారు రూ.20.23 లక్షల వరకు ఉంటుంది. ఈ కారులో బూర్గంపాడుకు చెందిన ఇద్దరు విలేకరులు ఉన్నారు. వీరిలో ఒకరు ప్రెస్‌క్లబ్‌లో కీలకపదివిలో కొనసాగుతున్నారు. వీరితో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని కుంట ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిని కూడా అదుపులోనికి తీసుకున్నారు. వీరిని అదుపులోనికి తీసుకున్న నార్కోటిక్ పోలీసులు పట్టణ పోలీస్‌లకు కారుతో పాటు అప్పగించారు. పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది. జర్నలిస్టుగా చెలామణి అవుతూ ప్రెస్‌క్లబ్ స్టిక్కర్ ఉన్న కారులో అక్రమంగా పెద్ద ఎత్తున గంజాయిని తరలిస్తూ పట్టుబడటంతో అంతా నివ్వెరపోతున్నారు.

## నీటి వనరుల ఆక్రమణలు గుర్తించండి :కలెక్టర్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నీటి వనరుల ఆక్రమణను గుర్తించి ఫిబ్రవరి 12లోపు నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నీటి వనరుల ఆక్రమణ, భూ సేకరణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ప్రతి 45 మీటర్లకు ఒక విభాగంగా పరిగణించి వాల్ నిర్మించడానికి ఒక బే యూనిట్ అంటారని తెలిపారు. మొత్తం 17 కిలో మీటర్ల స్ట్రేచ్‌లో 345కు పైగా బే యూనిట్లుగా నిర్మించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వీటిలో 8.5 కిలో మీటర్ల వరకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని మిగిలిన పట్టా భూమి సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ముందు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములలో పనులు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వాల్ నిర్మాణానికి అవసరమైన పట్టా భూముల సేకరణకు పట్టాదారు వారీగా మ్యాపింగ్ చేసి వివరాలను అందించాలన్నారు. పట్టాదారుతో చర్చలు జరుపుతూ భూ సేకరణ వేగవంతంగా జరిగేలా చూసి 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జూలై వరకు రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని నీటి వనరుల వద్ద ఆక్రమణకు గురైన భూముల వివరాలను రెవెన్యూ మ్యాప్, నీటిపారుదల మ్యాప్, టౌన్ ప్లానింగ్ రికార్డులను పరిశీలించి ఫిబ్రవరి 12 లోపు వివరాలను అందించాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్‌డిఒజి. నర్సింహారావు, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

తహసీల్దార్ అద్దంకి నరేష్



**ప్రజాపక్షం/పినపాక:**ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని పినపాక తహశీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో రామకృష్ణ లు తెలిపారు. గురువారం పినపాక మండల పరిషత్ కార్యాలయంలో సెక్రెటరీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి ఘర్షణ వాతావరణం లేకుండా ఉండకూడదని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మార్చి నెల 3న కౌంటింగ్ అయిన తరువాత కూడా గ్రామాల్లో ఎటువంటి సమావేశాలు, సభలు, ర్యాలీలు ఏర్పాటు చేయరాదన్నారు. అలా ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఆర్ఐ రమేష్, సెక్రటరీలు పాల్గొన్నారు.

## గాంధీకి ఎమ్మెల్యే పాయం నివాళి

**ప్రజాపక్షం/మణుగూరు:**జాతి పిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్బంగా మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, మణుగూరు శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మార్గదర్శి మహాత్మా గాంధీ: మట్టా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**అహింసా మార్గంలో భారత దేశ ప్రజల సంకెళ్ళను తెంచి, స్వతంత్రాన్ని ప్రసాదించిన మార్గదర్శి మహాత్మా గాంధీ అని కొనియాడారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. గురువారం మహాత్మా గాంధీ 77వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, పట్టణంలోని మున్సిపాలిటీ ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతి వేడుకలకు సత్తుపల్లి శాసనసభ్యులు డా.మట్టా రాగమయి ముఖ్య అతిథిగా హాజరై గాంధీ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ ప్రతిపాదించిన గ్రామ స్వరాజ్యం ఈరోజు మనం అమలుపరుస్తున్న పంచాయతీరాజ్ వ్యవస్థకు మూలమన్నారు. నేటి యువతకు స్ఫూర్తిదాయకుడు మహాత్మా గాంధీ అని, ఆయన దేశం కోసం తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. ఆయన సిద్ధాంతాలు, ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సొసైటీ అధ్యక్షుడు కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, పింగళి సామ్యూల్, రవీందర్ రెడ్డి, కమల్ పాషా,పార్థసారధి రెడ్డి, వినుకొండ కృష్ణ, ఆంగోతు రామారావు, సుఖభోగి రాము, జీవన్, కంటే అప్పారావుపాల్గొన్నారు.

## నిర్దేశిత సమయంలోగా దరఖాస్తులకు పరిష్కారం : శ్రీజ




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజి ఐపాస్ క్రింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీజ జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టిజి ఐపాస్, టి ప్రైడ్‌పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో టిజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును అదనపు కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వచ్చిన 22 ప్రతిపాదనల్లో 15 ప్రతిపాదనలకు వివిధ శాఖల వారు జారీ చేసిన అనుమతులను, తిరస్కరించిన మూడు ప్రతిపాదనలపై అదనపు కలెక్టర్ చర్చించారు. నాలుగు ప్రతిపాదనలను సైతం తక్షణమే పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో టి ప్రైడ్ పథకం క్రింద నూతనంగా ఏర్పాటు చేసిన 10 ఎస్సి, ఎస్టి యూనిట్లకు రూ. 33,39,282 పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం టి. సీతారామ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్, నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్, రైస్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాలు మరింత మెరుగ్గా నిర్వహించాలి :**

జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ శ్రీజ మహిళ, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పోషణ అభియాన్, ఫ్రీ స్కూల్ నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, అందుతున్న సేవలు, లబ్దిదారుల వివరాలు, అనీమియా నివారణ మొదలగు అంశాలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఖమ్మం అర్బన్ రూరల్, తిరుమలాయపాలెం, మధిర, కామేపల్లి, కల్లూరు, సత్తుపల్లి సిడిపిఒలు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ పనితీరు ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టిసారించాలని అంగన్‌వాడీ టీచర్ల హాజరు, పనితీరు, రెగ్యులర్‌గా పర్యవేక్షించాలన్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని ఫ్రీ స్కూల్‌లో పిల్లల అటెండెన్స్ తగ్గకుండా చూడాలన్నారు. పోషణ లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి వారికి బాలామృతం ప్లస్ సరఫరా అయ్యేవిధంగా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా మంజూరు చేసిన మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన, మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, సిడిపిఒలు, ఎసిడిపిఒలు, డిఎంసి, డిహెచ్ఇడబ్ల్యూ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి : ఎస్‌పి రోహిత్ రాజు

జాతీయరోడ్డు భద్రతా మాసోత్సవంలో పాల్గొన్న 2000మంది ఆటోడ్రైవర్లు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :**జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం ప్రకాశం స్టేడియంలో వాహనదారులకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ సూచనలతో సబ్ డివిజన్ పోలీసులు వాహనదారులకు, విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్యంగా ఆటోడ్రైవర్లకు జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 2000 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ మాట్లాడుతూ, ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముందుగా విద్యార్థులతో కలిసి అక్కడ రోడ్డు భద్రతా నియమాలను సూచిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ద్వారా దేశంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవించి చాలామంది తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. వాహనదారులందరూ హెల్మెట్, సీట్ బెల్ట్ లు ధరించి వాహనాలను నడపాలని కోరారు. నిర్లక్ష్య పు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, ఓవర్ లోడ్, రాంగ్ రూట్లో ప్రయాణించడం లాంటి తప్పిదాలతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 500 కు పైగా ఆటో డ్రైవర్లు తమ వాహనాలతో సహా హాజరయ్యారు. వారిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఆటో డ్రైవర్ సోదరులు కూడా ఖాకీ యూనిఫామ్ ధరించి ఈ కార్యక్రమానికి హాజరవడంతో ప్రకాశం స్టేడియం ప్రాంగణమంతా ఆటో కార్మికులతో ప్రకాశవంతమైంది అన్నారు. ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగించే ప్రతి ఒక్కరూ కూడా ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలను ఉపయోగించుకోవాలని సూచించారు. పోలీస్ శాఖతో పాటు ప్రజలతో నిరంతరం ప్రత్యక్షంగా సంబంధం కలిగి ఉండేది ఆటో డ్రైవర్లు మాత్రమే అని అన్నారు. పోలీసు వారు సూచించిన నియమాలను పాటించి ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించి బాధ్యత గల పౌరులుగా మెలగాలని కోరారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఎనిమిది వేల ఆటోలకు సంబంధించి పోలీస్ శాఖ తరపున తయారుచేసిన స్టిక్కర్లనుఎస్ పిఆవిష్కరించారు. ఆటో డ్రైవర్ల అందరూ కూడా తమ సమాచారంతో కూడిన స్టిక్కర్లను కచ్చితంగా అమర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం జిల్లా పౌరసంబంధాల శాఖ కళాకారుల చేత ట్రాఫిక్ అవగాహనపై పాటల రూపంలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేసిన కొత్తగూడెం డిఎస్ రెహమాన్, ట్రాఫిక్ ఎస్ఐలు నరేష్, మదార్, పట్టణ సిఐలు కరుణాకర్, రమేష్, శివప్రసాద్, జూలూరుపాడు సిఐ ఇంద్రశేనారెడ్డి లను శాలువాలతో ఎస్‌పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి లు చంద్రబాను, రవీందర్ రెడ్డి, సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయులు, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం ఆందోళన...!

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:**రెండేళ్లగా తాగునీటి కోసం ఎదురు చూసు న్నామని అధికారులు పట్టిం చు కోవటం లేదని స్థానికులు ఆందోళన నిర్వ హించారు. నేలకొండపల్లి మ ండలం లోని తిరు మ లా పురం తండా పంచాయతీలో ఓ ప్రాంతం కు చెందిన ప్రజలకు తాగునీ టి సరఫరా చేయటం లేదని, గురు వా రం మ హిళలు పెద్ద ఎత్తున ఆం దోళన నిర్వహించారు. ఖాళీ బిందెలతో పం చాయతీ కార్యాలయం వద్ద నిర సన చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్య దర్శి సురేష్ కార్యాలయం వద్ద కు చేరుకోగా మహిళలు చుట్టుముట్టి నిల దీశారు. ఆరుపులు, కేకలతో ఆందోళన చేపట్టారు. నీళ్ల కోసం ఊరంతా వెతికి తీసుకోవాల్సి వస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో కొంతమంది పంచాయతీ వాటర్ ను మోటార్ల ద్వారా ట్యాంకలకు ఎక్కిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మరి కొంత మంది పెద్ద పైపులు వేసుకోవటం వలన తమ ప్రాంతం కురావటం లేదని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన పెద్ద పైపులను మరియు మోటార్ల ద్వారా నీటిని తీసుకుంటున్న వారి మో టార్లు తీసేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కా ర్యదర్శి సురేష్ ఆందోళనకారులతో మాట్లాడారు. గేట్ వాల్ వేస్తున్నప్పటికీ పగిలిపోతుందని తెలిపారు. రెండు రోజులలో తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అదే విధంగా మోటార్లు, పెద్ద పైపులను తొలిగిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళనవిరమించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల నాయకులు కమదన ప్రవీణ్, బాధితులు తేజావత్ అరుణ, లినీమా, దేవ్లా, ఉపేందర్, సాయి, బద్రు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/కొహెడ:** సిద్దిపేట జిల్లా కొహెడ మండలంలోని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల శంకర్ తండ్రి ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని సిపిఐ నాయకులు, జిల్లా కార్యదర్శి మంద పవన్ పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, ఎడల వనెశ్, కొహెడ మండల కార్యదర్శి ముంజ గోపి, అక్కన్నపేట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జేరుపోతుల జనార్ధన్, ఎగ్గోజు సుదర్శన్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య




**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** అప్పుల బాధతో ఓ రైతు ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దొమ్మాట కిష్టయ్య(50) అనే రైతు ఎడాది క్రితం కుమార్తె వివాహం కోసం రూ. 15 లక్షలు అప్పులు చేసినట్లు తెలిపారు. తనకున్న ఎకరన్నర భూమితో పాటు 7 ఎకరాలు కౌలుకు తీసుకోని వరి, పత్తి సాగు చేసినట్లు తెలిపారు. పంటల సాగులో ఆశించినంత దిగుబడులు రాక చేసిన అప్పులు పెరిగి పోతున్న క్రమంలో మనో వేదనకు గురై తన ఇంటి వద్దనే ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



**ప్రజాపక్షం/ధర్మపురి:** చదువును అశ్రద్ధ చేస్తూ స్నేహితులతో తిరగడాన్ని గమనించిన తండ్రి 9వ తరగతి చదువుతున్న కొడుకును చక్కగా చదువుకోవాలని మందలించగా, మనస్థాపానికి గురైన కొడుకు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన సంఘటన రాజారం గ్రామంలో విషాదం నింపింది. ఎస్సై పులిచర్ల ఉదయ్ కుమార్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాజారం గ్రామానికి చెందిన సునర్కాని మల్లేష్‌కు ముగ్గురు కుమారులు ఉండగా, రెండవ వాడైన సునర్కాని సందీప్(15) ధర్మపురిలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అయితే చదువుపై శ్రద్ధ పెట్టకుండా స్నేహితులతో తిరుగుతుండటంతో ఈ నెల 18న తండ్రి మల్లేష్ సందీప్‌ను మందలించాడు. మనస్థాపానికి గురైన విద్యార్థి అదే రోజు ఇంట్లో గడ్డి మందుతాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం తొలుత జగిత్యాల అనంతరం కరీంనగర్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతున్న సందీప్ గురువారం మృతి చెందాడు. తండ్రి మల్లేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గర్జనపల్లి వాసి మృతి



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని ఉమ్మడి గర్జనపల్లి గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ అజ్మీర కళ్యాణ్ కుమార్ నాయక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీస్ బెటాలీయన్‌లో విధులు నిర్వర్థిస్తున్న కళ్యాణ్ బుధవారం రాత్రి తిరుగు ప్రయాణంలో వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీ కొనడంతో మరణించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. మారుమూల ప్రాంతం నుండి కష్టపడి చదువుకొని పోలీస్‌శాఖలో ఉద్యోగం సంపాదించి, ఇలా అర్థంతరంగా మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. తండ్రి పందరి నాయక్ ఉద్యోగ రిత్య గోరంటాల గ్రామం పోస్ట్ ఆఫీసులో పని చేస్తున్నారు. మృతినికి తల్లి భారతి, భార్య, ఒక కుమార్తె, 2 నెలల వసయుగల కుమారుడు ఉన్నారు.

## ఘనంగా మహాత్మగాంధీ వర్ధంతి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మగాంధీ ఇంచార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా నియోజక వర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ మాట్లాడుతూ జాతిపిత మహాత్మగాంధీ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర నిర్వహించారన్నారు. గాంధీజీ ఏన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించి అహింస మార్గాన్ని నమ్ముకున్నారన్నారు. అహింస మార్గంలో దేశానికి స్వాతంత్యం తెచ్చాడని, గాంధీజీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలన్నారు. గాంధీజీ అడుగుజాడలో యువతరం నడుచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, పూజల గోపికృష్ణ, మార్క సతీష్, కలీమొద్దీన్,బుచ్చిరెడ్డి, ముద్దం లక్ష్మి, వాహబ్, బిక్షపతి. మెరుగురాజు, రాజిరెడ్డిహ, రషద్, మహిపాల్‌రెడ్డి. స్రవంతి.రజని, చంది శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ మృతుడి భార్యకు ప్రొసిడింగ్ అందించిన విప్ అడ్లూరి

**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన పులిశెట్టి రాజన్న కొంతకాలం క్రితం మృతి చెందగా రాష్ట్ర ప్రభుత్వం నుండి గల్ఫ్ పాలసీ ద్వారా మంజూరైన రూ.లు 5లక్షల ప్రొసిడింగ్‌ను గురువారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మృతుని భార్య లక్ష్మి కి అందజేశారు.

## జగిత్యాల మార్కెట్లో కందులు రూ.6వేలు

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల వ్యవసాయ మార్కెట్లో పప్పు దినుసులు, వరి, మొక్క జొన్న ధరలు గురువారం రైతులకు ఆశజనకంగా ఉన్నాయి.పెసర్లు క్వింటాలుకు 8155, కందులు 6,190, అనుములు 7,250,మొక్కజొన్నలు 2,230, వరి జైశ్రీరామ్ 2,590 గా ధరలు పలికినట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి.

# స్వాతంత్ర్య అమరవీరులకు ఘన నివాళులు





**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన వీరులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం ఆద్వర్యంలో ఘన నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్దంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నేతృత్వంలో సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్దాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే సంకల్పాన్ని చాటుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**పాఠశాల స్థాయి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించాలి**

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవంలో బాగంగా గురువారం తిమ్మాపూర్‌లోని ఆర్టీఏ కార్యాలయం సందర్శించారు. ఈ సంధర్భంగా చొక్కారావు పిల్లల ట్రాఫిక్ అవగాహన పార్కును పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు విద్యార్థులకు అనుభవపూర్వక శిక్షణ ఇచ్చేందుకు ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్, ఫుట్‌పాత్‌లు, స్పీడ్ బ్రేకర్స్, నో ఎంట్రీ, వన్ వే లను గురించి వివరించే చిత్రాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులను బ్యాచ్‌ల వారీగా ఈ పార్కుకు తీసుకొచ్చి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల నుంచి నామమాత్రపు ఫీజు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఉచితంగా ఇక్కడకు తీసుకురావాలన్నారు. దీంతో రోడ్డుపై ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో విద్యార్థులకు తెలుస్తుందన్నారు. ఈ పార్కులో మరిన్ని సౌకర్యాలు కల్పించి అధునాతనంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ట్రాఫిక్ అవగాహన పార్కులో తెలుసుకున్న విషయాలను ఆచరించాలన్నారు. హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాధాన్యతను ఇళ్లకు వెళ్లి తమ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా మండలాల్లోని ప్రతి పాఠశాల విద్యార్థులను ఇక్కడకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని డీఈవోకు సూచించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిటిసి పురుషోత్తం, డిటివో చక్రవర్తి శ్రీకాంత్, డీఈవో జనార్దన్‌రావు, అశోక్, ఎంవిఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల రుణమాఫీని వెంటనే చేయాలి: మంత్రికి వినతి



**ప్రజాపక్షం/ రామగిరి:** రామగిరి మండల కేంద్రంలోని సెంటనరీ కాలనీ కేడీసీసీ బ్యాంకులో అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన రైతులను రుణమాఫీని వెంటనే మాఫీ చేయాలని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణ రెడ్డి గురువారం వినతి పత్రం అందజేశారు. కేడీసీసీ బ్యాంకులో బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో 54 మంది రైతుల రుణమాఫీ కాకుండా పోయిందని మంత్రి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు ఫోన్ ద్వారా విషయం తెలపడం జరిగింది. ఇట్టి విషయంపై ఆఫీసు నుండి లెటర్ ఇవ్వడం జరుగుతుందని వెంటనే 54 మంది రైతుల రుణమాఫీ ప్రకటించాలని పేర్కొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** రాబోయే గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత పై అదనపు కలెక్టర్ లు జే.అరుణ శ్రీ, డి.వేణు లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీ స్థానిక సంస్థ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎంపీటీసీ పరిధి చెక్ చేసుకోవాలని, ఎంపిడీఓ లు ఈ అంశం పై ప్రత్యేక దృష్టి సారించాలని, మండల స్థాయిలో అందుబాటులో ఉన్న సిబ్బంది ఎన్నికల సమయంలో ఏ బాధ్యతలను నిర్వర్తించాలో స్పష్టమైన ప్రణాళిక తయారు చేసుకోవాలని, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అవసరమైన బ్యాలెట్ పత్రాలు, బాక్సులు స్ట్రాంగ్ రూమ్ లో అందుబాటులో ఉన్నాయని,ఎన్నికలు వస్తే చేయాల్సిన పనులను మండల పంచాయతీ అధికారి, ఎంపిడిఓ కలిసి లిస్ట్ ఔట్ చేసుకోవాలని, ప్రతి పనికి ఒక అధికారికి బాధ్యతలు అప్పగించాలని, అవసరమైన సిబ్బంది, మెటీరియల్ వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు, స్థానిక సంస్థ ఎన్నికలు వేరువేరుగా ఉంటాయని, స్థానికత పరిస్థితుల ఆధారంగా పోలింగ్ కేంద్రాలను విభజించాలని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ ప్రణాళికలు చేసుకోవాలని, ఎన్నికల సమయంలో బ్యాలెట్ బాక్స్‌ల తరలింపుకు అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం జనవరి 29న మృతి చెందిన అంతర్గాం ఎంపీడీవో అలీముద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కలెక్టర్, ఎంపీడీవోలు, ఇతర అధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సమావేశంలో డిపిఓ వీర బుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేందర్,రాజేశ్వర్, ఎన్నికల నోడల్ అధికారులు, డిఎల్‌పిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి సందేశం ప్రబోధించిన జాతిపిత




కలెక్టర్ సత్యప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** సమస్త విశ్వానికి శాంతి సందేశం ప్రభోధించిన జాతిపిత మహాత్మ గాంధీ అని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. అహింస, సత్యాగ్రహేలే ఆయుధాలుగా అఖండ భారతావనికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ప్రసాదించిన మహా నాయకుడు మహాత్మా గాంధీ అని పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సమావేశా మందిరంలో కలెక్టరేట్ అన్ని శాఖల సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్ పాటు అదనపు కలెక్టర్ బి ,ఎస్ లత గౌతమ్ రెడ్డి కలసి రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా కలెక్టరేట్ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



**ప్రజాపక్షం/రామగిరి:** రామగిరి మండలంలోని లద్నాపూర్ గ్రామస్తుల భూ నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని గురువారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. లద్నాపూర్ గ్రామంలోని పలు సమస్యలపై ముఖ్యంగా సింగరేణి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ గురించి తొందరగా సమస్యను పరిష్కరించాలని,పలు గ్రామ సమస్యలను మంత్రి శ్రీధర్ బాబు దృష్టి కి తిసుకెళ్ళాటం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గ్రామంలోని సమస్యలు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామని నిర్వాసితులకు హామి ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో మంథని అసెంబ్లీ నియోజక వర్గ మాజీ అధ్య క్షులు బర్ల శ్రీనివాస్ , తొగరి లింగయ్య తాళ్ల పెల్లి చంద్రయ్య, పొన్నం సత్యనారాయణ. తాటి శ్రీనివాస్ ,జమీల్. గౌర్రె ప్రకాష్, ప్రశాంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నూతన కార్యాలయం వద్ద అవసరమైన వసతులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** నూతన ఎంపిడిఓ కార్యాలయం వద్ద అవసరమైన వసతులు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం పెద్దపల్లి రైల్వే స్టేషన్ రోడ్ సమీపం లోని భవనంలోకి నూతనంగా తరలించిన ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించి మాట్లాడుతూ పెద్దపల్లి ఆర్టిసి బస్సు డిపో కు ఎంపీడీవో కార్యాలయ భూమి ని అప్పగించినందున, ఎంపిడిఓ కార్యాలయాన్ని రైల్వే స్టేషన్ రోడ్డు లోని నూతన భవనంలోకి మార్చడం జరిగిందని అన్నారు. నూతన కార్యాలయం ముందు ఉన్న ఓపెన్ ప్లేస్ ను కూడా వినియోగించుకోవాలని, నూతన కార్యాలయం వద్ద అవసరమైన వసతులు కల్పనకు ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ అధికారులకు పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎంపిడిఓ కార్యాలయం పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జడ్పి సీఈఓ నరేందర్,ఎంపీడీవో శ్రీనివాస్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో వాహన పన్నును చెల్లించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని వాహనదారులందరూ సకాలంలో వాహన పన్ను చెల్లించాలని జిల్లా రవాణా అధికారి పి. రంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని వాణిజ్య, వాణిజ్యేతర వాహనదారులు వాహన పన్నును సకాలంలో రవాణా శాఖకు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో సుమారు 3 వేల 120 వాహనాలు వాహన పన్ను చెల్లించకుండా తిరుగుతున్నాయని తెలిపారు.వాహన పన్నులు సకాలంలో చెల్లించని యెడల వాహన తనిఖీలలో భాగంగా పట్టుకుంటే చెల్లించాల్సిన వాహన పన్నుపై అపరాధ రుసుము మొదటి నెల 50 శాతం, రెండవ నెల 100 శాతం, మూడవ నెల 200 శాతం అదనంగా వసూలు చేయబడుతుందని జిల్లా రవాణా అధికారి పి.రంగారావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## భవనాన్ని సీజ్ చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు

**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో బావీస్‌ఖాన్ పూల్ వద్ద కుంబాల సంతోష్‌రెడ్డి నియమనిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పరిశీలించి సీజ్ చేశారు. 2019 చట్టంలోని సెక్షన్ 181 ప్రకారం అట్టి భవనాన్ని డిటిఎఫ్ సభ్యులు టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. పట్టణంలో ఎవ్వరు నియమనిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే బావీస్ ఖాన్ పూల్ వద్ద మున్సిపల్ నిర్మించిన బ్రిడ్జి రైలింగ్‌ను ధ్వంసం చేసిన కుంబం సంతోష్‌రెడ్డిపై చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ అశ్రీత్‌కుమార్ తెలిపారు. రెలింగ్‌ను పునర్నిర్మించి అట్టి డబ్బులను సంతోష్‌రెడి నుండి రెకవరీ చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఆస్తులను ధ్వంసం చేస్తే సహించేది లేదని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మరణించిన ఉపాధి హామీ కూలీలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ఉపాధి హామీ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన కూలీలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో గురువారం ప్రతి రోజు కూలీగా వెళ్లినట్లే వెళ్లి ప్రమాదవశాత్తు మొరం గడ్డ కూలి మట్టి రాళ్లు కూలీలపై పడి తల్లి, కూతురు కందారపు సరోజన, అన్నారి మమతలు మరణించడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని, గాయపడిన వారికి ప్రభుత్వమే వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. ఇట్టి ప్రమాద సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో తీసుకోవాల్సిన చర్యల పట్ల అవగాహన కల్పించాలని, పని ప్రదేశాల్లో ప్రథమచికిత్స కిట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. మరణించిన కూలీల కుటుంబాల పిల్లలకు విద్యతో పాటు ఇంటి సౌకర్యం, ఇందిరమ్మ భరోసా పథకం అమలు చేయాలని, ఉపాధి కూలీలందరికీ కేంద్ర ప్రభుత్వమే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి, భద్రత చట్టం తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు.

# ముగ్గురు ఆత్మహత్యా యత్నం






**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి:** సిద్దిపేట మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసు ఇవ్వకుండ గోడను కూల్చివేశారని ఆరోపిస్తూ జిల్లా కేంద్రంలోని 12 వార్డు రాఘవేంద్రనగర్‌కు చెందిన ముగ్గురు బాధితులు పసునురి చంద్రం. నిర్మల, శశిదర్‌లు డిజిల్ పోసుకొని ఆత్మహత్యానికి పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి బాధితులకు నీళ్లు చల్లారు. ఈసంఘటన వివరాలు ఇలావున్నాయి. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌కు చెందిన పసునురి చంద్రం, నిర్మలకు చెందిన ఇంటి ప్రహారి గోడను మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏలాంటి సమాచారం ఇవ్వకుండ ఇంటి ప్రహారి గోడను కూల్చివేశారు. దీంతో బాధితులు పసునురి చంద్రం, నిర్మల, స్వామి, శశిధర్, కీర్తనలు మున్సిపల్ కార్యాలయానికి ప్లాస్టిక్ బాటిళ్లలో డిజిల్ తీసుకొని వచ్చారు. పనుసురి చంద్రం, నిర్మల. శశిధర్‌లు మున్సిపల్ కార్యాలయాం ముందు డిజిల్ పోసుకొని ఆత్మహత్యానికి పాల్పడ్డారు. ఈవిషయాన్ని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ ఎస్ఐ కనకరెడ్డి సిబ్బందితో వచ్చి వారికి నచ్చచెప్పె యత్నం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో చెట్లకు నీరు పట్టే వాటర్ పైపుతో వారికి పోసారు. గతంలో సైతం మున్సిపల్ అధికారుల తమ ఇంటి ప్రహారి గోడను కూల్చివేశారన్నారు. దీంతో వార్డు కౌన్సిలర్‌తో మరో వ్యక్తి రాజీకుదిర్చినట్లు తెలిపారు. దీంతో తాము ఇంటి గోడను మళ్లీ నిర్మించుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు మరోసారి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఏలాంటి సమాచారం ఇవ్వకుండ గోడను కూల్చివేసి లక్షలాది రూపాయల నష్టపరిహారం కల్పించారని ఆరోపించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గయాస్‌లు అక్కడు చేరుకొని బాధితులకు నచ్చచెప్పారు. మున్సిపల్ కమిషనర్‌తో పట్టణ అధ్యక్షుడు ఫోన్ ద్వారాసంప్రదించి పరిస్థితిని వివరించారు. మున్సిపాల్టీలో అవినీతి రాజ్యమేలుతుందని, డబ్బులు ఇవ్వకుంటే ఇంటి గోడను కూల్చివేయటం ఏంతవరకు సమంజసమన్నారు. బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్ కుమార్ బాధితులను తన చాంబర్‌ను పిలిపించుకొని వారితో మాట్లాడారు. తాను సోమవారం వార్డులో పర్యటించి ప్రత్యక్షంగా విచారణ జరుపుతానన్నారు.

**రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేస్తే నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదు- కమిషనర్**

పట్టణంలో రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడితే నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదని.. కూల్చివేసే అధికారం ఉందని మున్సిపల్ కమిషనర్ అశ్రీత్‌కుమార్ తెలిపారు. రోడ్డును ఆక్రమణ చేసే అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలపై కొరడ ఝూలిపిస్తామని కమిషనర్ హెచ్చరించారు.

**నోటీసు ఇవ్వకుండ ఇంటిగోను ఏలా కూల్చీవేస్తారు ?**

అనుమతి లేకుండ, నోటీసు ఇవ్వకుండ మున్సిపల్ అధికారులు ఇంటి గోడను ఏలా కూల్చివేస్తారని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అత్తు ఇమామ్ అన్నారు. పట్టణంలో నిరుపేదలు చాకలి కుటుంబం డబ్బులు పోగు చేసుకొని ఇంటి నిర్మాణం చేసుకుంటే అప్పట్లో వార్డు కౌన్సిలర్ అడ్డుకొని డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. అప్పట్లో డబ్బులు ఇవ్వకుండే కౌన్సిలర్ ఇంటి ప్రహారి గోడను కూల్చివేయించినట్లు తెలిపారు. బాధితులు కోర్టునుఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు ఇంటి గోడను నిర్మించుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు అధికారులు మరోసారి కూల్చివేయటంతో మున్సిపల్ కార్యాలయం ముందు ఆత్మహత్యానికి పాల్పడినట్లు తెలిపారు. డబ్బులు డిమాండ్ చేసిన మున్సిపల్ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. మున్సిపాల్టీలో బిఆర్ఎస్ అరాచక పాలనను అరికడుతామన్నారు. ఈకార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాస్, సజ్జు. ఫయాజ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫోకస్



# వ్యవసాయానికి పెరుగుతున్న డిమాండ్

## వ్యవసాయం

ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ వ్యవసాయానికి డిమాండ్ పెరుగుతున్నది. జనాభా విస్ఫోటనమే ఇందుకు ప్రధాన కారణం. 2050 నాటికి ప్రపంచ జనాభా 9.9 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా. జనాభా అవసరాలకు అనుగుణంగా ఆహారానికి డిమాండ్ ఉంటుంది. ప్రపంచ అతిపెద్ద పరిశ్రమగా విరాజిల్లుతున్న వ్యవసాయ రంగం ఒక్కటే ఈ డిమాండ్‌ను తీర్చాలి. ఒక దేశ ఆర్థిక వ్యవస్థ అత్యధిక శాతం వ్యవసాయ రంగ అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. వ్యవసాయ రంగమే ఎక్కువ శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నది. డెస్క్ ఉద్యోగాల నుండి ఫీల్డ్ వర్క్ వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఏకైక రంగంగా వ్యవసాయాన్ని పేర్కోవాలి. ఈ పరిశ్రమలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక పని ఉంటుంది. ప్రపంచ జనాభాలో 40 శాతం మందికి ఉపాధి కల్పిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమగా కొనసాగుతున్నది. నిత్య జీవితంలో మనం ఉపయోగించే ఎన్నో వస్తువులు, ఉపకరణాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయ రంగంపై ఆధారపడినవే. అందువల్ల నిరంతరం పెరుగుతున్న వ్యవసాయ పరిశ్రమ యొక్క ఉత్పత్తి. ఉత్పత్తుల జాబితా పత్తి, ఉన్ని నుండి అన్ని రకాల పండ్లు, కూరగాయల వరకు జాబితా చేయడానికి చాలా పెద్దది. కాగా, 2025 నాటికి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రైతులు తమ ఆహారోత్పత్తిని 70 శాతం పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ధనిక, పట్టణీకరణ జనాభా డిమాండ్లను తీర్చడానికి మాత్రమే కాకుండా, ఆహార కొరత, ప్రపంచ ఆకలి ప్రమాదాలను నివారించడానికి కూడా మొత్తం ఆహార ఉత్పత్తిని పెంచాలి. పెరుగుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక కారకాలు ఆకలి సమస్యలను సృష్టిస్తాయి, ఈ సమస్యలకు వ్యవసాయ కార్యకలాపాలను పెంచడం ఒక్కటే పరిష్కారం. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ ఆహార డిమాండ్‌ను తీర్చడానికి పెద్ద మొత్తంలో ఆహారోత్పత్తులు అసరం. కాగా, ప్రపంచ వ్యవసాయ రంగంలో మహిళలు గణనీయంగా సుమారు 43 శాతం మంది ఉన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో, ఆహార ఉత్పత్తిలో 60 నుండి 80 శాతం వరకు మహిళలే కీలక వాటాదారులు. అనేక వ్యవసాయ కమ్యూనిటీలలో, వారు విస్తృత శ్రేణి పంట రకాలపై చాలా పరిజ్ఞానంతో వ్యవసాయంలో నిపుణులుగా వ్యవహరిస్తారు. ఇలావుంటే, వ్యవసాయ రంగంలో పెరుగుతున్న రసాయనాల వాడకాన్ని తగ్గించడం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరం. పర్యావరణ పరిరక్షణ నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వరకూ అనేకానేక రకాలుగా సేంద్రీయ వ్యవసాయ విధానాలు నేడు కీలకంగా మారా యి. సేంద్రీయ వ్యవసాయం నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నేలలో పోషక విలువలను సంరక్షిస్తుంది. ఇది సాంప్రదాయ వ్యవసాయం కంటే 2.5 రెట్లు ఎక్కువ శ్రమతూ కూడుకున్నదైనప్పటికీ, పది రెట్లు ఎక్కువ లాభాలను ఇస్తుంది. సేంద్రీయ పొలాల ఇన్పుట్ ఖర్చులు తక్కువగా ఉంటాయి. రైతులకు భారీ ఖర్చులు తగ్గుతాయి. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు సహజ పురుగుమందులను ఉపయోగిస్తాయి. వీటిలో ఖనిజ లవణాలు, మొక్కల నుండి సహజంగా సేకరించిన పురుగుమందులు ఉన్నా యి. ఈ పురుగుమందులు సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులలో ఉపయోగించే వాటి కంటే తక్కువ హానికరం. సహజ పురుగుమందుల వల్ల పర్యావరణానికి ఎలాంటి ప్రమాదం లేదా హాని ఉండదని ప్రజలు భావించడం సర్వసాధారణం. అయితే, ఇదే నికరం అనుకోవడానికి వీల్లేదు. సేంద్రీయ వ్యవసాయంలో పైరెత్రిన్ వంటి సహజ పురుగుమందులను ఉపయోగిస్తా రు. ఇది సాంప్రదాయ పురుగుమందులతో పోలిస్తే వాతావరణంలో త్వరగా విచ్ఛిన్నమవుతుంది. ఈ ఫాస్ట్ బ్రేక్డౌన్ బహుళ అప్లికేషన్ల అవసరాన్ని సృష్టిస్తుంది. ఇది సహాయక కీటకాలను కూడా నాశనం చేస్తుంది. అంతేకాకుండా, సేంద్రియ వ్యవసాయంలో సాగు చేయడం వల్ల నేల కోతకు గురవుతుంది. అయినప్పటికీ, సాంప్రదాయిక వ్యవసాయ పద్ధతులు సాగును తగ్గించడంపై దృష్టి పెడతాయి. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే కుటుంబ వ్యవస్థలోనూ మార్పు లు రావాలి. ఒకనాటి ఉమ్మడి కుటుంబాలకు పెద్దపీట వేయాలి. ఇప్పటికి కూడా ప్రపంచవ్యాప్తంగా మెజారిటీ పొలాలు కుటుంబ యాజమాన్యంలోనే ఉన్నా యి. ఆహార ఉత్పత్తిలో దాదాపు 56 శాతం కుటుం బ యాజమాన్యంలోని పొలాల నుండి వస్తున్నది. చిన్న కుటుంబాలు ప్రపంచవ్యాప్తంగా 57 మిలియన్ల వ్యవసాయ క్షేత్రాలను నడుపుతున్నాయి. ఈ కుటుంబ యాజమాన్యంలోని వ్యాపారా చిన్న హోల్డింగ్స్ నుండి పెద్ద పొలాల వరకు మారుతూ ఉంటాయి. ఇక్కడ విప్లవాత్మక వ్యవసాయ పద్ధతులు అమలవుతాయి. ఏ రకంగా చూసినా, వ్యవసాయోత్పత్తులు పెరగాలన్నా... ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడాలన్నా సేంద్రీయ విధానాలను అవలంభించక తప్పదు.





ఇతరత్రా రంగాల్లో ఒక ఉద్యోగానికి కనీసం పదిపదిహేను మంది పోటీపడుతుంటే, వ్యవసాయ రంగంలో మాత్రం కార్మికుల కొరత కనిపిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ రంగం పనివారు తగ్గుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయ వస్తువులకు పెరిగిన డిమాండ్‌తో పోలిస్తే, ఈ రంగంలో తగినంత మంది కార్మికులు లేరు. ఉద్యోగ అవ

### కార్మికులకు డిమాండ్..

కాశాల సంఖ్య వాటిని పూరించడానికి అందుబాటులో ఉన్న అభ్యర్థుల సంఖ్యను మించిపోయింది. డిమాండ్ కంటే తక్కువ సరఫరా ఉన్న చోట, ఇది అందుబాటులో ఉన్న కార్మికుల వేతనాలు, జీతాలను పెంచుతుంది, ఇది పని చేయడానికి ఆకర్షణీయమైన పరిశ్రమగా మారుతుంది.






# సవాళ్లు విసురుతున్న గ్లోబల్ వార్మింగ్

గ్లోబల్ వార్మింగ్ సమస్య భారత్‌సహా అన్ని ప్రపంచ దేశాలకు సవాళ్లు విసురుతోంది. గత ఏడాది (2024) అత్యంత అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్టు ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఒ) ధృవీకరించింది. అంతేగాక, గత పదేళ్లను (2015–2024) అత్యంత వేడిగా ఉన్న దశాబ్దంగా ప్రకటించింది. భారత దేశంలోనూ ఇదే పరిస్థితి కనిపిన్నది. వాతావరణ శాఖ (ఐఎండి) ప్రకారం మన దేశంలో ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రపంచ సగటు కంటే ఎక్కువగా ఉంది. అయినప్పటికీ, భారతదేశంలోని మార్పులను గ్లోబల్ క్లైమేట్ మోడల్స్ ఖచ్చితంగా ప్రతిబింబించడం లేదని ఆందోళనలు ఉన్నాయి. వాతావరణ పరిశీలన, ప్రభావ అంచనా సామర్థ్యాలను మెరుగుపరచవలసిన అవసరాన్ని ప్రస్తుత పరిస్థితి హైలైట్ చేస్తున్నది. డబ్ల్యుఎంఒ నివేదికను అనుసరించి, 2024లో, ప్రపంచ సగటు ఉపరితల ఉష్ణోగ్రత, పారిశ్రామిక పూర్వ స్థాయిల (1850–1900 కాలం) కంటే 1.55 డిగ్రీల సెల్సియస్ అధికం. మొదటి సంవత్సరం బేస్‌లైన్ కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత. అదే విధంగా, 2000 మీటర్ల సముద్రపు నీరు రికార్డు స్థాయిలో 16 జెట్టాజౌల్స్ వేడిని గ్రహించింది. ఇది 2023లో మొత్తం ప్రపంచ విద్యుత్ ఉత్పత్తికి దాదాపు 140 రెట్లు ఎక్కువ. గ్లోబల్ వార్మింగ్ నుండి 90 శాతం అదనపు వేడి సముద్రంలో నిలువ ఉంటుంది. 2024 ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెల్సియస్ దాటినప్పటికీ, పారిస్ ఒప్పంద లక్ష్యాలు చెక్కుచెదరకుండా ఉన్నాయని డబ్ల్యుఎంఒ హామీ ఇస్తున్నది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల్లో ప్రతి డిగ్రీ కూడా పర్యావరణ, మానవ వ్యవస్థలు, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పరిస్థితులను మరింత దిగజారుస్తుంది. గ్లోబల్ వార్మింగ్‌ను పారిశ్రామిక పూర్వస్థతి కంటే 2 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పరిమితం చేయడానికి చట్టబద్ధంగా కట్టుబడి ఉన్న ప్రపంచ ఒడంబడికైన పారిస్ ఒప్పందాన్ని దేశాలేవీ చిత్తశుద్ధితో అమలు చేస్తున్న దాఖలాలు లేవు. మన దేశం కూడా ఇదే దారిన నడుస్తున్నదనేది చేదు నిజం. గత ఏడాది దేశంలో సాధరణం కంటే 0.65 డిగ్రీల సెల్సియస్ మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని భారత వాతావరరణ విభాగం (ఐఎండి) ప్రకటించింది. అయితే, ప్రపంచ సగటు 1.55 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉందని సంతృప్తి పడుతున్నది. అయితే, పరిస్థితులు ఇదే రీతిలో కొనసాగితే, మన దేశంలోనూ ఉష్ణోగ్రతలు సగటు గంటే ఎక్కువగా నమోదయ్యే రోజులు ఎంతదూరంలో లేవు.



### మంచి ప్రయత్నం..





కేరళలోని వెంబనాడ్ సరస్సు పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా మెగా ప్లాస్టిక్ క్లీనింగ్ డ్రైవ్‌ను అలప్పుజ జిల్లా యంత్రాంగం చేపట్టడం ఓ మంచి ప్రయత్నం. సరస్సును శుభ్రపరచి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. పరిరక్షించుకోవాల్సిన 'రామ్సర్ సైట్'గా గుర్తింపు పొందిన ఈ సరస్సు, దేశంలోనే రెండో అతిపెద్ద చిత్తడి నేల వ్యవస్థలో ఒక భాగం. ఈ మొత్తం ప్రాంతాన్ని పర్యావరణ హితంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే సరస్సు చుట్టూ బయోషీల్డ్‌ను ఏర్పాటు చేస్తారు. వెంబనాడ్ లేక్ ఇంటర్ప్రెటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా నూలు మ్యూజియం, బాటిల్ బూత్‌లు, కమ్యూనిటీ టూరిజంను ప్రోత్సహించడం, చేపల విత్తనాల నిల్వ వంటి చర్యలతో సరస్సును మరోసారి కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అదే విధంగా సరస్సు చారిత్ర నేపథ్యాన్ని, ప్రాధాన్యతను వివరంచడానికి వీలుగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి. ఒకప్పుడు ఎంతో విస్తారంగా ఉండి, కనీసం 80 లక్షల మంది జీవనోధిని ప్రభావితం చేసిన ఈ సరస్సు క్రమంగా క్షీణించింది. 1990 నుంచి 2020 మధ్యకాలంలో సరస్సు నీటి సామర్థ్యం 85.3 శాతం పతనం కావడం సమస్య తీవ్రతకు అద్దం పడుతుంది. కేరళ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడంతో, ఈ సరస్సుకు మళ్లీ పూర్వ వైభవం వస్తుందని ఆశిద్దాం.

---

## ప్రభుత్వాస్పత్రిని వెయ్యిపడకలకు పెంచుతూ..
## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని వెయ్యి పడకల ఆసుపత్రిగా మార్చి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిజిహెచ్ కాన్ఫరెన్సు హాల్లో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) జనరల్ బాడీ సమావేశం సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన యూసుఫ్ మాట్లాడుతూ నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోజురోజు పెరుగుతున్న ఒపి, ఐపిలను దృష్టిలో పెట్టుకొని జిజిహెచ్‌ను వెయ్యి పడకలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బం ది కలిసి పనిచేసి ఆసుపత్రికి మంచి గుర్తింపు తేవాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సిబ్బంది, కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన మినిమం వేజ్ బోర్డులో నూతనంగా ఎన్నికైన యూసఫ్‌ను కార్మికులు సన్మానించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య , జిజిహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, జిఎంసి వైస్ ప్రిన్సిపల్ జలగం తిరుపతిరావు, యూనియన్ నాయకులు హైమది, భాగ్యలక్ష్మి , స్వరూప, కవిత, వెంకట్, వెంకటేశ్, రాధాకుమార్, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

## వసతిగృహంలో ఫుడ్ పాయిజన్..
## ఘటనకు కారకులపై కఠినచర్యలు

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రం గిరినగర్‌లోని గిరిజన బాలికల వసతిగృహంలో ఫుడ్ పాయిజన్ ఘటనకు కారకులైన వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపగాని రవి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఎఐఎస్ఎఫ్, టిఆర్‌విఎస్‌పి, గిరిజన శక్తి సంఘాల ఆధ్వర్యంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ బుధవారం ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురి కాగా, గురువారం కూడా మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. విద్యార్థులు బయటి ఆహార పదార్థాలు తీనడంతోనే ఫుడ్ పాయిజన్ అయిందని చెప్పడం సరైంది కాదన్నారు. విద్యార్థులు ఎలాంటి బయటి ఆహార పదార్థాలు తీసుకోలేదని, హాస్టల్ ఫుడ్ తినడంతోనే అస్వస్థతకు గురయ్యారని వారు ఆరోపించారు. అధికారులు సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చామకూరి మహేందర్, వెంకటేష్ నాయక్, వల్దాస్ భవాని, స్టాలిన్, బంటు సైదులు, రాజేష్, మహేష్ పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు కార్యాలయాలు 'ఉద్యమ కేంద్రాలు'

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

ముస్తఫానగర్‌లో సిపిఐ కార్యాలయం ప్రారంభం



**ప్రజాపక్షం/ఖమ్మం :** కమ్యూనిస్టు కార్యాలయాలు ఉద్యమ కేంద్రాలని, అవి ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పాడతాయని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలే పేద, మధ్యతరగతి ప్రజలకు రక్ష అని, కమ్యూనిస్టు పార్టీలు మరింత పురోగమించేలా కృషి చేయాలన్నారు. గురువారం ముస్తఫానగర్‌లోని అల్లిపురం క్రాస్ రోడ్డు వద్ద సిపిఐ కార్యాలయాన్ని హేమంతరావు ప్రారంభించారు. కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని కార్పొరేటర్ బిజి క్లెమెంట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాడుగుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ నిరంతరం కమ్యూనిస్టు కార్యాలయాలు పనిచేస్తుంటాయన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే పనిచేసే కార్యాలయాలకు, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం పనిచేసే కార్యాలయాలకు మధ్య తేడాను ప్రజలు గమనించాలన్నారు. దేశంలో అవకాశవాద రాజకీయాలు పెరిగిపోతున్నాయని, అవకాశవాద రాజకీయాలతో ప్రజాస్వామ్యంలో పెనుప్రమాదం చోటు చేసుకుంటుందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తూ ఊసరవెల్లుల్లా పార్టీలు మారుతున్నారని, ఇటువంటి వ్యక్తులతో కమ్యూనిస్టు పార్టీకి ఎప్పటికీ నష్టం లేదన్నారు. కమ్యూనిస్టు పార్టీ పక్షాన ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. దేశంలో సంక్లిష్ట రాజకీయ పరిస్థితి నెలకొందని, ప్రజా సమస్యల పరిష్కారాన్ని, సంక్షేమాన్ని విస్మరించి మత రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పేదలకు సైతం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో వచ్చిన ఒడుదొడుకుల కారణంగా వేలాది కుటుంబాలు కుటుంబ పోషణార్థం పట్టణాలకు వలస వచ్చాయని, అడ్డా కూలీలుగా చాలా మంది పనిచేస్తున్నారని వీరిని విస్మరించడం తగదన్నారు. ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని పట్టణ పేదలకు వర్తింపజేయాలని అందులో భాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను పట్టణ పేదలకు అందించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి పనులతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ముడిపెట్టడం తగదన్నారు. పేదల పక్షాన సిపిఐ పోరాడుతుందని హేమంతరావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, ఎఐటియుసి అధ్యక్షుడు గాదె లక్ష్మి నారాయణ, వరదా నర్సింహారావు, ముద్రబోయిన అప్పారావు, పార్టీ నాయకులు సిద్ది శ్రీనివాస్, మాలకొండయ్య, ప్రతానపు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణతో దేశాభివృద్ధికి నష్టం

మాజీ ఎమ్మెల్సీ, ఎఐటియుసి సీనియర్ నాయకులు పిజె చంద్రశేఖర్‌రావు




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడంతో ఆర్థిక పురోభివృద్ధి మందగించిందని మాజీ ఎమ్మెల్సీ, ఎఐటియుసి సీనియర్ నాయకులు పిజె చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నేరుగా ప్రభుత్వాల అధీనంలో ఉండటం, అవసరాల మేరకు కొత్త ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పడంతోనే దేశ పురోగతి సాధ్యమవుతుందన్నారు. సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సిపిఐ శత జయంతి వార్షికోత్సవాల సందర్భం గా 'ప్రభుత్వ రంగ సంస్థలు– సిపిఐ పాత్ర' అన్న అంశంపై ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ సమాజ పురోగతికి, దేశ ఆర్థిక ప్రగతికి నాలున్నర దశాబ్దాల పాటు ప్రభుత్వ రంగ సంస్థలు వెన్నుదన్నుగా నిలిచాయన్నారు. లక్షలాది మందికి ఉపాధి కల్పించి ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వరంగ సంస్థలు సరళీకృత విధానాలతో నేడు పతనావస్థకు చేరుకున్నాయన్నారు. ప్రపంచీకరణ విధానాలను పాలకులు అమలు చేసే ప్రయత్నాలతోనే ఈ దుస్థితికి కారణమవుతోందన్నారు. ప్రజలకు చెందాల్సిన లక్షల కోట్ల సంపద గుప్పెడు మంది పారిశ్రామిక వేత్తల జేబుల్లోకి వెళుతున్నాయని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ కు ప్రమాదమని ఆయన హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బిఎస్ బోస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమను, ఉత్పత్తి విలువను సరుకుగా మారుస్తున్నారే తప్పా, సామాజిక కోణంలో అభివృద్ధి చెందేందుకు దోహదపడటం లేదన్నారు. 70వ దశకంలో పెట్టుబడి దారీ వర్గం బలపడటం ద్వారా క్రమక్రమంగా ప్రభుత్వ సంస్థలను కేంద్రప్రభుత్వాలు ఒక్కటొక్కటిగా ప్రయివేటీకరణ చేస్తూ సంస్థల మూసివేయబడటానికి కారకులయ్యారన్నారు. కేంద్రంలో గత పదేళ్ల నరేంద్ర మోదీ పాలనలో 245 ప్రభుత్వరంగ సంస్థలు మూతబడ్డాయని, దీని వల్ల వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఇలాంటి పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వంపై వామపక్షాలు పోరాడాయన్నారు. సిపిఐ, అనుబంధ సంస్థల ఎఐటియుసి కార్మిక సంఘాలు, కార్మికుల పక్షాన నిలబడి పలు పోరాటాలు చేసిన చరిత్ర ఉందన్నారు. ఇటీవలి కాలంలో ప్రవేశించిన ఎఐ ఇంటిలెజెన్స్ వల్ల లాభాల కంటే నష్టాలే అధికంగా కనపడుతాయ న్న విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ భవిష్యత్ పోరాటాలకు కార్మిక సంఘాలు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, సిపిఐ కాప్రా పట్టణ కార్యదర్శి లక్ష్మి నారాయణ, మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహ, రాజేశ్వరరావు, ఎంఆర్‌కె రెడ్డి, నర్సింహారావు, నాగభూషణం, జోషి, నారాయణ, మల్లయ్య, యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపోరాటాలకు సిపిఐ పునాది

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రజాపోరాటాలకు సిపిఐ పునాది అని పార్టీ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ అన్నారు. గురువారం తిమ్మాజిపేట మండలం మారేపల్లి సిపిఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ పుట్టి వందో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహిస్తుందన్నారు. సిపిఐ పార్టీ పుట్టినప్పటినుంచి మొదట ఏ ఆశయం కోసం అయితే పనిచేసిందో, నేడు అదే ఆశయాలతో పనిచేస్తుందన్నారు. పార్టీ నిర్మాణం కర్తవ్యాలను తూచ తప్పకుండా పాటిస్తూ, ప్రజాసమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న తరుణంలో ప్రతిఘటనలు పోరాటాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి ప్రజలకు అనుగుణంగా చట్టాలు తెచ్చే విధంగా పోరాటాలు చేస్తున్నామన్నారు. ఆనాడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ ఉద్యమంలో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమం వీరోచితమైనదన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని వీరోచితమైన పోరాటాలు నిర్వహిస్తే బషీర్‌బాగ్‌లో జరిగిన కాల్పులలో సిపిఐ నాయకులు ముగ్గురు అమరులైనారన్నారు. అయినా పోరాటాలు చేయడంలో ఎప్పుడు సిపిఐ వెనుకడుగు వేయలేదన్నారు. అదేవిధంగా గత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలకు ఇండ్లకోసం, నిరుపేదలకు భూమికోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. పేదలకు ఎర్రజెండా ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. పోరాటాలు సిపిఐకి కొత్తకాదన్నారు. సిపిఐ వంద సంవత్సరాలలోకి అడుగుపెట్టిన సందర్భంగా పోరాటాలతో ప్రజలకు చేరువై సొంత ఇంటి పండుగలాగా సంవత్సరంపాటు నిర్వహించుకోవాలని సిపిఐపార్టీ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చా రు. కార్యక్రమంలో మారేపల్లి సిపిఐ గ్రామకార్యదర్శి ఆంజనేయులు, తిమ్మాజిపేట మండల కార్యదర్శి షేక్ ఖాజామైనుద్దిన్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కేశమల శివకృష్ణ, సిపిఐ గ్రామ నాయకులు బాలస్వామి, ఆంజనేయులు, రాములు, దేవయ్య, శ్రీశైలం, బాలకృష్ణయ్య, ఇసాక్‌రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.



# నూతన పద్ధతులతో వ్యవసాయం లాభదాయకం

## కలెక్టర్ సత్య శారద






**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నూతన పద్ధతులతో వ్యవసాయం చేయాలని జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. పివి నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో గురువారం కృషి విజ్ఞాన కేంద్ర మామూనూర్లో కిసాన్ మేళ నిర్వహించారు. ఈ కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అధిక సాంద్రత ప్రత్తి సాగు యాజమన్యంలో మెలకువలు అనే చిరుపుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నూతన పద్ధతులతో వ్యవసాయం చేయడం లాభదాయకమన్నారు. ప్రయోజనకరమైన అన్ని రకాల వ్యవసాయాన్ని రైతులకు అవగాహన కల్పించాలని కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహాకులను కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం సేవలు ఉపయోగించుకోవాలి అని రైతులకు సూచించారు. మునగ పంటను పండించినట్లయితే అట్టి ఆకులను చాలా విలువలతో కూడుకున్న పోషకాలు ఉన్నాయని వాడిని ప్రతి ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థులకు ఆహారంగా ఇచ్చినట్లయితే వాళ్లకి ఆరోగ్యంగా ఉపయోగపడుతుందని రైతులకు వివరించారు. రైతులు ఐదురెకరాలు ఉన్నట్లయితే దాంట్లో ఫిష్ పాయింట్ పెట్టుకోవడం కోసం అవకాశం కల్పిస్తుందని ఈ విషయాన్ని రైతులకు తెలియజేయవలసిందిగా ఫిషరీస్ అధికారికి సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ మాట్లాడుతూ సమీకృత వ్యసాయం చేపట్టాలని, వ్యవసాయంలో యాంత్రీకరణతో పంటల ఉత్పత్తి ఖర్చు తగించవచ్చు అని తెలిపారు. డాక్టర్ రాజన్న మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం అందించిన సేవలు, అధిక సాంద్రత ప్రతి సాగు 303 ఎకరాలలో 149 మంది రైతులతో ప్రదర్శనలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పివి నరసింహారావు పశువైద్య యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్ కుమార్, వరంగల్ జిల్లా పశు,వైద్య పశుసంవర్ధక అధికారి డాక్టర్ బాలకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ అనురాధ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగం, కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ్ జ్యోతి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్, యంగ్ ప్రొఫెషనల్ హర్ష, సాయి చంద్, సుశ్రుత్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు సహకరించాలి

గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఎక్స్‌ప్రెస్ హైవే ఏర్పాట్లు భూ సేకరణకు పర్వతగిరి మండలం చింత నెక్కొండ గ్రామ, సంగెం మండలం చింతలపల్లి గ్రామాలకు చెందిన రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పై రైతుల ఎలాంటి అపోహలు చెందవద్దని, మెరుగైన పరిహారం అందించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు భూములను అందించి సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు వెంకటస్వామి, రాజ్‌కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ రైతులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమం ఐజెయు లక్ష్యం

### టియుడబ్ల్యుజె ఐజెయు జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి

### ఘనంగా టియుడబ్ల్యుజె ఐజెయు 2025 డైరీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హనుమకొండ :** జర్నలిస్టుల సమస్యల సాధనకు కృషి చేస్తామని, జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టియుడబ్ల్యుజె (ఐజెయు) ముందుకు సాగుతున్నదని సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి తెలిపారు. గురువారం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్‌లు సాధించేందుకు కృషిచేస్తామన్నారు. అక్రిడేషన్‌లపై జరుగుతున్న దుష్ప్రచారం జర్నలిస్టులు నమ్మవద్దని కోరారు. అలాగే హెల్త్ కార్డుల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారం దిశగా పాటుపడతామన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, యూనియన్ జాతీయ నాయకులు దాసరి కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడేపల్లి మధు, హౌజింగ్ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, కంకణాల సంతోష్,గడ్డం కేశవమూర్తి, పి.శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, నల్లాల బుచ్చిరెడ్డి, పి.విష్ణువర్ధన్, ఎండి నయీంపాషా, గన్ను సంతోష్, రంజిత్, పులికంటి రాజేందర్, దండు మోహన్, ఎం. ఓదెలు,వాజిద్, టి.రవి, పి.రామారావు,ఖాదర్ పాషా పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోని అభివృద్ధి జరిగిందని, గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చి అభివృద్ధి చేసిన ఘనత కెసిఆర్‌దేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఎంఎంఆర్ గార్డెన్‌లో గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ది డెవలప్ మెంట్ విజన్ అయితే కాంగ్రెస్ ది పబ్లిసిటీ స్టంట్ అని ఎద్దేవా చేశారు. రేవంత్ మాయమాటలకు తెలంగాణ ప్రజలు బలైపోయారని, పండగలా ఉండే వ్యవసాయం నేడు దండగ అనే పరిస్థితికొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అబద్దాలు నయవంచనతో రేవంత్ పాలిస్తున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మార్గ భిక్షపతి, మండల అధ్యక్షుడు త్వరలో కుమార్‌స్వామి, ఆత్మ డైరెక్టర్ గుర్జ గోపాలరావు, మాజీ మార్కెట్ చైర్మన్ గుజ్జు సంపత్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు కొండేటి శ్రీనివాస్, కంజర్ల రవి, మహేష్ పాల్గొన్నారు.

## బిసిలు రాజకీయాలను శాసించాలి

### పద్మశాలి సంఘం జాతీయ నేత ఈగ మల్లేశం




**ప్రజాపక్షం/హనుమకొండ :** బిసిలు రాజకీయాలను శాసించి రాజ్యాధికారాన్ని చేపట్టాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ పూర్వ అధ్యక్షులు ఈగ మల్లేశం అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధిపత్య కులాల పాలకులు బిసిలను ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కడానికే ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను తెచ్చి తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. ఈడబ్ల్యుఎస్ దేశంలో రిజర్వేషన్లు 60లక్షల మంది నిరుద్యోగులకు శాపంగా మారిందన్నారు. కేవలం మూడు శాతం ఉన్న ఓసి కులాలకు 10 శాతం, 65 శాతం ఉన్న బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు మాత్రమే అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేము ఎంతో మాకు అంత వాటా దక్కాల్సిందేనన్నారు. పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు సాంబారి సమ్మారావు, వన్నాల శ్రీరాములు, గుండు ప్రభాకర్ మాట్లాడుతూ బిసిలు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్ళు ఎందుకోసం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో ఫిబ్రవరి 2న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించే బిసి రాజకీయ యుద్ధ భేరి భారీ బహిరంగ సభకు రాజకీయాలకతీతంగా అన్ని బిసి కులాలతో పాటు పద్మశాలి కులస్తులు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.సమావేశంలోవడ్నాల నరేందర్, చందా మల్లయ్య, బచ్చు ఆనందం, దుస్సా శివశంకర్, ఆడెపు రవీందర్, చిప్పా వెంకటేశ్వర్లు, శామంతుల శ్రీనివాస్, బేతి అశోక్, మేడారపు సుధాకర్, గాడి పల్లి రాజేశ్వరరావు, బైరి శ్రీనివాస్, జానకి రాములు, కుసుమ సూర్య కిరణ్, పరికిపండ్ల వేణు, రాజేంద్ర ప్రసాద్, బత్తుల రమేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆశయ సాధనకు కృషి

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సత్యం, అహింసలే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించిన జాతిపిత మహాత్మా గాంధీ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం జాతి పిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా భూపాలపల్లి పట్టణంలో నిర్వహించిన వర్ధంతిలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని, గాంధీ చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, సత్యం, అహింసలే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించిన జాతిపిత మహాత్మాగాంధీ అని కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళి అర్పిస్తున్నానని అన్నారు. అహింస అనే ఆయుధంతో సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి దాస్యశృంఖలాల నుంచి భరతమాతకు విముక్తి కలిగించిన గొప్ప మహోన్నతుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధన కోసం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు చల్లూరి మధు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పుప్పాల రాజేందర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, మాజీ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## జాతిపిత అడుగుజాడల్లో నడవాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**ప్రజాపక్షం/వరంగల్ :** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్లో సిపి క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపి అంబర్ కిషోర్ ఝా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. పోలీస్ అధికారులు సిబ్బంది పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. జాతిపిత అడుగు జాడల్లో నడవాలని, వారి స్ఫూర్తితో పనిచేయాలని ఈ సందర్భంగా సిపి తెలిపారు. కార్యక్రమంలో అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్‌తో పాటు ఎసిపిలు, ఆర్.ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# విలువలతో కూడిన విద్యనందించాలి

## కలెక్టర్ పి.ప్రావణ్య




**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** పాఠశాల విద్యార్థులకు కౌమార దశ నుండే విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా కుటుంబ సభ్యుల మధ్య అనుసంధానం పెరిగి కుటుంబ వ్యవస్థ బలోపేతం చేయడం జరుగుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావణ్య అన్నారు. సంస్కార వికాస శిక్షణ, పేరెంట్స్ అండ్ గ్రాండ్ పేరెంట్స్ దినోత్సవ సందర్భంగా గురువారం ఓరుగల్లు గ్రామర్ ప్లాటినం కౌన్సిల్ విద్యారణ్యపురి వారిచే ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగ్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు, సృజనాత్మక విద్యను అభ్యసించడం ద్వారా సృజనాత్మక శక్తి పెంపొందించడం జరుగుతుందన్నారు. కౌమార దశ నుండే విలువలతో కూడిన విద్య సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా, వయోవృద్ధుల సంరక్షణ విద్యార్థులను, సన్మార్గంలో ప్రేరేపించడం ద్వారా కుటుంబ వ్యవస్థ బలోపేతమవుతుందని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు వారి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తద్వారా వారికి మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యం పెంపొందుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, నోట్ బుక్స్ జిల్లా కలెక్టర్ అందజేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా వెల్ఫేర్ అధికారి జయంతి, సీఎంవో సుదర్శన్ రెడ్డి, ఎన్జీవో రామదాస్, కే.దామోదర్, యుగంధర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే కుష్టువ్యాధి నివారణ

## ములుగు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి గోపాలరావు



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** అవగాహనతోనే కుష్టు వ్యాధిని నివారించవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు అన్నారు. స్పర్శ్ లెప్రసీ అవగాహన ఉద్యమ కార్యక్రమాన్ని ములుగు జిల్లా ప్రధాన ఆసుపత్రి వద్ద జెండా ఊపి కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెఒ డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి కుష్టు రహిత ములుగు జిల్లాగా మార్చాలని కోరారు. మహాత్మాగాంధీ కుష్టు వ్యాధిగ్రస్తులకు చేసిన సేవలకు గుర్తుగా మహాత్మ గాంధీ వర్ధంతి జనవరి 30న కుష్టు వ్యాధి నివారణ దినంగా పాటిస్తున్నామని తెలిపారు. గ్రామ సభలో గ్రామ పెద్దలు యువకులు సోదరి సోదరీమణులు, పిల్లలతో కుష్టు వ్యాధి రహిత సమాజ ఏర్పాటుకు ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. కుష్టు వ్యాధి వంశపారపర్యంగా వచ్చే వ్యాధి కాదని, మైకో బ్యాక్టీరియా లెప్రే అనే క్రిమి వలన ఈ వ్యాధి వస్తుందని ఇది దీర్ఘకాలికమైన వ్యాధని, దీనిని మల్టీ డ్రంగ్ థెరపి ద్వారా పూర్తిగా నయం చేయవచ్చునని తెలిపారు. జిల్లా లెప్రసీ నియంత్రణాధికారి డాక్టర్ చంద్రకాంత్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ప్రణాళికలను తయారు చేసుకొని ప్రణాళికయుతంగా గ్రామసభలను నిర్వహించి లెప్రసీ పట్ల ఆరోగ్య సిబ్బంది అవగాహనను పెంపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రకాంత్, డెమో సంపత్, డిపిఎంఒ సాంబయ్య, సంజీవరావు, పర్యవేక్ష కులు దేవేందర్, నిర్మలా మేరీ, దేవమ్మ, కమల, పుష్పకుమారి, మేరీ, రాయిని గూడెం ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వెంకటాపురం సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగికి పదవీ విరమణ సహజమే

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి ఎంపిడిఒగా పనిచేస్తున్న ఇక్బాల్ హుస్సేన్ పదవీ విరమణ కార్యక్రమం జడ్పి కార్యాలయ ఆవరణంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై ఎంపిడిఒ ఇక్బాల్ హుస్సేన్ పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఒ నారాయణరావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ శైలజ, తహసీల్దార్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, పిప్పాల రాజేందర్, బుర్ర కొమురయ్య, దాట్ల శ్రీనివాస్, అన్ని మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యమైన విద్యుత్ అందించాలి

### జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ నరేష్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** రానున్న వేసవిలో మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించాలని జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ జె.నరేష్ సూచించారు. గురువారం జిల్లా విద్యుత్ నోడల్ ఆఫీసర్ శ్రీధర్, సెటన్ ఇంజనీర్స్, డివిజనల్ ఇంజనీర్స్‌తో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ అంతరాయం లేకుండా రానున్న లోడ్‌ను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అదనపు నియంత్రికలు ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రత్యామ్నాయ నియంత్రికలు ఏర్పాటుచేయాలని సూచించారు. సమ్మర్ యాక్షన్‌ప్లాన్ ప్రోగ్రాం కార్యచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందని ఎస్ఇ తెలిపారు. సమీక్షలో టెక్నికల్ పెద్దిరాజం, విజయ్, మధుసూధన్, ఎడిఇ కమర్షియల్ రాజ్యలక్ష్మి , ఎడిఇ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు






**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రజాస్వామ్యంలో పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా జర్నలిస్టులు పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్, కార్యదర్శి సామంతుల శ్యాం, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయ్, రాష్ట్ర హెల్త్ కమిటీ మెంబర్ సామల శ్రీనివాస్ ఆధ్వర్యంలో టియుడబ్ల్యుజె(ఐజెయు) డైరీని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కార్యాలయంలో జిల్లా ఎస్పి కిరణ్‌ఖరేలు యూనియన్ డైరీ ఆవిష్కరించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇండ్లస్థలాలు కేటాయించాలని, జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణాన్ని చేపట్టాలని ఎమ్మెల్యేకు జిల్లా యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలో భూపాలపల్లి ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడం జరుగుతుందని, ప్రెస్ క్లబ్ నిర్మాణం కోసం 35 లక్షల రూపాయలని కేటాయించడం జరిగిందని, నియోజకవర్గంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయించడం జరుగుతుందని హామీ ఇచ్చారని యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కుమార్ యాదవ్, సుధాకర్, రాము, సాంబయ్య, పూర్ణచందర్, రవి, డాక్టర్ సమ్మయ్య గౌడ్, సర్వేశ్వరరావు, చిరంజీవి, ఐలయ్య, రజినీకాంత్, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

# కులగణన ప్రకారమే బిసిలకు రిజర్వేషన్లు





## బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి

**ప్రజాపక్షం/నర్సంపేట :** స్థానిక సంస్థలలో కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకారం 42% రిజర్వేషన్లు కాకుండా, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన కులగణన ప్రకారమే బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. గురువారం నర్సంపేట పట్టణంలోని మేరు సంఘం భవన్‌లో శేర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన బిసి హక్కుల సాధన సమితి రౌండ్ టేండ్ సమావేశంలో కుమారస్వామి మాట్లాడారు. బిసి కులాలు కులాలుగా విడిపోవడం వలన మాత్రమే అన్ని రంగాలలో వెనుకబడి పోతున్నామన్నారు. బిసిలు ఇకనుంచి తమ కుల గుర్తింపు కలిగి ఉంటూనే గ్రామాలు వారిగా, పట్టణాలు వారిగా, నియోజకవర్గం వారిగా అన్ని కులాలతో ఐక్య కమిటీలుగా ఏర్పడి మన హక్కులు సాధించుకోవాలన్నారు. అనంతరం మహాదేవుని జగదీష్ కన్వీనర్ గా అడ్ హక్ కమిటీ వేశారు. కో కన్వీనర్‌లుగా గిరగాని సాంబయ్య, సిలువేరు కొమ్మాలు, ఓర్సు సాంబయ్య, రామగిరి రవికుమార్, గొలనకొండ రవి, బైరాగి రంగయ్య, ఆకారపు మోహన్, సిరిమల్లె నరేందర్, డాక్టర్ చలం, కె రమణాచారి, ఎల్లేశంలను ఎన్నుకొన్నారు. అడ్డగట్ల యువరాజు, వెంకన్న, అరుణ, సిహెచ్ స్వప్న, పద్మ, శ్రీలత, లక్ష్మి నారాయణ, తదితరులుపాల్గొన్నారు

**వరంగల్ :** బిసి కుల జనగణన కోసం, వివిధ బిసి కులాల చైతన్యం బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో కుమారస్వామి మాట్లాడుతూ జనవరి 31 న వరంగల్ పట్టణంలో జరిగే బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారనీ తెలిపారు. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేసి కుల జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలనీ కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేస్తున్న ప్రకటనలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు బిసి కుల గణన లెక్కల ప్రకారమే రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సహాయం

**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు):** ములుగు జిల్లా ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం మండలాలలో గ్రేస్‌సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో వెంకటాపురం మండలంలోని వీరభద్రపురం, పాత్రపురం, ఉప్పెడు, వీరాపురం, విఆర్‌కెపురం, వెంకటాపురం, మరికాల, కొత్తూరు, మరికాల, రామకృష్ణపురం గ్రామాలలో వెయ్యి మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వెంకటాపురం మండల పరిషత్ పాఠశాలలో నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు దుప్పట్లు, జంతికలు ఆట బొమ్మలు, తినుబండారాలను వెంకటాపురం పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కొప్పుల తిరుపతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. పేద పిల్లలకు సహాయం చేయడానికి ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎస్ఐ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది మురళీధర్‌రెడ్డి, సతీష్, పాఠశాల ఉపాధ్యాయురాలు జీవన జ్యోతి, గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ముత్రం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



## మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన



**ప్రజాపక్షం/బాన్సువాడ :** తమకు రావలసిన బకాయి వేతనాలను సకాలంలో చెల్లించాలని కోరుతూ బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రతినెల 5వ తేదీ వేతనాలు చెల్లించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని, తొలగించిన ఇద్దరు మహిళా కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంతోష్ గౌడ్, రేణుక, కమర్ అలీ, సంగీత, జైల్‌సింగ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కులకు అండగా టియుడబ్ల్యుజె



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక యూనియన్ టియుడబ్ల్యుజె (ఐజెయు) అని, జర్నలిస్టుల హక్కులకు అండగా నిలచి పోరాటాలు చేయడమే తమ లక్ష్యం అని యూనియన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సంపత్ కుమార్ అన్నారు. గురువారం పెంచికల్ పేట్ ప్రెస్‌క్లబ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం అక్రిడిటేషన్, హెల్త్ కార్డు, నివాస స్థలాల సాధనలో రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు చేసి, రక్షణ చట్టాలు సాధించడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ప్రకాష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నామ తిరుపతి, నాయకుడు మిలిన్ కుమార్, పాత్రికేయులు తిరుపతి, శ్రీధర్, కమలాకర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ - మిర్జాపల్లి వరకు రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రికి వినతి

**ప్రజాపక్షం/పాపన్నపేట :** మెదక్ రైల్వే స్టేషన్ నుండి మీర్జాపల్లి స్టేషన్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి కోరారు. అక్కన్నపేట నుండి మెదక్ రైల్వే లాగానే మెదక్ నుండి మిర్జాపల్లి వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర మంత్రికి వినతి పత్రాన్ని గురువారం మెయిల్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ ప్రాంతము అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి వెనువెంటనే అభివృద్ధి చెందాలన్నా మెదక్ రైల్వే స్టేషన్ నుండి మిర్జాపల్లి రైల్వే స్టేషన్ వరకు ఒక నూతన రైల్వే లైన్ను మంజూరు చెయ్యాలన్నారు. ఈ ప్రాంతము వ్యవసాయ అభివృద్ధి క్షేత్రంగా వెలుగొంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చర్చి, ఏడుపాయల వన దుర్గ భవాని ఆలయము, దేశంలోని ఎనిమిదవ అతిపెద్దదైనటువంటి ఫోర్ట్ పేరు మెదక్ కిల్లా, చరిత్రాత్మకమైన ప్రాంతం, ఒకవైపు పర్యాటక కేంద్రంగానూ పర్యాటకులకు ఆకర్షించే విధంగా ఉంటుందన్నారు. గతంలో తాను మెదక్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అక్కన్నపేట నుండి మెదక్‌కు నూతన రైల్వే లైను నిర్మాణంకు అయ్యే ఖర్చులో సగం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తానని కేంద్రానికి హామీ ఇవ్వడంతో మరి అప్పుడు అక్కన్నపేట్ నుంచి మెదక్ రైల్వే లైన్ సాధ్యమైందని విషయం గుర్తు చేశారు. మెదక్ పట్టణం నుండి మిర్జాపల్లి వరకు అయ్యే ఖర్చులో సగభాగం రాష్ట్ర ప్రభుత్వం భరించే విధంగా త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలుస్తామన్నారు.

## పూడ్చిన మృతదేహం ఎముకలతో క్షుద్ర పూజలు

ఐదుగురిపై కేసు నమోదు.. సిఐ ముత్యం రమేష్




**ప్రజాపక్షం/కౌటాల :** గుప్తనిధుల కోసం పూడ్చిన మృతదేహాన్ని తవ్వి ఎముకలను తీసుకెళ్లి క్షుద్ర పూజలు నిర్వహించిన ఘటనలో బెజ్జూర్ పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం కౌటాల సర్కిల్ ఆఫీసులో సిఐ ముత్యం రమేష్, ఎస్ఐ ప్రవీణ్ వెల్లడించారు. బెజ్జూర్ మండలం ఏటిగూడ గ్రామానికి చెందిన ఎర్నేని నాని ఈ నెల 16న అనారోగ్యంతో మరణించాడు. కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని గ్రామ సమీపంలో పూడ్చిపెట్టారు. అయితే, ఈ నెల 29న ఉదయం కుటుంబీకులు ఆ స్థలానికి వెళ్లి చూడగా అక్కడ దుర్వాసన రావడం, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, బొట్లు కనిపించడం వల్ల అనుమానం కలిగింది. పూడ్చిన మృతదేహాన్ని బయటికి తవ్వి, ఎముకలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించడంతో వెంటనే బెజ్జూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. గురువారం ఉదయం బెజ్జూరు మండలం కృష్ణపల్లి సమీపంలో ఐదుగురిని పట్టుకున్నారు. విచారణలో నిందితులు పూడ్చిన మృతదేహాన్ని తవ్వి, ఎముకలు తీసుకెళ్లి క్షుద్ర పూజలు నిర్వహించినట్లు అంగీకరించారు. అరెస్టైన నిందితుల్లో రమేష్ (బెజ్జూరు), పరమేశ్వర్ (కరీంనగర్), శంకర్ (గబ్బాయి, బెజ్జూరు), రావుజి (ఏటిగూడ), గొల్ల రాజులు (రామడుగు, కరీంనగర్ జిల్లా)కు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై సిఐ ముత్యం రమేష్ తీవ్రంగా స్పందించారు. అత్యాశకు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని. గుప్త నిధుల మోజులో క్షుద్ర క్రియలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.

## కాంగ్రెస్ పాలన తీరు మార్చుకోవాలి

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** కాంగ్రెస్ పాలన తీరు మార్చుకోవాలని, కాంగ్రెస్ పాలన తెలంగాణను డ్యామేజ్ చేసే విధంగా ఉందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ విమర్శించారు. అమలు గాని 6 గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పాలన మోసాలపై సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో కూడిన వినతి పత్రాన్ని బిఆర్ ఎస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ అమలు కాని 6 గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ ఆరు గ్యారంటీలను 420 హామీలను ఎగొట్టి ప్రయత్నం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చాలా తెలివిగా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందన్నారు. మొన్న జరిగిన నాలుగు గ్యారంటీ పతకాలు అమలు చేస్తామని చెప్పి నియోజకవర్గంలో 86 గ్రామాలు ఉంటే నాలుగు గ్రామాల్లో కూడా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయని పరిస్థితుల్లో కాంగ్రెస్‌పాలన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసిచైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి ,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, టిఎన్‌జిఒ మాజీ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్,పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు కార్యదర్శి, నర్సింలు, మందుల వరలక్ష్మి , డాక్టర్ శ్రీహరి , కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, మధుసూదన్ రెడ్డి, వివిధ మండలాల మాజీ సర్పంచులు మాజీ కౌన్సిలర్లు టిఆర్ఎస్ నేతలు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలి

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. కలెక్టర్ అదనపు కలెక్టర్ మాధురితో కలసి ఇస్నాపూర్ లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురు విద్యార్థులకు తమ విద్యాభ్యాసం, తాము ఏర్పాటు చేసుకున్న లక్ష్యాన్ని ఏలా చేరుకున్నది వివరించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు తమ ఇంటర్ చదివే సమయం నుండే ఐఐటిలో సీటు సాధన కోసం శ్రమించానని తెలిపారు. మాథ్స్ , కెమిస్ట్రీలో అత్యధిక శాతం మార్కులు రావడంతో జెఇఇ ఎంట్రన్స్‌లో 938 ర్యాంకు రావడంతో ఢిల్లీ ఐఐటిలో సీటు వచ్చినట్లు, అనంతరం కుటుంబ సభ్యులు, బంధువుల సూచన మేరకు ఐఎఎస్‌కు ప్రిపేర్ కావడం ఐఎఎస్‌లో ర్యాంకు వస్తే ఎంతో మంది ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కుతుందన్న ఉద్దేశంతో ఐఎఎస్ సాధన కోసం శ్రమించినట్లు కలెక్టర్ తెలిపారు. సివిల్స్ పరీక్షలో ర్యాంకు సాధించడం కోసం తాను శ్రమించిన విధానం విద్యార్థులకు తెలిపారు. అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతు పెళ్లైన తరువాత కష్టపడి చదివి ప్రభుత్వ గ్రూప్ 1 ఉద్యోగం సాధించిన తీరును వివరించారు. తాను ఒక వైపు సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ ఏలాంటి కోచింగ్ లేకుండానే ఇంటి వద్దే పిల్లలు చూసుకుంటూ గ్రూప్ వన్ ఉద్యోగం సాధించానని విద్యార్థులకు వివరించారు. కష్టాలను ఎదుర్కొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కాళాశాలలో రైజ్లింగ్ ఆకాడమీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంచి శిక్షణ పొంది రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని ఆశభావం వ్యక్తం చేశారు. అనంతరం వారిరువురూ గురుకుల పాఠశాలలో కిచెన్ షెడ్, డైనింగ్ హాలు, స్టోర్ రూం, పరిశీలించారు. విద్యార్తులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థుల సందేహాలను ఎప్పటి కప్పుడు నివృత్తి చేస్తూ విద్యార్థుల ఎదుగుదల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సలహాలు పాటించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు ఏఏ కోర్సులు చదివితే ఎలాంటి ఉపాధి అవకాశాలు ఉంటాయో విద్యార్థులు ఇప్పటి నుండి అవగాహన కల్పించుకోవాలన్నారు. వివిధ కోర్సులు ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా వివిద కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయ బృందానికి కలెక్టర్ సూచించారు. అనంతరంకలెక్టర్ అదనపు కలెక్టర్లు విద్యార్థులతో కలిసి నిద్రించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అద్యాపక బృందం ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో వారి సమస్య పరిష్కారం కోసం కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధితశాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భావన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పథకంలో జిల్లాలోని అన్ని సంక్షేమ పాఠశాలల యాజమాన్యాలు చేపట్టిన మౌలిక వసతుల పురోగతిపై మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను వేగవంతం చేసి ఫిబ్రవరి 10వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో పలు శాఖల జిల్లా, మండల, ఇంజనీరింగ్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

## కట్టుకున్నోడే కాలయముడు!

భార్యపై అనుమానంతో నిజామాబాద్ జిల్లాలో దారుణహత్య



**ప్రజాపక్షం/ఎడపల్లి :** నిజామాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు. అనుమానమే పెను భూతమై భార్యను భర్త దారుణంగా హతమార్చిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఆ పచ్చని సంసారంలో అనుమానం పెనుభూతమై విషాదాన్ని మిగిల్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. రెంజల్ మండలం బోర్గం గ్రామంలో నివాసముంటున్న స్వర్ణ(38) అనే వివాహితను భర్త పోతన్న అనుమానంతో గొంతు నులిమి హత్య చేసి చెరువులో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడని, వారి కుటుంబ సభ్యుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. భర్త పోతన్నపై అనుమానం వ్యక్తం చేసి అదుపులోకి తీసుకోవడంతో తానే హత్య చేసినట్లు ఒప్పుకోవడం జరిగిందన్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న పోతన్న ఎలాగైన కడతే ర్చాలన్న ఉద్దేశ్యంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో హత మార్చి చెరువులో పడవేశారని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించి భర్త పోతన్నను పోలీసులు అదుపులో తీసుకున్నారు. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు.

## అక్రమార్కుడికి అండగా ఉండటం సిగ్గుచేటు

రాష్ట్ర రైతు సంఘం నాయకులు కంజర భూమయ్య



**ప్రజాపక్షం/కోటగిరి :** కోటగిరిలో కెనాల్ భూమి అక్రమార్కుడికి అధికారుల, ప్రజాప్రతినిధుల అండ ఉండటం సిగ్గుచేటని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య అన్నారు. గురువారం కోటగిరి మండల కేంద్రంలో నిజాంసాగర్ కెనాల్ భూమి కబ్జా విషయంలో రైతులకు మద్దతుగా ఆయన కబ్జా స్థలాన్ని పరిశీలించి, మాట్లాడారు. కెనాల్ కబ్జా విషయమై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. రూ.లక్షల ఖరీదు చేసే భూమిని ఓ వ్యక్తి దర్జాగా కబ్జా చేసి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఫిర్యాదులు అందినా అధికారులు పట్టించుకోకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతుందన్నారు. ఈ కబ్జా వల్ల రైతులు తమ పొట పొలాలకు నీరు పోని పరిస్థితి ఉందని రైతులు ఆవేధన చెందుతున్నా.. అధికారులు పట్టడం లేదని భూమయ్య విమర్శించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే రైతులకు అండగా ఉండి, కెనాల్ స్థలం కబ్జా కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఇకనైనా కెనాల్ భూమిని అధికారులు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, అడ్డికె రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు రామ్‌దాస్, జిల్లా నాయకులు సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్, సిపిఐ నాయకులు రాజు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమాలు అతిక్రమిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావాలిని పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ శాసనమండలి, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ బూతులను ఆయన పరిశీలించారు. రెండు గదులను పాపన్నపేటలో ఎంపిక చేశామన్నారు. ఒకటి పట్ట బద్రుల ఎమ్మెల్సీ మరొకటి ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించకుండా జాగ్రత్త పడాలని ఎన్నికల నియమాల్ని ఉల్లంఘింస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించిన కలెక్టర్

మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు బాగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను భౌతిక శాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలను అడిగి జవాబులను రాబట్టారు విద్యార్థులు సంతృప్తికరమైన జవాబులు ఇవ్వడంతో ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పాపన్నపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించి అభినందించారు. ఆయన వెంట పాపన్నపేట తహసిల్దార్ సతీష్, ప్రధానోపాధ్యాయులు మహేష్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## మహాత్మా... కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిపించు

మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలను ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని, డిక్లరేషన్ పేరుతో హామీల పేరుతో గ్యారంటీల పేరుతో 420 భూటకపు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని, మహాత్మా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిపించమని మెదక్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ పిలుపు మేరకు జనవరి 30 నాటికీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులైన నేపథ్యంలో 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువా రం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు భట్టి జగపతి, కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు నాయకులతో కలసి మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వినతి ప త్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిలు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం సరిగ్గా ఈ జనవరి 30న 420 రోజులు పూర్తిచేసుకుంటోందని, మోసపూరిత వాగ్దానాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతినిత్యం ప్రజలను వంచిస్తూనే ఉన్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ కన్వీనర్ మాజీ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, కోకన్వీనర్లు కృష్ణ గౌడ్, లింగ రెడ్డి, జుబేర్ అహ్మద్, మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్లు కిషోర్ జయరాజ్, సుంకయ్య, కౌన్సిలర్ చంద్రకళ, రబీ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణ వందేళ్లు వెనక్కి

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** కాంగ్రెస్ దుష్పరిపాలనతో తెలంగాణ వందేళ్లు వెనక్కి పోయిందని కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో భయంకరమైన రోజులు వచ్చాయని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లాలో పర్యటించిన ఎమ్మెల్సీ కవిత అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అబద్ధాలతో సిఎం రేవంత్‌రెడ్డి కాలం వెల్లదీస్తున్నారని విరుచుకపడ్డారు. అబద్ధం అద్దం ముందు నిలబడితే రేవంత్‌రెడ్డి బొమ్మ కనబడుతుందని ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టి ఎక్కువకాలం పరిపాలించలేరని స్పష్టం చేశారు. ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి తెలియక హామీలిచ్చామని స్వ యంగా అసెంబ్లీ స్పీకర్ అన్నారని గుర్తు చేశారు. 130 ఏళ్ల చరిత్ర ఉందని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఎలా మోసం చేస్తుందని ప్రశ్నించారు. చేతిలో ఎర్రబుక్ పట్టుకుని దేశమంతా తిగే రాహుల్‌గాంధీ తెలంగాణ పరిస్థితులపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. గతంలో తెలంగాణను ఆంధ్రతో కలిపి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కూడా అదే ఒరవడిని కొనసాగిస్తోందని మండిపడ్డారు. పసుపు పంట మార్కెట్‌కు వస్తున్న నేపథ్యంలో కనీస మద్దతు ధర ప్రకటించటానికి కేంద్రంలోని బిజెపి సర్కార్ తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు.

## పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం పోరాడుతా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుమల్ రెడ్డి

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఆదిలాబాద్,కరీంనగర్, మెదక్, నిజామాబాద్, జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ మిత్రులు తమ యొక్క మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసనమండలిలో పాత పెన్షన్ పునరుద్ధరణకై పోరాటం చేస్తానని టిఎస్‌సిపిఎస్ ఇయు బలపరుస్తున్న అభ్యర్థి తిరుమల్ రెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. ఖానాపూర్‌లో, ఉపాధ్యాయులను, ఉపాధ్యాయ సంఘం నాయకులను కలిసి ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. తాను మంచిర్యాలలో జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తి అని తన 30 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేశానన్నారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు తనకు అవకాశం కల్పిస్తే కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని, సాంకేతిక సమస్యలతో ఉన్న 2003 డిఎస్‌సి ద్వారా నియామకాలైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పర్తింపుకు కృషి చేస్తానని అన్నారు.

# ప్రైవేట్ వ్యక్తుల వినియోగం వారి పనేనట..!

అవసరాల నిమిత్తం వినియోగించుకుంటున్నట్లు పేర్కొన్న తహసీల్దార్, ఆర్ఐ



**ప్రజాపక్షం/చెన్నూరు :** మండలంలోనే కీలకమైన కార్యకలాపాలకు నెలవైన తహసీల్దార్ కార్యాలయ విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తూ కార్యాలయాన్ని అధికారులు ప్రైవేట్ వ్యక్తుల చేతికి అప్పగించిన ఉదంతం చెన్నూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధ్యతలు బరువైౖ అధికారులే ప్రైవేట్ వ్యక్తులకు బాధ్యతలు అప్పగించగా, రికార్డుల వివరాలు, మోకా పంచనామా, పాస్ బుక్కుల జారీ వంటి వాటితో పాటు పలు సేవల నిమిత్తం కార్యాలయాన్ని ఆశ్రయించే ప్రజలు, రైతుల వద్ద నుండి భారీగా వసూళ్లు చేస్తున్నారంటూ స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా తహసీల్దార్ కార్యాలయంలో పలు కార్యకలాపాలు చేపడుతూ, పలు ప్రభుత్వ భూములను భినామీ పేరన మార్చిన విషయం బయట పడగా, అట్టి విషయమై అధికారులను వివరణ కోరగా, చెన్నూరు, పొన్నారం, సోమన్ పల్లి గ్రామాలకు వ్యక్తులను ఉపయోగించుకుంటున్నట్లుగా తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చెబుతుండడం స్థానికంగా దుమారం లేపుతుంది.

### బినామీల పేరున భూములు..

అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకొని చెన్నూరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తితో పాటు పొన్నారం, సోమన్ పల్లి గ్రామాలకు చెందిన వ్యక్తులు చేతులు కలిపి రికార్డుల్లో భారీ అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు ఉన్నాయి. చెన్నూరు, పొన్నారం, సోమన్ పల్లి గ్రామాల్లోని పలు ప్రభుత్వ భూములను వారి కుటుంబ సభ్యుల పేరన ఉన్నట్లుగా రికార్డుల్లో చేర్చడమే కాక రికార్డుల్లో లేని పలు సర్వే నెంబర్లు సృష్టించి ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను అనుభవిస్తున్నట్లుగా ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. పొన్నారం, సోమన్ పల్లి గ్రామాల్లో పలు ప్రభుత్వ భూములను వారి కుటుంబ సభ్యుల పేరున రికార్డుల్లోకి ఎక్కించడం, ఆయా గ్రామాల్లో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రికార్డు రూములో విధులు నిర్వహించే వ్యక్తి చెన్నూరు శివారులోని 1418/1లో గల 4ఎకరాల స్థలాన్ని, స్థలం లేనప్పటికీ చెన్నూరు శివారులోనే 869/40/1/1 అనే ఓ సర్వే నెంబర్ సృష్టించి అతని భార్య పేరున 1ఎకరం 39 గుంటల భూమి ఉన్నట్లుగా రికార్డులోకి ఎక్కించి ప్రభుత్వ పథకాలను తీరగా అనుభవిస్తున్నాడు. ఇటీవలే నిర్వహించిన సర్వేలో రైతు బంధు పథకం నుండి వ్యవసాయేతర భూములను తొలగించినప్పటికీ, ఎడిఎ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించే అతని సోదరుడి సహాయంతో రైతు భరోసా పథకం నుండి తొలగించకుండా చేసాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలోనూ ఎన్నో ప్రభుత్వ భూముల వివరాలు ఇతగాడు మాయం చేసి వాటి వివరాలను పట్టణంలోని పలువురు బడాబాబులకు అప్పగించి భారీ వసూళ్లకు పాల్పడడమే కాక మరికొన్ని భూములను బినామీల పేరున మార్చి నేడు కోట్లకు పడగలెత్తాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో ముగ్గురు ప్రభుత్వ రికార్డు అసిస్టెంటులు ఉన్నప్పటికీ అధికారుల అండదండలతో కార్యాలయాన్నే తన కనుసన్నల్లో నడిపిస్తున్నట్లు తెలుస్తుంది. కొద్ది రోజుల క్రితమే ఈ ముగ్గురి ప్రైవేట్ వ్యక్తుల పలు అక్రమాలు చెన్నూరు తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లగా, పొన్నారం, సోమన్ పల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులను కార్యాలయం నుంచి పంపించి వేసినప్పటికీ, అక్రమంగా రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే ప్రైవేట్ వ్యక్తితో అధికారులకు పలు అక్రమ లావాదేవీల్లో వాటా ఉన్న కారణంగానే కార్యాలయం నుండి పంపించి వేయడం లేదని స్థానికంగా ప్రచారంలో ఉంది. బాధ్యతాయుతమైన స్థానంలో ఉంటూ అధికారులే ఇలాంటి వారిని కార్యాలయంలో కొనసాగించడం సమంజసం కాదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు కార్యాలయంలో జరిగే అక్రమాలపై విచారణ చేపట్టి, అక్రమార్కులతో కార్యకలాపాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

### ఇంకొద్ది రోజుల్లో కార్యాలయంలో నుండి పంపిస్తాము : మల్లిఖార్జున్



చెన్నూరు తహసీల్దార్‌గా నేను బాధ్యతలు చేపట్టడానికి ముందు నుండే ప్రైవేట్ వ్యక్తులు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవలే ఆర్ఐకి సహాయంగా ఉంటున్న పొన్నారం, సోమన్ పల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులపై అవినీతి ఆరోపణలు రాగా వారిని కార్యాలయం నుండి పంపించి వేసాం. రికార్డు రూములో బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తిపై కూడా ఆరోపణలు మా దృష్టికి వచ్చాయి. అతనిని కూడా కొద్ది రోజుల్లో కార్యాలయం నుండి తొలగించివేస్తాం.

